1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 4
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జూన్ 2018

## వెంటవెంటనే వెళ్లిపోయిన ఇద్దరు మహా రచయితలు

కథానికా శిల్పి
**పెద్దిభొట్ల సుబ్బరామయ్య**

నవలా సామ్రాజ్ఞి
**యద్దనపూడి సులోచనారాణి**





- అక్షరాస్యతతోనే నేరప్రవృత్తి నిర్మూలన, జాతి పురోగతీ
- తెలుగు అక్షరమాలపై చర్చకు ముగింపు
- నిఘంటువులపై వ్యాసావళి మొదలు
- తెలుగుభాషకు ఆధునిక హోదా అంటే...?
- ఆంధ్రప్రదేశ్ విభజనను కోస్తాంధ్ర ప్రజలు కోరుకోలేదా?!

**భాషోద్యమ కథానికలు**

మాతృభాష : చెన్నూరి సుదర్శన్
తెలుగుతల్లి : డా॥వాసా ప్రభావతి

**ధారావాహికలు**

మౌనంలోని మాటలు : ఆర్వీబి కుమార్
బౌద్ధం–వైజ్ఞానిక మార్గం:బొర్రా గోవర్ధన్

**ఇంగ్లీషులోనే పాలించాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించిందా?**

# జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు రచన 'తీర్పూ-తెన్నూ' వ్యాసాల సంకలనం విడుదల



ఎడమ నుండి కుడికి : మద్దాలి రఘురామ్ (కిన్నెర ఆర్ట్స్), వై.కె.నాగేశ్వరరావు (యువకళా వాహిణి), కళా జనార్దన మూర్తి (త్యాగరాయ గాన సభ), డా॥ కె.వి.కృష్ణకుమారి (ప్రముఖ రచయిత్రి), జస్టిస్ ఎ. రామలింగేశ్వరరావు (గ్రంథ రచయిత), శ్రీ రామ్ సర్ (ఆధ్యాత్మిక వేత్త), డా॥ సామల రమేష్‌బాబు ('అమ్మనుడి' సంపాదకులు), టి. చిరంజీవులు (కమిషనర్, హెచ్.ఎం.డి.ఎ.), బి.గోపీనాథ్ (కమీషనర్, ఇన్‌కంటాక్స్), డి.వి.మనోహర్ (మనోహర్ హోటల్ ఎం.డి), డా॥ సజ్జా లోకేశ్వరరావు (హృద్రోగ శస్త్ర చికిత్సా నిపుణులు), టి.సత్యనారాయణ (సామాజిక కార్యకర్త).

## తీర్పూ-తెన్నూ




2012 అక్టోబరు వరకూ 'నడుస్తున్న చరిత్ర' పేరుతో నడిచి అనేక అంశాలలో తనదైన ప్రత్యేకతను కలిగియున్న పత్రికే 'అమ్మనుడి' పేరుతో 2015 మార్చి నుండీ నడుస్తున్న సంగతి ఈ పత్రిక చదువరులందరికీ తెలిసిందే! 'నడుస్తున్న చరిత్ర' లో 15 ఏళ్లపాటు జస్టిస్ రామలింగేశ్వరరావు 'న్యాయపీఠం' శీర్షికన పలు సమకాలీన విషయాలను న్యాయశాస్త్రకోణం నుండి విశ్లేషించారు. పాఠకుల మెప్పును పొందారు. ఆ వ్యాసాల నుండి ఎంపిక చేసిన వాటిని ఇప్పుడు 'తీర్పూ-తెన్నూ' పేర 300 పుటల గ్రంథంగా వెలువరించారు. న్యాయశాస్త్ర గ్రంథాల ప్రచురణకు పేరొందిన ఏషియా లా హౌస్ వారు దీనిని ప్రచురించారు. పుస్తకం ఆవిష్కరణ సభ మే 21న హైద్రాబాదు-జూబ్లీ హిల్స్-దసపల్లా హోటల్లో జరిగింది. రచయిత 63వ పుట్టినరోజు కూడా కలిసి వచ్చింది. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్‌రావు పదవీ విరమణ సందర్భం కూడా ఈ రోజే కావడంతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఈకార్యక్రమం హుందాగా జరిగింది. తొలుత శ్రీ కొమరవోలు శివప్రసాద్ బృందం గంటపాటు చేసిన త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనల కచేరీ- 'ఈలామృతం' అందరినీ అలరించింది. ఆ వెంటనే ఎక్కువ ప్రసంగాలు లేకుండా క్లుప్తంగా జరిగిన సభలో ఆధ్యాత్మికవేత్త 'శ్రీరామ్ సర్' 'తీర్పూ తెన్నూ' గ్రంథాన్ని ఆవిష్కరించారు. విందుతో కార్యక్రమం ముగిసింది.

ఈ పుస్తకంలో 64 వ్యాసాలున్నాయి. ఇవన్నీ ప్రజలకోసం వ్రాసినవి. కనుక అందరి ఇండ్లలోనూ ఉండవలసిన, ప్రత్యేకించి అన్ని విద్యా సంస్థల్లోను, సామాజిక, రాజకీయ అంశాలపై పనిచేసేవారు, ఆలోచించే వారందరి దగ్గరా ఉండవలసిన పుస్తకం. వెల: రు. 300 లు. ప్రతులకు : ఏషియా లా హౌస్, హైకోర్టు ఎదురుగా, హైదరాబాద్ - 2 (040 - 24526212), లేదా - ఏషియా లా హౌస్, బ్యాంక్ స్ట్రీట్, కోఠీ, హైదరాబాదు - 95 (040 ౚ 24742324) ఇ మెయిల్ : asialawhouse12@gmail.com

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**జూన్ 2018**

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | ఇంగ్లీషులోనే పరిపాలించాలని.... | | 7 |
| **అక్షరాస్యత :** | అమ్మనుడిలో విద్యతోనే.. | **ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు** | 9 |
| **లిపి సంస్కరణ పై చర్చ :** | అమ్మనుడులను రక్షించుకోవడానికై.... | **రంగనాయకమ్మ** | 11 |
| **గీటురాళ్లు :** | రాతా... రోతా.... | **కీ.శే.తాపీ ధర్మారావు** | 17 |
| **కంప్యూటర్లు – తెలుగు :** | తెలుగు భాషకు ఆధునిక హోదా – 5 వీవెన్ | | 18 |
| **నిఘంటువులు :** | నిఘంటు రచనా పరిణామం.... | **కీ.శే.గిడుగు వెంకట సీతాపతి** | 20 |
| **చదువదగిన పుస్తకం :** | వలసవాదం, ప్రాచ్యవాదం.... | **ఆచార్య కె. పద్దయ్య** | 22 |
| **శ్రద్ధాంజలి :** | పెద్దిభొట్ల సుబ్బరామయ్య | **డా॥ వేదగిరి రాంబాబు** | 25 |
| | యద్దనపూడి సులోచనారాణి | **డా॥ వాసా ప్రభావతి** | 26 |
| **పెద్దోరి తీపి గురుతులు :** | వేయి ఏనుగుల బలాన్నిచ్చిన..... | **సన్నిధానం నరసింహశర్మ** | 30 |
| **మరణ వాంగ్మూలం :** | మీరూ పిడుగులు కావాలి... | **డా॥వేదగిరి రాంబాబు** | 34,40 |
| **పుస్తక సమీక్షలు :** | | **డా॥ ఎం.వి.శాస్త్రి** | |
| **పిట్ట చూపు :** | విభజనను కోరుకోలేదా.... | **చలసాని నరేంద్ర** | 47 |

**ధారావాహికలు :**

| | | | |
|---|---|---|---|
| **1. మౌనంలోని మాటలు 8 :** | సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ – | **ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు** | 35 |
| **2. బౌద్ధం–వైజ్ఞానిక మార్గం –14** | ..... | **బొర్రా గోవర్ధన్** | 42 |

**భాషోద్యమ కథానికలు :**

| | | | |
|---|---|---|---|
| **1. మాతృభాష** | ..... | **చెన్నూరి సుదర్శన్** | 27 |
| **2. తెలుగు తల్లి** | | **డా॥ వాసా ప్రభావతి** | 40 |

**కవితలు :**

| | | | |
|---|---|---|---|
| 1. మరణంలేని మరణం | | **డా॥ ఎన్.గోపి** | 46 |



ఫోటోలు : **తమ్మా శ్రీనివాసరెడ్డి** కంప్యూటరీకరణ:**లంకె జనార్దన్**

రేఖా చిత్రాలు : **పావులూరి చిదంబరేశ్వరరావు**


### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి' 8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244 ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్సరోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు-1.** ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించు కోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లు తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషిక పంపబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

# ఆహ్వానం

## "మన అమ్మనుడి తెలుగును కాపాడుకొందాం"

**వి**శాఖపట్టణం కేంద్రంగా ఒక ప్రముఖ సాంస్కృతిక సంస్థగా పనిచేస్తున్న "సమైక్య భారతి" 'మన అమ్మనుడిని తెలుగును కాపాడుకొందాం' అనే అంశం మీద ప్రచార సభలను, కార్యక్రమాలను చేపట్టాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీలైనన్ని తావుల్లోనూ, దేశంలో తెలుగువారున్న ఇతర పట్టణాల్లోనూ ఈ కార్యక్రమాలను నిర్వహిస్తాము. తొలుతగా ఏప్రిల్ 15న చెన్నైలో నిర్వహించాం. విశాఖపట్టణంలో మే 17న నిర్వహించాం. జూన్ 17 (ఆదివారం) నెల్లూరులో ఏర్పాటుచేశాం.

**నెల్లూరు టౌన్‌హాలులో జూన్ 17 ఆదివారం - సాయంత్రం 6 గం.లకు.**

**సభలో పాల్గొనే ముఖ్యులు :**

డా॥ సామల రమేష్‌బాబు (తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు)

శ్రీ 'అమరావతి' కృష్ణారెడ్డి (స్థానిక ప్రముఖులు)

డా॥మోపిదేవి విజయగోపాల్, ('సమైక్యభారతి' ముఖ్య సలహాదారు)

శ్రీ చెలంచెర్ల భాస్కరరెడ్డి (తెలుగుభాషోద్యమ సమితి, నెల్లూరు)

ఆచార్య ఆదిత్య (స్థానిక ప్రముఖులు, తెలుగుభాషోద్యమ సమితి)

శ్రీవి.లక్ష్మణరెడ్డి (జన చైతన్య వేదిక)

శ్రీ ఎం.ఆర్.కె. ఎం. సోడేకర్ (ఫౌండేషన్ ఫర్ సోషల్ అవేర్‌నెస్)

భాషోద్యమ సమాఖ్య స్ఫూర్తితో జరిగే ఈ సభలో మీ మిత్రులతో కలిసి పాల్గొనండి.

పి.కన్నయ్య 'సమైక్యభారతి' కేంద్ర కన్వీనర్
9491254852,8247454184

## తెలుగువారంతా చదవవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**
వెల : రు.200/-లు

ఆచార్యశ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
వెల :రు. 100/-




**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**
వెల : రు.350।-

రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.

**తెలుగుజాతి (ట్రస్టు)** - జీవక భవనం, 8-346, **అంగలకుదురు** పోస్టు తెనాలి - 522211ఫోన్ : 9440448244

# ఇంటిపన్ను నోటీసులు ఇంగ్లీషులోనే! పరిపాలనంతా ఇక ఇంగ్లీషులోనే!!
# ఇదేనా అభివృద్ధి వైపుకు తెలుగు ప్రభుత్వ ప్రయాణం?

ప్రాథమిక విద్యలో తెలుగులో బోధనకు ఉద్వాసన చెప్పిన పురపాలకశాఖ
ఇకపై సాధారణ పాలననుగూడా ఇంగ్లీషులోకి తెస్తున్నది. పరాకు వీడండి...ప్రశ్నించండి...

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**

**KRISHNA DISTRICT**

**INTEGRATED DEMAND BILL FOR 2018-19**
**Remittance into the Account of the Commissioner**

| | | | |
|---|---|---|---|
| Demand Bill No | : **I/107300011363** | Date | : **10/04/2018** |
| Assessment No | : **1073187283** | Old Assessment No | : **545089** |
| Name | : **SAMALA SITHA RAMA PRASAD, S/O RAMESH BABU** | | |
| House No | : **GF/G2 31-11-4** | Revenue Ward | : **Revenue Ward 5** |
| Block | : **Block No 5** | Locality | : **VIJAYAWADA MUNICIPAL CORPORATION** |
| Water Consumer No | : | Sewerage Consumer No | : |

| Tax Head | Current Year | | | Arrear Amount | Arrear Interest | Total Demand | Adjustments / Paid | Net Amount Payable |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1st Half | 2nd Half | Total | | | | | |
| a | b | c | d | e | f | g = d+e+f | h | i = g - h |
| PT* / PT on Land | 1,661.00 | 1,661.00 | 3,322.00 | 0.00 | 0.00 | 3,322.00 | 0.00 | 3,322.00 |
| Water Charges | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 |
| Sewerage Charges | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 | 0.00 |
| Total | 1,661.00 | 1,661.00 | 3,322.00 | 0.00 | 0.00 | 3,322.00 | 0.00 | 3,322.00 |

*PT - Property Tax

**This Bill is issued as per the following Act :**

| | | |
|---|---|---|
| 1. | Property Tax & Property Tax on land | Section-266(1) of Municipal Corporations Act, 1955 (formerly GHMC Act, 1955). |
| 2. | Water Charges | Section 341 to 371 of Municipal Corporations Act, 1955 (formerly GHMC Act, 1955) and water supply bye-laws. |
| 3. | Sewerage Charges | Section 319 to 336 of Municipal Corporations Act, 1955 (formerly GHMC Act, 1955) and sewerage bye-laws. |

**Guidelines for the Tax Payer**

1. The Single Demand Bill for both 1st half and 2nd half years is issued for the convenien...
2. Tax payers are at liberty to pay tax either half year wise or both at a time.
3. 5% rebate will be given if tax is paid for both half years at a time before 30th ...
4. Property tax can be paid through: Cash or Cheque at eSeva, Mee Se... Credit Card/Debitcard/Net Banking.
5. Due dates for payment of property tax without interest for current fina... year: 31st December.
6. A simple interest @ 2% per month will be charged in case of failure to pay ...
7. If the tax payers fail to pay the property tax within 15 days from the dat... can be collected by issuing a distraint warrant u/s Section-269 of Municipal C... Act, 1955).
8. Please bring this bill while paying at Office counter or eSeva or Mee Seva cente...

ఈ మాత్రం నోటీసును తెలుగులో ఇవ్వడం చేతకాదా?

సంపాదక హృదయం

# ఇంగ్లీషులోనే పరిపాలించాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించిందా?

నిన్నటితో ముగిసిన తెలుగుదేశం పార్టీ 'మహానాడు'లో పార్టీ జాతీయాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు – పరిపాలనలో, విద్యారంగంలో తెలుగు వినియోగం సంగతిని ఎక్కడా ప్రస్తావించలేదు. 'తెలుగుదేశం పార్టీ', 'తెలుగు ప్రజలు' అనే మాటల్ని పలికిన ప్రతిసారీ తెలుగు అనే మూడక్షరాలను పలుకక తప్పలేదు! లక్షలాది మంది కార్యకర్తలు, పార్టీ సభ్యులు, అభిమానులు పాల్గొంటున్నారు గనుకా, తాను హాయిగా అన్ని సంగతులూ చెప్పగలిగిందీ వినేవారికర్థమయ్యేదీ తెలుగే గనుక, తెలుగులోనే ఆయన గంటలకొద్దీ మాట్లాడారు. అంతే తప్ప – తెలుగు రాష్ట్రంలో, తెలుగుదేశం పార్టీ పాలనలో తెలుగుకోసం తమ ప్రభుత్వం ఏమి చేసిందీ చెప్పనే లేదు! అక్కడ ఆయన 'ఎదురులేని మనిషి'! ప్రశ్నించేవారే లేరు! ఆయన మాట్లాడిన రాజకీయమైన, పాలనాపరమైన ఇతర అంశాల జోలికి మేం పోవడం లేదుగానీ, అస్సలు మాట్లాడని అతి ప్రధాన అంశం గురించి మాత్రమే మనం ప్రస్తావించుకొందాం.

రెండు తెలుగు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలందరికీ – అల్ప సంఖ్యాక వర్గాలుగా భావించబడే వారిలో అతి కొద్దిమందికి తప్ప– తెలుగులో మాట్లాడితేనే బాగా అర్థమవుతుంది. వారిలో కూడా ఇతర భాషలు ఒకటో రెండో వచ్చిన కొంతమందికి తప్ప, తక్కిన వారందరికీ తెలుగు తప్ప మరింకేదీ అర్థం కాదు. అందుకనే, రాజకీయ నాయకులంతా ప్రజలతో తెలుగులోనే మాట్లాడుతారు...ఓట్లకోసం, మభ్యపెట్టడం కోసం, తప్పుదారి పట్టించడం కోసం! 'మహానాడు'లో జరిగింది ఇదే. ఎవరో అన్నట్లు – నాటి రామారావుగారు ఎంతో గొప్పగా పెట్టిన 'మహానాడు' ఇలా మాయనాడుగా – మాయా బజారుగా మారిపోయిందేమిటా అని– పార్టీ స్థాపన నుండీ దానితోనే నిలిచివున్న ఒక పెద్దాయన, తమ మనుమడితో సహా కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత, సాటివారితో మాట్లాడుతూ కంటతడి పెట్టుకున్నాడు. మాయాబజార్ సినిమాలో వియ్యాలవారి విందులాగా కనీసం విందులోనైనా అందరినీ తెలుగు రుచులతో తృప్తిపరచారుగదా అన్నాడు పక్కనే వున్న మనుమడు, కొంటెగా !

తెలుగు రుచుల సంగతేమోగాని, తెలుగు భాష సంగతిని మాత్రం ఎవరూ పట్టించుకోలేదు. ఎవరైనా ప్రస్తావిస్తే, పార్టీ వ్యతిరేక ముద్రవేస్తారేమోనని భయం. సర్వత్రా భయం. అత్యధిక సంఖ్యలో అమ్ముడుపోయే పత్రికల్లోగాని, ఛానెళ్లలోగాని ఎక్కడా ఆ వూసే లేదు. ఎవరిభయం వాళ్ళది!

1982 మే 28న 'తెలుగుదేశం పార్టీ' సదస్సులో తిరుపతిలో చేసిన భాషా విధాన తీర్మానం ఏమైంది? (ఈ తీర్మానాన్ని పూర్తిగా 'అమ్మనుడి'లో పలుమార్లు ఇచ్చాము). అందులోని 10 సూత్రాల్లో తొలి నాల్గింటిని మాత్రం ఇక్కడ మళ్లీ జ్ఞాపకం చేసుకొందాం.

1. సచివాలయం మొదలు పంచాయితీ సమితి కార్యాలయం వరకు అన్ని స్థాయిలలో ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో తక్షణం తెలుగు ఏకైక అధికార భాషగా పరిగణించబడి తెలుగు భాషలోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగాలి.

2. దిగువ న్యాయస్థానాలు మొదలు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వరకు అన్నిస్థాయిల్లో తెలుగు భాషలోనే కార్యకలాపాలు జరగాలి.

3. ప్రాథమిక పాఠశాలలు మొదలు, విశ్వవిద్యాలయాల వరకు అన్ని స్థాయిలలో తెలుగుభాషే బోధనా భాషగా గుర్తించబడాలి.

4. గవర్నరు పిల్లలు మొదలు శ్రామికుని బిడ్డల వరకు బాలబాలికలందరికీ ఒకే విధమైన ఏక ప్రమాణ విద్యాభ్యాసం జరిగేవిధంగా విద్యావ్యవస్థను సంస్కరించాలి. అంతేకాక తెలుగునాడులో తెలుగుభాష ఒక్కటి మాత్రమే

తప్పనిసరిగా నేర్చుకోవలసిన భాషగా అమలు చేయాలి.

అదే సందర్భంలో పార్టీ విధాన ప్రకటన చాలా స్పష్టంగా ఈ విధంగా ప్రకటించింది : *"రాజ్యభాషగా పరిగణించబడి ప్రభుత్వంచే అధికారయుతంగా ఆదరింపబడని ఏ భాషా పరిపుష్టి చెందదు. వికసించదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, కోర్టులలో, విద్యాలయాల్లో అన్ని స్థాయిలలో ఉపయోగపడగల విధంగా తెలుగు రాష్ట్రంలో స్థానం లేకుండా చేయటానికి ప్రజావ్యతిరేకులైనపాలకవర్గాలవారు ఇంతకాలంగా సాగిస్తూ వచ్చిన మోసపూరిత విధానాలు యికముందు సాగనివ్వమని 'తెలుగు దేశం' పార్టీ తీవ్ర హెచ్చరిక చేస్తున్నది".*

ఇప్పుడు ఆలోచించండి. అట్లా ప్రకటించిన 'తెలుగుదేశం పార్టీ' యే ఇప్పుడు తెలుగు ద్వేషం పార్టీగా ఎదిగింది. కారణం ఒక్కటే – నాటి తెలుగుదేశం పార్టీ ఎన్టీరామారావు గారిది. నేటి పార్టీ చంద్రబాబు నాయుడుగారిది. రామారావుగారు స్వాభిమానం, ప్రజలపట్ల ప్రేమ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం కలిగిన నాయకుడు. చంద్రబాబు నాయుడుగారు అందుకు పూర్తిగా విరుద్ధం. ఆ నాయకుడికి తెలుగంటే ప్రాణం. ఈయనకు తెలుగంటేనే ద్వేషం. ఇంగ్లీషు భాషే ఆయనకు ఆరాధ్యదేవత. ఆయన తెలుగులో ఎందుకు మాట్లాడుతున్నారూ అంటే తప్పదు గనుక! 'తెలుగుదేలయన్న దేశంబు తెలుగేను' గనుక!! అందుకనే ఈ 'పనికిమాలిన' తెలుగును నామ రూపాలు లేకుండా చేయడానికి ఆయన పూనుకొన్నారు. ఆయన పరిపాలనా కాలంలోనే – లోగడ తొమ్మిదేళ్ళలోగానీ, ఇటీవలి నాలుగేండ్లలోగానీ – తెలుగును పాలనలోనూ, విద్యారంగంలోనూ పూర్తిగా అణచివేయడానికి వీలైనంత కష్టపడి, వ్యూహాలు పన్ని మరీ శాయశక్తులా తన అధికార బృందంతో కలిసి కృషి చేశారు, చేస్తున్నారు. దానికి తాజా ఉదాహరణ : ఈ ఏడు ఆంధ్రప్రదేశ్‌లో జారీ చేసిన ఇంటి పన్ను నోటీసులు! (6వ పుట చూడండి) కొత్తరాజధాని నిర్మాణ శిలా ఫలకం ఇంగ్లీషులోనే వేయించిన నాటి నుండి – నేటి వరకు అన్ని స్థాయిల్లో జరుగుతున్న దుర్మార్గం ఇది. 2016 ఫిబ్రవరినాటి జి.ఒ.నెం.14 తో ముఖ్యమంత్రిగారూ, ఆయన మార్గదర్శి పురపాలకశాఖమంత్రిగారూ కలిసి ఆడిన నాటకం గుర్తుందా? ఆయన నోట ఒకమాట, ఈయన నోట మరొక మాట! చట్ట సభలో ఒక రకంగా, ఆచరణలో మరొక రకంగా! 2003లో బాబుగారి హయాంలో ఇచ్చిన జి.ఒ.నెం 86 అమలులో 'చిత్తశుద్ధి లేమి' నాటికీ నాటికీ అలాగే ఉంది. దాన్ని కొద్ది మార్పులతో తెలంగాణా రాష్ట్రం ఇటీవల 'చట్టం'గా తెచ్చి కఠినంగా అమలుకు నిర్ణయించింది. అయినా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి అదేమీ పట్టదు!

పరిపాలనను ఆధునికం చెయ్యడానికి నిర్ణయించి, ఆ విధంగా ముందుకు పోతున్నామంటున్నారు. సరే – ఆధునికం చెయ్యడమంటే అదంతా ఇంగ్లీషుతోనే అయితే, అందుకు ప్రజలభాష తెలుగు పనికిమాలినదనుకొంటే – దాన్ని అందుకు తగ్గట్లు ఆధునికంగా తీర్చిదిద్దుకోవచ్చుగదా. కంప్యూటర్‌కు సొంతభాష అంటూ ఏమీ ఉండదనీ, దానికి ఇంగ్లీష్ ఎట్లా ఉపయోగిస్తుందో, తెలుగు కూడా అట్లాగే పనికొస్తుందనీ ముఖ్యమంత్రిగారికీ ముఖ్య అధికారులకూ తెలిసిందేగదా! అత్యాధునిక, సర్వజనహిత రాజధానిని నిర్మించాలని కంకణం కట్టుకున్నవారికి ఆధునిక సాంకేతికతతో తెలుగును అత్యాధునిక భాషగా వినియోగంలోకి తేవచ్చుననీ–ఆ విధంగా ఎంతైనా ముందుకు పోవచ్చుననీ వారికి తెలియదా?! గతేడాది దాకా తెలుగులో, ఇంగ్లీషులోనూ ఉన్న పన్ను నోటీసులు ఉన్నట్లుండి ఇలా ఎందుకు ఏకపక్షంగా మారిపోయాయి? సొంతదేశంలో, సొంత రాష్ట్రంలో సొంత భాషను కోల్పోయి మళ్లీ బానిసలుగా భావించుకోవలసిన స్థితిలోకి తమను సొంత పాలకులే తోసివేస్తున్నారని ప్రజలు అనుకోవచ్చునా?

ఇది మొదలు మాత్రమే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిపాలన ఇప్పటికే ప్రధానంగా ఇంగ్లీషులో సాగుతోంది. కొన్ని శాఖలలో ప్రజలతో సంబంధించివున్న వ్యవహారాలు మాత్రం పరిమితంగా తెలుగులో సాగుతున్నాయి. ఇకపై అవన్నీ ఆధునీకరణలో, డిజిటలైజేషన్‌లో భాగంగా ఇంగ్లీషులోకి మారుపోతాయి. చట్టనిర్మాణం (లెజిస్లేచర్), పరిపాలన (ఎక్జిక్యుటివ్), న్యాయ పాలన (జుడీషియరీ) అన్నీ ఇంగ్లీషులోకి మారిపోయిన తర్వాత – ఇక తెలుగుకు సాధికారత – అంటే ప్రజలభాషకు సాధికారత ఎట్లా ఉంటుంది? అటువంటప్పుడు ఇది తెలుగు రాష్ట్రమే కాబోదు. భాషా రాష్ట్రమే కాబోదు. భాషా రాష్ట్రాలకోసం చేసిన ఉద్యమాలను మరచిపోయి, భావదారిద్ర్యంలో కొట్టుకుపోతున్నాం. ఇది ఇలాగే సాగితే ఈ రాష్ట్రం భౌగోళిక స్వరూపమూ మారిపోవచ్చు. ఏమైనా కావచ్చు.

ప్రపంచంలోని వివిధ పురోగామి దేశాలూ, అభ్యుదయ దేశాలూ భాషా స్వాతంత్ర్యాన్ని, భావ స్వాతంత్ర్యాన్ని కాపాడుకొని, స్వాభిమానంతో ముందుకు సాగుతున్న దశలో మనం ఈ వెనుకచూపుతో పతనాన్ని ఎందుకు కోరుకొంటున్నాం?

సామల రమేష్‌బాబు

తేదీ : 30-5-2018

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# అమ్మనుడిలో విద్యతోనే సరైన అక్షరాస్యత... అక్షరాస్యతతోనే నేర ప్రవృత్తి నిర్మూలన, సమాజ పురోగతి

కర్ణాటక ఎన్నికల సందడి ముగిసింది. ఆర్థికబలంతో, అంగబలం తో అధికారాన్ని చేజిక్కించుకొనే రాజకీయ క్రీడ మొదలయ్యింది. కొందరు ఈ పార్టీవైపు అనీ మరి కొందరు మరో పార్టీవైపూ అంటూ జట్టుకట్టివాదిస్తున్నారు. ఈ వాదనలలో కొన్ని సముచితంగా అనిపిం చినా ఎక్కువ శాతం సాధారణ స్థాయిలోనే ఉన్నాయి. ఈ వాదనలలో ఎవరైనాఏదైనా ఒక పార్టీ వైపు చేరి వాదించినా పెద్దగా ప్రయోజనం ఉంటుందనుకోలేం. ఎందుకంటే, ఈ ఎన్నికలలో ఏ పార్టీలూ సామాజిక స్పృహతో నైతిక సమస్యలపై పోరాడడానికి ప్రయత్నించ లేదు. వారు 'మరిన్ని ఓట్లను ఎలా రాబట్టుకోవాలి' అనే ఏకైక అంశంపైనే పోరాడారు. ఎవరైతే ఎక్కువ ఓట్లను పొందగలుగుతారో వారికే ఐదు సంవత్సరాలపాటు పాలనా పగ్గాలు అందుతాయి. వీరు ఆ తర్వాత ఐదు సంవత్సరాలపాటు ఈ అధికారాన్ని నిలబెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ వారి సమయాన్ని గడుపు తారు. అందుకే, మరొక ఘట్టం మొదలయింది. నిన్నటిదాకా అధికారం పొందడానికి పాటుబడితే ఇప్పటి నుండి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పాట్లు! ఓటర్లు మారరు. పాలించే రాజకీయనాయకులు మారరు. ఆడేది ఓటర్లే, ఆడించేది రాజకీయులే. ఇద్దరికీ ఒకే పెట్టుబడిదారు. ఇక్కడ ఏ నైతిక ఎజెండా లేదు. మనం మాత్రం ఓటుద్వారా మన ఎంపికను వ్యక్తం చేయాలి. మనం ఎటువంటి నిర్ణయాలనూ తీసుకోము. మనం ఏ నిర్ణయాలలోనూ పాల్గొనం. మనం బయటివారిగా ఉంటాం ఓటు వేయడం వరకే మన ప్రమేయం. మనకు ఇది ఒక క్రీడగా మారింది. మనం దీనితో ఆనంద పడుతున్నాం. ఇందులో ఐపిఎల్ క్రికెట్ కన్నా తక్కువ మత్తు ఉందని అనిపించడంలేదు. మనం ఈ మత్తు నుండి బయటపడలేమా? ఒక ఎన్నిక తరువాత మరో ఎన్నిక కొనసాగటానికి సహాయం చేస్తూనే ఉంటాం. దీన్ని మార్చడానికి మనం చొరవ తీసుకోలేమా? ఎందుకని. మనకు పోరాడడానికి ఎన్నో సమస్యలు ఉన్నా ఈదేశ భవిష్యత్తును నిర్ణయించేదిమాత్రం ఒక్కటే, అదే అక్షరాస్యత.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సరాలకు మనం సాధించిన అక్షరాస్యత 74 శాతం. అయినా అందులో52% మంది ప్రాథమిక విద్యవరకేపరిమితం కావటంతో చదవటం రాయటం వచ్చినవారు 22%మాత్రమే. అంటే మనలో చాలా మంది ప్రజాస్వామ్య నియమాలను అర్థం చేసుకోలేరు. ఆకలికైతే తప్ప గొంతు పెంచరు. మన ప్రాజెక్టులు విఫలమవుతాయి. ఎందుకంటే, అవి ఏమిటో, ఎందుకో, ఎవరికోసమో మన ప్రజ లకు తెలియవు. భారత్ తయారీ, డిజిటల్ ఇండియా, స్వచ్ఛ భారత్ అనే వాటివల్ల వారికి ఎలాంటిప్రయోజనం కలగబోతోందో ఏమిటో తెలియదు. మన పోలీసువాహనాలు ఇంగ్లీష్‌లో 'పోలీసు' సైన్‌ని ప్రదర్శిస్తాయి. మన జనాభాలో ఎంతశాతం మందికి అది చదవటంవచ్చు. మనం దాన్ని ఎందుకు అని ప్రశ్నించటం లేదు. ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఏది ప్రశ్నించాలి అనేది మనకు తెలి యదు. మనవిద్య, ప్రశ్నించడాన్ని మనకు బోధించడంలో విఫల మైంది. మన ప్రస్తుత విద్యావ్యవస్థ మన మానవీయ అభివృద్ధికి భిన్నంగా ఉందని మనకు తెలియదు. మన పాఠశాల లకు సామా జికశాస్త్రాలను మానవీయశాస్త్రాలను నేర్పడానికి సమయం లేదు. మన ప్రస్తుత విద్యావ్యవస్థ సామాజిక సమస్యలను పరిష్కరించ టంలో నిరుపయోగమైనది. అన్నిం టికంటే ప్రధానమైన ఉపాధి ఉద్యోగ అవకాశాలను అందరికీ అందిం చటంలేదు. మన సమస్య ఏమిటంటే మనకు ఒక ఉమ్మడి విద్యావిధానం లేక పోవటం. ఏ రాజకీయపార్టీ కూడా సరైన విద్యావిధానాన్ని సూచించి అమలు పరచడాన్ని ఎజెండాగా స్వీకరించక పోవడాన్ని మనందరం గుర్తించాలి. మాతృభాషలలో ఉమ్మడి విద్యా విధానం అమలులో లేనందువలన మన సమాజంలో జరిగే నేరాలకూ ఘోరాలకూ అంతులేకుండా పోతోంది.

భారతదేశంలో 2016 వ సంవత్సరంలో 39,000 మంది స్త్రీలు మానభంగానికి గురి అయ్యారు.ప్రతి సంవత్సరం ఇట్లా జరుగుతున్న మానభంగాలలో సుమారు 60 శాతం అక్షరాస్యత అతితక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహారు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, తెలంగాణా – ఈ ఏడు రాష్ట్రాలలోనే జరుగుతున్నాయి.

భారతదేశంలో 2016 వ సంవత్సరంలో షెడ్యూలు కులాలవారి పై జరిగిన అత్యాచార కేసులు మొత్తం సుమారు 41,000. ఇట్లా షెడ్యూల్డ్ కులాలపై జరిగే అత్యాచారాలలో సుమారు 80 శాతం అక్షరాస్యత అతితక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహారు, రాజస్థాన్, మధ్య ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, తెలంగాణా, ఈ ఏడు రాష్ట్రాలలోనే జరుగుతున్నాయి.

భారతదేశంలో 2016 వ సంవత్సరంలో సుమారు 34,000

మంది స్త్రీలను అపహరించారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న స్త్రీల అపహరణ కేసులలో 82 శాతం అక్షరాస్యత అతితక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహారు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, తెలంగాణా, ఈ ఏడు రాష్ట్రాలలోనే జరుగుతున్నాయి.అంటే అక్షరాస్యత తక్కువ ఉన్న రాష్ట్రాలలో బలహీనులపై దౌర్జన్యాలు ఎక్కువ. స్త్రీల అపహరణ, మానభంగాలు ఎక్కువ. ఈ దురాగతాలను అరికట్టడానికి అందరినీ అక్షరాస్యులుగా చేయటం అవసరం. అమ్మనుడి (మాతృభాష) లో అక్షరా స్యతా సాధన సులువు, తక్కువ వనరులతోతక్కువ సమయం లో అమలు చేయటం సాధ్యం.అందరికీ తప్పనిసరిగా అమ్మనుడితో అక్షరాస్యతా సాధన మన రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ ఎజెండాగా ఉండాలి.

2016 లోమహిళలపై లైంగిక అత్యాచారాలు ప్రతి గంటకీ దాదాపు ఐదు చొప్పున జరిగితే మహిళల అపహరణలు ప్రతి పావు గంటకూ ఒకరు చొప్పున జరిగాయి. ఇంకా మన సమాజంలో బలహీన వర్గాలపై ప్రతి గంటకూ ఆరు చొప్పున వేధింపులు నమోద య్యాయి. ఐతే వీటిలో 70 శాతం కంటే పైగా భారతదేశంలో అత్యంత నిరక్ష రాస్యులున్న రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనే జరిగాయి.

మన జనాభాలో 24% మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. మనం మన సామాజిక బాధ్యత గురించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పేదరిక నిర్మూలనా బాధ్యతను విస్మరిస్తున్నాం.

2016 లో దేశంమొత్తంమీద జరిగిన 31,496 హత్యలలో 60 శాతం హత్యలు జాతీయ సగటుకంటే అక్షరాస్యత అతితక్కువ ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, ఒరిస్సా, ఆంధ్ర ప్రదేశ్, అస్సాం, తెలంగాణ, ఇంకా ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలోనే నమోద య్యాయి.

2016లో వాహనాలను నిర్లక్ష్యంగా నడపడంవల్ల 1,50,364 మంది మరణించారు. అయితే, వాటిలో సగానికి పైగా వాహనాలు తక్కువగా ఉన్నప్పటికీ అక్షరాస్యత అతితక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, జార్ఖండ్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇంకా ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలలోనే నమోదయ్యాయి.

2016 లో దేశం మొత్తంమీద నమోదైన 7,628 వరకట్న మరణాలలో, 76శాతం కంటే ఎక్కువ అక్షరాస్యత రేటు జాతీయ సగటు కంటే తక్కువ ఉన్న రాష్ట్రాలలోనే జరిగాయి.

మన సంపదలో 70%కంటే ఎక్కువ 1%కంటే తక్కువ మంది చేతుల్లో ఉంది. ఇది, మనం సమసమాజం వైపుగా నడవడం లేదు అని సూచిస్తోంది. విద్యకోసం మన బడ్జెట్ కేటాయింపు ఈ శతాబ్దం ప్రారం భంలో ఉన్న 4.4% నుండి ఈ సంవత్సరం 3.71% కి తగ్గింది. ఇది విద్యను ప్రైవేటు వ్యాపార సంస్థలకు అప్పగిస్తున్నామని సూచిస్తుంది. అంటే విద్య కొందరు వ్యాపారస్తుల చేతుల్లో కేంద్రీకృతమౌతోంది.

ఈ నేరాల అంకెలు అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పు కొంటున్న మన దేశ వైఫల్యాన్ని సూచిస్తోంది. అంతేకాదు, పెరుగుతున్న మన నేర ప్రవృత్తి ప్రజల అక్షరాస్యతా సాధన వైఫల్యంతో ముడిబడి వుందని చెప్పటానికి ఇంకా వీటికంటే మరిన్ని రుజువులు అవసరం లేదు. అక్షరాస్యతా లోపం దేశానికి శాపంగా పరిణమించింది అని చెప్పటానికి సందేహపడవలసిన అవసరం లేదు.

పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్గనిస్తాన్, బంగ్లాదేశ్ తప్ప మిగిలిన అన్ని ఆసియా దేశాలలోనూ అక్షరాస్యత రేట్లు దాదాపు 100% లేదా 90% దాటి ఉన్నాయి. వారి తలసరి ఆదాయంకూడా అధికంగా ఉంది. ఈ దేశాలన్నీ విద్యా మాధ్యమంగా మాతృభాషను కలిగి ఉండ టమే అక్షరా స్యతా ప్రచారాలు విజయవంతం కావడానికి కారణం. **మనం 80వ దశకంలోనే ఆంగ్లమాధ్యమంగా నేర్చుకోవడం మొదలు పెట్టడంతో అక్షరాస్యతా విప్లవాన్ని అందిపుచ్చుకోలేక పోయాము. నేడు మనకు మిగిలింది అనేక వర్గాలుగా విభజించబడిన సమాజం. చదువురానివారు లేని దేశంగా, నిరక్షరాస్య రహిత సమాజంగా మనని తీర్చిదిద్దే ఆలోచనలు చేసే పార్టీ ఏదైనా ఉంటే మీతో కలిసివస్తాం అని చెప్పండి.**

130 కోట్ల మందికి పైగా ఉన్న జనాభాలో 14 ఏండ్లలోపున ఉన్న వారు 30% మంది. 60ఏండ్లు పైబడినవారి జనాభా 8% మాత్రమే. ఇంకా ఉద్యోగ ఉపాధి అవసరం ఉన్న జనాభా అంటే 15-60 సం.ల మధ్యవయసు ఉన్నవారు 62% మంది.15-25మధ్య వయసువారు ఇంకా చదువులో ఉంటారనుకుంటే వారి శాతం 12తీసివేస్తే నికరంగా 50% మందికి ఏదో ఒక పని కావాలి. అంటే మన దేశ జనాభాలో 60-65కోట్లమందికి ఉద్యోగ ఉపాధి అవసరాలు తీరాలి.

ఒక వేళ ఇన్ని కోట్ల మంది ఆంగ్ల మాధ్యమంలో చదువుకొన్నా కూడా ఏ విదేశం వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించగలదు? ఒక్క కోటిమందికైనా విదేశాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయా? గత సంవత్సరం ప్రపంచం మొత్తం మీద చూస్తే మనదేశం నుండి విదేశాలకు వెళ్ళినవారు 5 లక్షలమంది మాత్రమే.వీరిలో ఎక్కువ (85%) శాతం పట్టభద్రులు కాదు. అధిక శాతం ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లిన వృత్తిపనివారలే. మళ్లీ వీరిలో కూడా ఎక్కువమంది అరబ్బు దేశాలకువెళ్లినవారే. ఈ వివరాలన్నీ మన నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్నాయి.

**ముందుగా మనందరం సంపూర్ణ అక్షరాస్యతను సాధించాలి. ఆ అక్షరాస్యత అమ్మనుడుల ద్వారానే త్వరగా సాధ్యం అవుతుంది. మన ఎన్నికల ఎజెం డాలో మనం విస్మరించిన అమ్మనుడుల సాధనను అదీ మాతృభాషలలో అమలు చేయడాన్ని ప్రాథమిక కర్త వ్యంగా అమలుపర్చేందుకు చర్యలు చేపట్టాలి.**

వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.

లిపి సంస్కరణ చర్చ

రంగనాయకమ్మ
040 2311 7302

# ‘తెలుగు అక్షరమాల’ గురించి చర్చించినవారు

**నేను** “అమ్మ నుడి” పత్రికలో, 2017 డిసెంబరులో, “తెలుగు అక్షరమాలని కొంత సంస్కరించుకోవాలి” అనే పేరుతో రాసినది, పాఠకులకు తెలుసు.

ఆ వ్యాసంలో వున్న విషయాల మీద, **2018 జనవరి** నించి, **‘మే’** నెల వరకూ సాగిన చర్చలన్నిటినీ చూశాను. ఈ చర్చలు ఇంకా సాగితే సంతోషమే. ఇంకా కొన్ని అభిప్రాయాలు తెలుస్తాయి. అయినా, పత్రికలో, ఇన్ని నెలల పాటు చోటు ఇవ్వడం కష్టం అవుతుంది కదా?

మే వరకూ సాగిన చర్చల్లో పాల్గొన్న వారందరూ, నా వ్యాసంలో విషయాలతో దాదాపు ఏకీభవిస్తూనే, కొన్ని చోట్ల విభేదిస్తూ కూడా, తమ అభిప్రాయాల్ని కొన్నిటిని ప్రత్యేకంగా చెప్పారు. అవి కూడా చర్చనీయాంశాలుగానే వున్నాయి.

‘చర్చ’ అనేది, ద్వేషాలతో జరిగే పోరాటం కాదు. ఒకరి నించి ఒకరు నేర్చుకోవడానికీ, చివరికి ఏ నిర్ణయాలకు రావాలో తేల్చుకోవడానికీ, చర్చ అత్యవసరమే. ఇన్ని నెలలపాటు చర్చకు అవకాశం ఇచ్చినందుకు పత్రిక వారికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

‘తెలుగు అక్షరమాల’ గురించి చర్చించవలిసిన విషయాలు ప్రస్తుతం రెండే. (1) కొన్ని అక్షరాల్ని తీసివెయ్యడం. (2) కొన్ని అక్షరాలలో గుర్తుల్ని మార్చడం. – ఈ 2 విషయాల మీదే చర్చకులు దృష్టి పెట్టుకుంటే, చర్చల పేజీలు చాలా తగ్గేవి. కానీ, చర్చకులందరూ (నేనుతప్ప) భాషా శాస్త్రవేత్తలు కాబట్టి, శాస్త్రవిషయాలు చాలా రాశారు.

2018 జనవరి సంచికలో, ‘అక్షరమాల’ సంగతులు చర్చించిన వారు, నలుగురు. వీరిలో ఒకరిద్దరు, వెనకటి కాలపు శాసనాలలో వున్న అక్షర రూపాల గురించి వివరించే ప్రయత్నాలు చేశారు. కానీ, ఇప్పటి మన సమస్య, ‘ఈనాటి అక్షరమాల’ విషయమే. ‘శాసనాల’ సంగతుల్ని చర్చించుకుని నిర్ణయించుకునేదేమీ ఇక్కడ వుండదు. ఈనాటి ‘అక్షరమాల’లో మార్పులు మన పిల్లలకు ఎలా అవసరమో, అవి చూడడమే మనకు ముఖ్యం.

జనవరి నించీ చర్చించినవారి అభిప్రాయాలమీద నా స్పందనలు, క్లుప్తంగా చెపుతాను.

**1. 2018 జనవరిలో: (1) మలయశ్రీ గారు.**

☆ ఈయన, **‘ఋ, ౠ; ఌ ౡ’** ల్ని తీసివెయ్యాలనే అన్నారు. కానీ ఈ 4 అక్షరాల్నీ ‘అచ్చులే’ అన్నారు. అయితే, ఈ అక్షరాల గురించి నేను, ‘ఇవి, అచ్చులు కాలేవు’ అన్నదాన్ని వీరు పట్టించుకోలేదు. – ‘అచ్చు’ అక్షరానికి ఒక్క శబ్దమే వుంటుంది; అలా వుంటేనే అది ‘అచ్చు’ అవుతుంది. కానీ, ఆ 4 అక్షరాలకీ, తెలుగులో, **‘అరూ’, అలూ’** అంటూ, రెండేసి, మూడేసి శబ్దాలు వున్నట్టు తేలుతుంది. అవి, ‘అచ్చులు’ ఎలా అవుతాయి? ఆ అక్షరాలకు ఏవో ‘ప్రత్యేకతలు వున్నట్టు’ మలయశ్రీగారు అంటారు. మన పిల్లలకు మనం తేలికగా చెప్పుకోవడమే మనకు ముఖ్యం. మనకు అక్కర లేదని వదిలి వేసే అక్షరాల్లో వుండే ప్రత్యేకతల సంగతి మనకెందుకు?

☆ ‘కొన్ని తెలుగు అక్షరాలకు తలకట్లు లేవనే ప్రశ్న’ నాకు ఎందుకు రాలేదని, మలయశ్రీ గారు అన్నారు. ఆ ప్రశ్న నాకు రాలేదని కాదు; వచ్చింది. వచ్చి సంతోషించాను. కానీ ఆ మాట నేను అనలేదు. ఏ అక్షరానికైనా గీతలు ఎంత తగ్గితే, అంత మంచిది. వాటిని పిల్లలకు నేర్పడం అంత తేలిక. ‘ల’ కి తలకట్టు వుంటే తేలికా, అది లేకపోతే తేలికా? **‘బ, భ’** వంటి జంట అక్షరాలకైతే, రెంటికీ తలకట్లు వుండడమో, లేకపోవడమో, జరగాలి గానీ, విడి అక్షరాలకైతే, ఆ రూలు అక్కరలేదు.

☆ **‘సా’** కూడా, **‘నా’** లాగే వుండకుండా, ‘సా’ కి గీత పైకి ఎందుకు సాగుతుంది? – అంటారు ఈయన. **‘సా, నా’**లు, ఒకే రకం శబ్దాలా? శబ్దాలు తేడాగా వున్నప్పుడు, ఆ అక్షరాల ఆకారాలు తేడాగా వుండొద్దా? ‘సా, నా’లు ఒక్కలాగే వుండాలి అంటామా?

☆ **‘క, ఖ’** అని కాకుండా, అవి **‘ క, క ’** లుగా, వుండవచ్చు – అన్నారు మలయశ్రీగారు. ఇది బాగుంది.

**జనవరిలోనే: (2) నంద్యాల నారాయణరెడ్డి గారు. ‘ఙ, ఞ’** అక్షరాల గురించి, ఈయన, వాటిని అలాగే వుంచాలనే అన్నారు. వాటిని తమ ప్రాంతంలో ఒక రకంగా పలుకుతామని అన్నారు. ఎవరు, ఎలా పలికినా సరే, **‘ఇన్యా, ఇణీ’**లు, అచ్చులుగా గానీ, హల్లులుగా గానీ, పనికి రావు. పిల్లలకి చాలా అన్యాయం.

**జనవరిలోనే: (3) డి.నటరాజ్‌గారు.** కొందరు, **‘ణ’**కి బదులు **‘న’** నే వాడాలి – అని చేసే వాదనని ఈయన వ్యతిరేకించారు. ఇది మంచిది. కానీ, ఈ వ్యతిరేకతకి ఈయన చూపిన కారణం, **‘ణ’** ని, **‘న’** గా పలికితే, **‘ణ’** కి వుండే ‘అందం’ పోతుంది – అన్నట్టు అన్నారు. అక్షరాల్లో కొన్నిటికి ‘అందాలు’ వుంటాయనీ, కొన్నిటికి వుండవనీ, అనుకోవడం సరైన అవగాహన కాదు. కొన్ని ప్రాంతాల్లో **‘ణ’**ని పలకరు కాబట్టి, వాళ్ళు **‘రాణి’** అనే మాటని, ‘రాని’ అంటారు. వాళ్ళకి అదే ఇష్టం! అదే ‘అందం’! ఆ మాటని **‘రాణి’** అంటే, అది, వాళ్ళకి హాస్యం! **‘ణ, ళ’** ల్ని పలకకపోవడం కొన్ని ప్రాంతాల్లో వుంది. వాళ్ళకి అదే, సహజత్వం. వాళ్ళకి అదే ఇష్టం. **‘ణ, ళ’** శబ్దాలు ఇంగ్లీషులో లేవు. **‘ళ’** హిందీలో లేదు. వందలాది భాషల్లో ఏది ఎలా వున్నా, అది వాళ్ళ భాష! ఏ భాషలో శబ్దాల్ని బట్టి, ఆ భాషని చూడడమే సరైన నిర్ణయం. ‘ణ’ వాళ్ళు, **‘వీన’** అనలేరు. ఎవరినీ, **‘న’** వాళ్ళు, ‘వీణ’ అనలేరు. వాళ్ళని, ‘మారాలి’ అని నిర్బంధించనక్కరలేదు. ఇవి, **‘భావాల’** విషయాలు కావు. అలవాటైన శబ్దాలు, అంతే!

అయితే, **‘ప్రామాణికం ఎలాగ?’** అనే ప్రశ్న వస్తుంది. అది ఇక్కడ

వొద్దు! నటరాజ్‌గారు, తెలుగుని, 'అందమైనది! సంగీత భాష! ఏ భాషలోనూ లేని సొబగులు తెలుగులో వున్నాయి' అనే రకం వర్ణనలు చేశారు. భాషాశాస్త్రవేత్తలు దీన్ని ఒప్పుకోరు. మానవులందరూ సమానులైనట్టు, ఆ మనుషులు మాట్లాడుకునే భాషల శక్తులన్నీ సమానమే. ఎవరి భాషని వాళ్ళూ, ఎవరి దేశాన్ని వాళ్ళూ పొగుడుకోవడం, సంకుచిత దృష్టి! అది వివేకం గల అవగాహన కాదు.

**జనవరిలోనే: (4) అల్లంసెట్టి చంద్రశేఖరరావుగారు**, శాసనాల్లో అక్షరాల రూపాల్ని గురించి చెప్పారు. అది 'చరిత్ర' కావచ్చుగానీ, వాటిని ఇక్కడ ఏం చేయగలం?

☆ ఈయన, **'ళ'** కి బదులుగా 'ల'నే వాడుకోవచ్చు – అన్నారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో 'ళ'ని పలకనే పలకరు గానీ, **'ళ'**ని పలికే ప్రాంతాలు చాలా వున్నాయి. 'కల' అనే మాటకీ, 'కళ' అనే మాటకీ, వాటి అర్థాల్లో, తేడాలు వుంటాయి కదా? అర్థాల్లో తేడాలు వున్నప్పుడు, శబ్దాల్లో కూడా తేడాలు వుండవద్దా? 'కళ'ని కూడా 'కల' అంటే, ఆ మాటల తేడా ఎలా తెలుస్తుంది? దీనికి ఒక కారణం కనపడుతుంది. 'ళ'ని వాడని తెలుగు వాళ్ళు, 'కల, కళ' అనే 2 మాటల్నీ 'కల'గానే పలుకుతూ, ఆ తేడాని ఎలా చెప్పుకుంటారంటే, ఆ 2 విషయాల్నీ, ఒకే సందర్భంలో వాడరు. 'నాకు కల వచ్చింది' అని 'కల' వచ్చినప్పుడు అంటారు. ఒక బొమ్మని, చూసి, అది నచ్చినప్పుడు, 'ఈ బొమ్మలో కల బాగుంది' అంటారు. ఆ సందర్భాలు వేరు వేరుగా వుంటాయి కాబట్టి, ఆ సందర్భాల్లో ఆ మాటలు వాడితే, అవి బాగానే అర్థం అవుతాయి.

హిందీలో, 'కళాకారుడు' అనే మాటని, **'కలాకార్'** అంటారు. మనం 'కల' అనే మాటని వాళ్ళు 'ఖ్వాబ్' అంటారు. కాబట్టి, మనకి లాగ వాళ్ళకి, 'కల, కళ' అనే మాటల మధ్య ఇబ్బంది రాదు. ఆ ఇబ్బంది మనకే కాబట్టి, మనం 'ళ'ని వదలలేము. 'అక్షరాల' విషయంలో, ఎవరి వాడుక ప్రకారం, వాళ్ళు చేసుకోవలిసిందే. కానీ, ఒక భాష వాళ్ళు 'కలాకార్' అంటే, మనం నవ్వుతాం. అలాగే, మనం 'కళాకారుడు' అంటే, వాళ్ళూ నవ్వుతారు. ఫర్వాలేదు. 'నవ్వులే' కదా? అవి, 'కోపాలు' కావు. ఎదటి వాళ్ళు నవ్వినా, అది సిగ్గుపడే విషయం కాదు. కానీ, నవ్వే వాళ్ళు, వెటకారంగా నవ్వకూడదు.

☆ చంద్రశేఖరరావుగారు 2 కొత్త విషయాలు తెచ్చారు. – మొదట ఒక ఉదాహరణ నేనే చూపిస్తాను. **'మేక, మాక, మ్యాక'** – ఈ 3 మాటల్లోనూ ఏదీ సరైన శబ్దం కాదు. 'మే'లో, 'ఏ' శబ్దం వుంది. 'మా'లో 'ఆ' శబ్దం. 'మ్యా' అనకుండానే 'యా' శబ్దం రావాలంటే, ఎలాగ? 'యా' శబ్దాన్ని ఇచ్చే తెలుగు 'అచ్చు' అక్షరాలు మనకి లేవు. కానీ, ఆ అక్షరాలు కావాలి. ఇప్పుడు వాటిని తేలేము. ఏదైనా కొత్త మార్గం వెతుక్కోవాలి. ఆ మార్గాన్ని చంద్రశేఖరరావుగారు, ఒక రకంగా సూచించారు. 'మేక' మాటలో, 'మే'ని, 'యా' శబ్దంతో పలకడమే ముఖ్యం కాబట్టి, 'మే' పక్కన, ఒక కొటేషన్ గుర్తుపెట్టి 'మే' క' అని రాసి, దాన్ని 'యా' శబ్దంతో పలకడంగా గుర్తించాలని ఈయన సూచన! ఇది మంచి సూచనే కదా? ఇది, మంచి సూచనే గానీ, ఈ కొటేషన్‌ని పెట్టే ఇబ్బంది కూడా లేకుండా, 'మేక' అని రాసినా, ఆ 'మే'ని 'ఏ'గా గాక, 'యా'గా పలకలేమా? ఇప్పుడు మనం, అలాగే పలుకుతున్నాం కదా? పలకడంలో అలాగే అంటాం గానీ, రాతలోనే, 'యా' శబ్దాన్ని చూపించాలంటే, ఆ కొటేషన్ సూచన పనికివస్తుంది.

☆ ఇంకో ఉదాహరణ చూడండి! ఇంగ్లీషులో 'బాంకు' అనే మాటని, మాట్లాడేటప్పుడు మనం, 'యా' శబ్దంతోనే అంటాం గానీ, రాసేటప్పుడు, 'బేంకు' అనీ, 'బాంకు' అనీ, 'బ్యాంకు' అనీ, రాస్తాం. కాబట్టి, రాసేటప్పుడు, **'బాం'** కు' అని కొటేషన్‌తో రాస్తే, తప్పకుండా 'యా' శబ్దంతో చదవగలం కదా? ఇలా చేసినా, చెయ్యకపోయినా, ఇది మంచి సూచనే. 'యా' శబ్దం కావలిసిన అక్షరాలకు కొటేషన్ మార్కు పెట్టడం కష్టం కాదు కదా? ఈ సూచనతో ఏకీభవించవచ్చు.

☆ ఈయన చెప్పిన **రెండో సూచన** ఏమిటంటే: తమిళ పద్ధతిని తెచ్చి చూపించారు. 'మైసూరు' అనే మాటని, తమిళంలో, 'మయ్‌సూరు' అని రాస్తారట. అలాగే, 'అమ్మ' అనే మాటని, 'అమ్‌మ' అని! – అసలు దీనికి కారణం **ఏమిటంటే:** మన అచ్చుల్లో, **'ఐ, ఔ'** అనే 2 అక్షరాలు వున్నాయి కదా? అయితే, ఈ అక్షరాలు, ఇతర అచ్చుల లాగ ఒక్కొక్క శబ్దంతో గాక, రెండేసి శబ్దాలతో వుంటాయి! – 'అ'లో అయితే, ఒక్క శబ్దమే. 'ఇ'లో కూడా అంతే. అలాగే, ఇతర అచ్చుల్లో కూడా! కానీ, **'ఐ'**లో అయితే, **'అయ్'** అని, 2 శబ్దాలు వుంటున్నాయి. ఒక అచ్చూ, ఒక హల్లూ వున్నట్టే కదా? అలాగే, **'ఔ'**లో, **'అవ్'** అనే 2 శబ్దాలు వున్నాయి. ఒక అచ్చూ, ఒక హల్లూ! 'అచ్చు' అంటే, ఒక్క శబ్దమే వుండాలి కదా? 2 శబ్దాలు వున్నది, 'అచ్చు' ఎలా అవుతుంది? ఈ 2 అక్షరాల్నీ, హల్లుల్లో పెట్టడానికీ వీలవదు; పోనీ, ఆ శబ్దాల్ని వదిలెయ్యడానికీ వీలవదు. ఆ శబ్దాలు తప్పకుండా మనకు కావాలి. వాటితో 'రాజీ పడడం' తప్ప ఇంకో మార్గం ఎలా వుంటుంది? 'వాటితో రాజీ' అంటే, వాటిని వుంచుకోవడమే. కానీ, చంద్రశేఖరరావుగారు చెప్పేది, **'ఐ'**ని, **'అయ్'** అనీ; **'ఔ'**ని, **'అవ్'** అనీ; రాయాలి – అని!

అసలు, **'ఐ, ఔ'**ల్లో, రెండేసి శబ్దాలు వున్నాయని ఈయన చెప్పేవరకూ నేను గమనించలేదు! ఇప్పుడు గమనించి ఆశ్చర్యపోతున్నాను. –అయితే, ఇప్పుడేం చెయ్యాలి? ఆయన చెపుతున్నట్టు చెయ్యవలిసిందేనా? అలా చెయ్యాలంటే, అది ఆ 2 అక్షరాలకే కాదు. మొత్తం అలా, 10 అక్షరాలకు చెయ్యాలి. **'క, చ, ట, త, ప; గ, జ, డ, ద, బ'** అనే 10 హల్లుల మీదా 'యా' శబ్దాలు రావాలి కదా?

**'గౌను'** అనే మాటని, **'గవ్‌ను'** అని రాయవలిసిందే కదా? **'చౌక'**ని, **'చవ్‌క'** అనీ, **'కైక'**ని, **'కయ్‌క'** అనీ! ఇలాగే, ఆ 10 హల్లులూ రెండేసి అక్షరాలుగా విడిపోతాయి! ఉదాహరణకి, 'కై' అనేది, 'క్+ఐ'గా మన పద్ధతిలో, చేస్తే సరిపోతుంది. కానీ, ఇప్పుడు, 'క్+అ+య్' = 'కయ్'గా విడదియ్యాలి. ఏ 'హల్లు'కి అయినా, చివరికి ఒక 'అచ్చు' కలవాలి గానీ, చివరికి హల్లు కలవడం, తెలుగు పద్ధతికి విరుద్ధం. అయినా, అలాగే చేద్దాం అనుకుంటే, 10 హల్లుల తోటీ, 'ఐ, ఔ' శబ్దాలు రావాలంటే, ఆ 10 అక్షరాలూ ఎన్ని అక్షరాలుగా విడిపోతాయో లెక్క పెట్టండి! 'ఐ'తో 20 అక్షరాలూ, 'ఔ'తో 20 అక్షరాలూ, కదా? తమిళ పద్ధతి అలా వుందేమో! మనకెందుకు అది?

'ఐకమత్యము' అనే మాటని, 'అయ్‌కమత్యము' అనీ; 'ఔషధము'

పరభాషను అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు

అనే మాటని, 'అవ్‌షధము' అనీ; రాయాలా? 'అమృతము'ని, 'అమ్‌రుతము' అనా?

నాకిది నచ్చడం లేదు. 'ఐ, ఔ'ల్లో రెండేసి శబ్దాలు వున్నాయి – అని ఇప్పుడే నాకు కొత్తగా తెలిసి సంతోషించాను గానీ, ఆ అక్షరాల్ని విడదీసి రాయడం అవసరం లేదనిపిస్తోంది. మన పిల్లలకి అలా నేర్పాలని అనిపించడం లేదు. కాకపోతే, ఆ 2 అక్షరాల్లో, రెండేసి శబ్దాలు వుంటాయనే నిజాన్ని మాత్రం పిల్లలకి రాసి చూపించి చెప్పాలి. ఇక వాళ్ళ ఇష్టం. 'ఐ'గా రాసినా, లేదా 'అయ్'గా రాసినా, మార్కులు వెయ్యడంలో, దాన్ని ఒకేరకంగాభావించాలి. అది, పిల్లలకే వదిలెయ్యాలి.

★ **'ఐ, ఔ'**ల్ని రాయడం పిల్లలకి కష్టం – అన్నారు ఈయన. కానీ, ఒక్క అక్షరాన్ని, 2 అక్షరాలుగా మార్చే పద్ధతి వల్ల నష్టాలు వున్నాయి. రాతలో అక్షరాలు నిలబడే చోటు పెరిగిపోతుంది. 'పైరు' అని రాసే దాన్నే, 'పయ్‌రు' అని రాస్తే? చోటు పెరిగిపోతుంది. ఇలా జరిగేది ఒక్క చోటే కాదు; అనేక మాటల్లో, అనేక చోట్ల జరుగుతుంది. తెలుగులో, 10 పేజీల్లో పట్టే రాత, ఇంగ్లీషులో దాదాపు 20 పేజీల వరకూ పోతుంది. తమిళంలో కూడా అంతే కావచ్చు. ఆ భాషల్లో అది తప్పనిసరి. మనకి ఆ కొత్త కష్టం ఎందుకు? ఆ నష్టాల కన్నా, కష్టాల కన్నా, 'ఐ, ఔ'ల్ని అలా నేర్పడమే తేలిక. 'వ్, య్, మ్' ఇలా 'హల్లుల్ని' ఉపయోగించడం తెలుగులో ఎప్పుడోగాని వుండదు. పిల్లలకు హల్లులే కష్టం.

★ చంద్రశేఖరరావు గారు, 'కృ'ని సంయుక్తాక్షరం కాదు – అనడం, ఆశ్చర్యంగా వుంది! 'కృ'లో, శబ్దాల్ని చూడండి! క్+ర్+ఉ=కృ. ఇది, సంయుక్తాక్షరం కాదా? రెండు వేరు వేరు శబ్దాలు కలిస్తే, అది ద్విత్వాక్షరమా?

★ " 'లిపి'ని సంస్కరించడం అంటే, అక్షరాల్ని తగ్గించడం కాదు" అన్నారు. 'ఋ, ౠ; ఌ ౡ ; ఙ, ఞ' లాంటి, హేతుబద్ధత లేని అక్షరాల్ని తగ్గించకపోతే, అది సంస్కరణ ఎలా అవుతుంది? అక్షరాల్ని పెంచడమే సంస్కరణ అవుతుందంటారా? – **ఇక్కడితో, జనవరిలో, చర్చలు ముగిశాయి.** ఈ చర్చల్లో, ఇంకా కొన్ని అంశాలు వున్నాయి. వాటిలో కొన్ని, రిపిటీషన్లు అవుతాయి. కొన్ని, 'అక్షర మాల' సమస్యలోకి అవసరం లేనివి అవుతాయి. అందుకే కొన్నిటిని తీసుకోలేదు నేను.

...

**2. ఫిబ్రవరిలో: (1) వావిలాల సుబ్బారావు గారు.** కొన్ని వివరాలతో చర్చించారు. 'ఋ, ౠ; ఌ ౡ ' ల్ని వదిలెయ్యాలనే అన్నారు.

★ అయితే, 'ళ' శబ్దాన్ని ఒక ప్రాంతంలో పలకరంటే, అది వారి 'అలసత్వం' వల్లా, వారికి 'నాజూకుతనం' లేకపోవడం వల్లా, వాళ్ళు 'ళ'ని పలకరు – అన్నారు. – ఇలా అనగలమా? 'ళ'ని వాడే ప్రాంతాల్లో కూడా ఇంకేవో శబ్దాల్ని పలకకపోవడం వుండదా? 'ఉర్దూ'లో వుండే శబ్దాలన్నీ, మన 'అక్షర మాల'లో వున్నాయా? మనకి నాజూకుతనం లేకే అలా జరిగిందా? మనకు వున్న అచ్చులన్నీ ఇంగ్లీషులో వున్నాయా? – భాషల విషయంలో, ఇటువంటి వాదాలు పనికిరావు కదా?

★ "అసంబద్ధతలున్నా, ఇంగ్లీషు భాష విశ్వవ్యాప్తం అయింది" అన్నారు. అలా ఎందుకైంది? ఆ దేశాల 'బిజినెస్‌ల' వల్ల! ఎగుమతుల్లో, దిగుమతుల్లో, వాళ్ళ ఎత్తుగడలు ఎన్నో! వలసల వ్యాపారాల్లో మోసాలు కదా వాళ్ళవి? ఇతర దేశాలకి, ఇంగ్లీషు భాషతో వ్యాపార అవసరాలు వున్నాయి. దాని కోసం ఇంగ్లీషుని 'గొప్ప' చేస్తారు. అంతేగానీ, అది ఆ భాష గొప్పతనం కాదు. ఆ వర్తకాల మోసాలూ, వాళ్ళ రకం సరుకులూ, ఏ దేశాల్లో పెరిగితే, ఆ దేశాల భాషల్లో, కొత్త కొత్త పదాలూ, సాంకేతిక చమక్కులూ, వస్తాయి. 'సైకిలూ, రైలూ, రేడియో' అనే రకం మాటలు పూర్వం నించీ వున్నాయా వాళ్ళకి? ఆ వస్తువులు వచ్చాకే, ఆ మాటలు వచ్చాయి. వ్యాపారాల్లో ఏ దేశం ఎదిగితే, ఆ దేశంలో భాషని రకరకాలుగా ఉపయోగించే విధానాలు పుట్టుకొస్తాయి. అది, భాష గొప్పతనం కాదు.

★ 'సరళంగా నేర్పితే, పిల్లలు నేర్చుకోలేకపోవడం వుండదు' – అన్నారు ఈయన. 'ఋ, ౠ; ఌ ౡ ; ఙ, ఞ' – లాంటి అక్షరాల్ని ఏం సరళంగా నేర్పగలం? పిల్లలకు, వేసే శిక్షల్లో 'సరళమైన గోడ కుర్చీలు' మాత్రమే వేయించి నేర్పినా, వాళ్ళు, ఆ అక్షరాల్ని మనసారా నేర్చుకోలేరు. తర్వాత వాడుకోలేరు.

★ **'ణ, ళ'** లాంటి శబ్దాలు కొన్ని ప్రాంతాల్లో లేకపోయినా, అవి వున్న ప్రాంతాల నించి వాటిని తీసివెయ్యకూడదు – అన్నారు ఈయన. ఎంత మంచి మాట ఇది! 'ణ' అక్షరం వున్న వాళ్ళు, **'రాణి', వీణ'** అనే మాటల్ని, 'రాని, వీన' అని చదివి సంతృప్తి పడలేరు. వాళ్ళ 'ణ', వాళ్ళకి వుండాలి. కానీ, **'ప్రామాణికం'** గురించి చర్చించుకోవాలంటే, అది వేరే సమస్య

★ **'చ'** లాంటి అక్షరం, 'యా' శబ్దాన్ని ఇస్తుంది గనక, దాన్ని ఉంచవలసిందే అన్నారు. ఈయన 'యా' శబ్దం రావాలంటే అది, 'చ' దగ్గిరే కాదు కదా? 'యా' శబ్దం, 10 హల్లుల దగ్గిరా రావాలి! 'చ, చ, ఛ' అన్నట్టే, క, క, ఖ'; ట, ట, ఠ' – ఇలా అన్నిటికీ రావలసిందే కదా? ఎంత గందరగోళం ఇది! 'తా టా కు' లో, 'టా'ని, 'యా' శబ్దంతోనే పలుకుతాం. 'టా'గా రాసిన దాన్ని కూడా అలాగే 'యా' శబ్దంతో చదవవచ్చు. అసలు, 'క–నించీ, బ–వరకూ, 10 హల్లుల్లో దేన్ని అయినా, 'అ'గా గానీ, 'యా'గా గానీ, ఎప్పుడెలా అవసరమైతే అలాగే పలకవచ్చు కదా? ఇంగ్లీషులో, ఒక్క అచ్చుతోనే నాలుగైదు శబ్దాల్ని పలుకుతారు. ఆ ఇంగ్లీషు కోసమే ఎగబడతాం కదా? ఇక్కడ అయితే, ప్రతీ శబ్దానికీ ఒక్కో అక్షరం చొప్పున అక్షరాల్ని పెంచేసుకోవాలా?

★ **'గదబ'** అనే గిరిజన తెగ భాషలో, అంకెలు, 4 వరకే వుంటాయనీ, 5 నించీ వుండవనీ, అన్నారు ఈయన. ఇటువంటి సమాచారాలు ఈ చర్చల్లో, కొత్తగా తెలిశాయి. ఆ గిరిజనుల ఆదాయం 4 వరకే వుంటుందా? చెట్లెక్కి పళ్ళు కోసుకుంటే, అవి, 4ని దాటవా? వాళ్ళు పెంచే కోళ్ళ పిల్లలు, 4ని దాటవా? – జవాబులు లేవు మరి!

**ఫిబ్రవరిలోనే: (2) గారపాటి ఉమామహేశ్వరరావుగారు,** తమ వాదాలన్నీ కొంచెం కఠినంగా చెప్పారు. "సంక్లిష్టత తగ్గించడానికి" అనేకంటే, ఇంకా తేలిగ్గా వాడితే బాగుంటుంది. 'సంక్లిష్టత' అనేదానికి కొన్ని సమస్యలు కలిసిన విషయం – అనే అర్థం వుంటుంది –

**తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకై చట్టాన్ని వెంటనే తేవాలి**

అనుకోవచ్చు గానీ, దీనికన్నా తేలిగ్గా చెప్పాలంటే, ఆయన చెప్పలేరా? చెప్పగలరు. అసలు, ఇక్కడ చర్చించవలిసిన విషయం, మన 'అక్షర మాల'లో ఏ యే అక్షరాల్ని ఎందుకు తీసివెయ్యాలో; ఫలానా అక్షరాల్ని తీసివేస్తే, ఏదైనా ఇబ్బంది వస్తుందేమో – దాన్నే భరించాలేమో – అనే విషయాల గురించే. ఈ సమస్య వరకే మాట్లాడుకుంటే అందరికీ స్పష్టత వస్తుంది. ఈ చర్చల్లో పాల్గొన్న అందరూ (నేను తప్ప) భాషావేత్తలు కాబట్టి, వారికి, భాష గురించి ఎన్నో విషయాలు తెలిసి వుండొచ్చు. వాటన్నిటినీ ఇక్కడే చెప్పుకోగలమా? అలా చెప్పుకుంటే, పత్రికలో, ఈ చర్చకి తప్ప, ఇతర విషయాలకి చోటే వుండదు.

☆ ఉమా గారు చెప్పిన ఒక కొత్త విషయం వుంది. ఇంకో ఆయన ఎవరో గానీ, ఇలా అన్నారట ఎప్పుడో: 'అ'ని ఒక్కదాని రూపమే వుంచి, దానికే ' ా' పెడితే, అది 'ఆ' అవుతుంది. 'అ'కే గుడి పెడితే, అది 'ఇ' అవుతుంది. – ఈ రకంగా 'అ' మీదే, గుణింతం గుర్తులన్నీ చూపించవచ్చు – అన్నారట ఆయన. ఆ పద్ధతి ఇలా వుంటుందని వూహించవచ్చు:

**అ అా; అి అీ; అు అూ; అె అే అై; అొ అో అౌ; అం, అః.** – అక్షరాల ప్రారంభమే ఇలా వుంటే, గుణింతం గుర్తులన్నీ మొదటే వచ్చేస్తాయి. ఈ గుర్తులనే హల్లులకు చేర్చి రాయడం ఎంతో తేలిక అవుతుంది. ఈ మార్పు ఇప్పుడు సాధ్యం కాదు గానీ, ఇది చాలా నచ్చింది నాకు. మనం పాటించలేని విషయాలు, నచ్చినా, నచ్చక పోయినా ఒకటే! నచ్చి మాత్రం ఏం ఇప్పుడేం చెయ్యగలం? నచ్చని వాటిని మార్చుకోగలం గానీ, అది కూడా ప్రతీ చోటా సాధ్యం కాదు.

...

**3. మార్చి సంచికలో, ఈ చర్చలు రాలేదు.**

...

**4. ఏప్రిల్‌లో: (1) గంగుల బాబు గారు.** ఈయన, నా వ్యాసంలో వున్న దాదాపు అన్ని విషయాలతోటీ ఏకీభవించారు. అయితే, వీరి విమర్శల్ని కొన్నిటిని చూడాలి.

☆ అచ్చుల్లో వుండే **'ఒ'** అనేదీ, హల్లులో వుండే **'బ'** అనేదీ, ఒకే రూపాలతో వుంటాయి – అనీ, వాటి తేడాలు పిల్లలకు తెలియవు – అనీ, ఈయన అభిప్రాయపడ్డారు.

కానీ, 'ఒ, బ'ల ఆకారాలు ఒకే రకం కాదు. వాటికి, చాలా తేడా వుంది. వాటిని రాసి చూపించేటప్పుడు పిల్లలకి ఆ తేడాని సరిగానే చెప్పవచ్చు.

☆ అలాగే, **'మ, య'** అక్షరాల్ని కూడా ఒక్కలాగే వున్నట్టు అన్నారు. 'య'కి చాలా పెద్ద గుండ్రంతో ప్రారంభం జరుగుతుంది కదండీ? **'మ, య'**లలో తేడాల్ని పిల్లలు చాలా తేలిగ్గా పోల్చగలరు.

☆ **'ణ'**ని పలకడం కష్టం అనీ, దానికి బదులు 'న'నే వాడాలనీ, కూడా ఈయన అన్నారు. దీని జవాబు, ఇంతకు ముందు చెప్పుకున్నదే. **'ణ'**ని పలికే ప్రాంతాల వారికి అది కష్టం కాదు. పైగా అది ఇష్టం. 'ణ'ని పలికేవాళ్ళు, **'వీణ'**ని, 'వీన' అనడంతో సంతృప్తి పడరు; స్పందించరు. కాబట్టి ఏ ప్రాంతంలో శబ్దాలు, ఆ ప్రాంతంలో వుండవచ్చు. 'ణ'ని పలకని ప్రాంతాలవారు, 'వీణ'ని 'వీన' అంటే, దాన్ని విని ఇతరులు నవ్వనక్కరలేదు. ఆ ప్రాంతాల్లో 'ణ' శబ్దం లేదు – అని అర్థం చేసుకోవాలి, అంతే!

☆ గంగుల బాబు గారు, **'ళ'**ని కూడా వద్దన్నారు. దీనికి కూడా 'ణ'కి చెప్పిన జవాబే అవసరం అవుతుంది.

☆ 'అరకొర సంస్కరణలు' పనికిరావనీ, కొన్నిటినే తీసివెయ్య డం కాకుండా, తాము విమర్శించిన వాటినన్నిటినీ తీసిపారేసే సంస్కరణలు చేయాలనీ, అన్నారు. హేతు విరుద్ధ విషయాల్లో అయితే, అలాగ చెయ్యవలిసిందే. కానీ, వాడుక శబ్దాల్లో, తేడాలు వున్నప్పుడు, వాటిని ఆ తేడాలతోనే వాడకపోతే, వేరు ప్రాంతాల వారికి అవి అర్థమే కావు. ఇది 'శబ్దాల' విషయమే గానీ, 'భావాల' విషయం కాదు గదా?

☆ **'ఒత్తుల'** విషయంలో ఈయన, **'పొక్కిలి'** అనే మాట వాడారు. నేను, 'పొక్కిలి'ని ఎప్పుడూ వినలేదు. అర్థం తెలీక, నిఘంటువుని తెరిస్తే, 'పొక్కిలి' అంటే, 'బొడ్డు' అని, తెలిసింది. **'చ, ద, డ'** – లాంటి అక్షరాల అడుగున 'ఒత్తు' కోసం ఒక గీత పెట్టడానికి 'పొక్కిలి' వుంది కాబట్టి అటువంటి అక్షరాలకు మాత్రమే అడుగున గీతలతో, ఒత్తులు పెట్టి, వాటిని **'ఛ, ధ, ఢ'**లుగా చెయ్యగలం – అన్నారు. **'క, గ'**ల వంటి వాటికి అడుగున పొక్కిలి లేదు కాబట్టి, వాటిని 'క, గ'లుగా వాటికే గీతలు పెడితే, ఆ గీతలు ఎటో పోతాయి – అన్నారు. కాబట్టి, ఈ రకం అక్షరాల్ని, **'క, ఖ; గ, ఘ'**లు గానే వుంచాలి – అన్నట్టు సూచించారు. పొక్కిలి లేని 'క' వంటి అక్షరాల అడుగున 'ఒత్తు'గా ఒక గీతని పెట్టడాన్ని 'ఆక్షేపణీయం' అని కూడా అన్నారు. – ఇదంతా 'చర్చ' కాబట్టి, ఎవరి అభిప్రాయాలు వారు చెప్పవలిసిందే.

☆ ప్రతీవారూ, 'కాలమే నిర్ణయిస్తుంది' అంటూ వుంటారు. 'కాలం' అంటే ఏమిటి? నెలలూ, సంవత్సరాలూ మారడమే కదా? ఆ కాలంలో, మన భావాలు మారితేనే కొత్త నిర్ణయాలు జరుగుతాయి. 10 సంవత్సరాల తర్వాత కూడా మనం, ఇప్పుడు వున్నట్టే వుంటే, 'కాలం' ఏం చేస్తుంది? మన 'భావాల్లో' ఏవైనా పొరపాట్లో, తప్పులో వుంటే, వాటిని గ్రహిస్తేనే, వాటిని మార్చుకుంటాం. దీనికోసం, సంవత్సరాలు గడపాలా? ఇప్పుడే చర్చించి, గ్రహించకూడదా? రేపైనా ఆ గ్రహింపే రావాలి కదా? అచ్చుల్లో వున్న 4 అక్షరాల్ని వదిలెయ్యడానికి అందరూ ఒప్పుకున్నారు కదా? అలాగే, మిగతా వాటిని కూడా ఆలోచించడానికి సంవత్సరాలు పట్టాలా? అక్కరలేదు.

☆ **'ఝ'**ని, **'జ'**గానే రాయవచ్చు – అని, నేను అన్నదాన్ని గురించి, గంగుల బాబు గారు 'ఆ ఒత్తు మాత్రం ఎంత కాలం వుంటుంది?' అంటారేమిటి? **'జ'**కి అడుగున 'పొక్కిలి' వుంది కదా? అది వుంటే, ఒత్తు నిలుస్తుందని ఈయనే అన్నారు కదా?

☆ **త్యాగరాజుగారి** మునిమనవరాలు, తెలుగుని, 'సంగీత భాష' అన్నారట! ఆవిడ, త్యాగరాజుకి మునిమనవరాలు అయితే కావచ్చు. అసలు ఆ మాట **త్యాగరాజే** అన్నా, అది తప్పే! చక్కని రాగంతో వుంటే, ఏ భాషలో పాటలైనా, హాయిగానే వుంటాయి. 'సంగీతం' తెలుగులోనే కాదు, అన్ని భాషల్లోనూ వుంది. 'సంగీతం' అనే దానికి కారణం, 'రాగం'! భాష కాదు. 'రాగం' బాగుంటే, మనకి

**ఓట్లు అడిగేది తెలుగులో... ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?**

తెలియని భాషలన్నీ వింటాం. ఆ 'భాష' తెలియడం అక్కర్లేదు; ఆ 'రాగం' కోసం వింటాం.

☆ ఎవరి భాషని వాళ్ళు పొగుడుకోవడం, సంకుచితత్వం! **"సారే జహాసె అచ్ఛా"** పాటకి రాగం చక్కగానే వుంటుందిగానీ, ఆ 'సాహిత్యం' గొప్పదా? మానవులు, ప్రతీ దేశంలోనూ జీవిస్తున్నారు. ఈ ఒక్క ప్రాంతమే "అచ్ఛా" నా? – ఇది, సంకుచిత రాజకీయాల నించి పుట్టిన సాహిత్యం! ఎవర్ని వాళ్ళు పొగుడుకునే అగ్న్యానానికి ఒళ్ళు మందు తుంది. మనుషులందరూ ఒకటే; మనుషుల అవసరాల్ని తీర్చే భాషల శక్తులన్నీ ఒకటే! ఒక గిరిజన భాషకి అన్ని సదుపాయాలూ కల్పిస్తే, అది, 'ఇంగ్లీషు భాష' వంటిదే అవుతుంది.

**ఏప్రిల్‌లోనే: (2) సి.వి.కృష్ణయ్యగారు.**

☆ పిల్లలు సరిగ్గా చదవక పోవడానికి, అక్షరాల్లో ఇబ్బందులే కారణం కాదనీ, నేర్పే పద్ధతుల్లో తేడాలు కూడా కారణమేననీ, అంటున్నారు ఈయన. అవును, రెండూ కారణాలే. అసలు, పిల్లల 'వాచకాలు' చేట లంతంతగా, రెండేసి కిలోల బరువులతో వుంటూ, నలక లంతంత అక్షరాలతో వుంటాయి. అన్ని కారణాల కన్నా పెద్ద కారణం ఇదే! 'అక్షరాలు' ఎంత సరళమైనవి అయినా, అవి 'నలకల్లాగే' వుంటే, ఒకటో తరగతిలోనే అక్షరాల్ని చూసే పిల్లలు, వాటిని ఎలా అర్థం చేసుకుంటారు? ఒకటో తరగతి పిల్లల కోసం కిలోల బరువులతో పుస్తకాలా? అసలు, ఆ పుస్తకాల మీద, 'ఒకటో తరగతి' అని రాసి వుండదు. అవి, బిజినెస్ కోసం అలా తయారవుతాయి. వాటిని ఏ తరగతికైనా పెట్టేస్తారు స్కూలు వాళ్ళు! **అసలు, వాచకాల సైజులూ, బరువులూ, తగ్గిపోవాలి. అక్షరాల సైజు చాలా పెరగాలి.** పిల్లలకి వాటిని చూస్తే భయం కలగడం కాదు, సంతోషం కలగాలి.

☆ తెలుగుని ఎవరో 'సుందర తెలుంగు' అన్నారట. ఒక తెలుగు రాజుగారు, "దేశ భాషలందు తెలుగు లెస్స!" అన్నారట! ఇలాంటి మాటలు చెప్పి, "తెలుగులో ఏదో సౌందర్యం దాగి వుంది" అన్నారు కృష్ణయ్యగారు. ఇదంతా, ఎవళ్ళ భాషని వాళ్ళు పొగుడుకోడం కాదా? అసలు, భాషలు తేడాలతో ఎందుకు వుంటాయో గ్రహించారా?

☆ అసలు, ఇక్కడ చర్చ, కేవలం 'అక్షరమాల'లో ఏ అక్షరాలు వుండాలి – అనే దాన్ని గురించే. ఇదే మాట్లాడుకుంటే చాలు ఇక్కడ. కృష్ణయ్యగారు, చదువుని నేర్పే పద్ధతులన్నీ తెచ్చారు. 'పదాల్ని' చూపించి అక్షరాల్ని చెప్పాలన్నారు. పై తరగతుల్లో ఎలా చెప్పాలో చెప్పారు. వ్యాకరణాన్ని ఇంటర్‌లో చెప్పాలన్నారు. అవన్నీ సరైనవో కావో ఇక్కడ చర్చించలేము. వీటిని నేను పట్టించుకునే సందర్భం కాదు ఇది. ఇది, కేవలం, 'అక్షరమాల'లో వుండవలిసిన అక్షరాల సంగతే.

...

**5. మే నెలలో: కస్తూరి విశ్వనాథంగారు.**

ఈ నెలలో 'చర్చ' చేసినవారు వీరు ఒక్కరే.

నేను, 'అక్షర మాలని కొంత సంస్కరించాలి' – అనే పేరుతో, 20 పాయింట్లు రాశాను కదా? వాటిలో, ఈయన ఒక్క పాయింటుని కూడా అంగీకరించలేదు! "తెలుగు లిపిలో నించి ఏ అక్షరాన్నీ తొలిగించ నవసరంలేదు....ఏదీ, మార్చాల్సిన అవసరం లేదు" అని అన్నారు. ఈయన, 20 పాయింట్లుగా పెట్టి, తన వాదాలు చేశారు. 'అమ్మ నుడి'ని (మే నెల సంచికని) చదివిన పాఠకులకు, ఈ విశ్వనాథంగారు చేసిన వాదాలన్నీ తెలుస్తాయి. కాబట్టి వీటి గురించి నేను ఎక్కువగా చెప్పనక్కరలేదు. అయినా, కొన్ని అంశాల్ని కొంచెం చూపించాలి.

☆ 'తెలుగు అక్షర మాల'లో నించి ఋ, ౠ, ఌ ౡ ; లాంటి అక్షరాల్ని వదిలివెయ్యాలి – అని నేను అన్నదాన్ని ఇతర చర్చకులు అంగీకరించారు. కానీ ఈయన, 'అంగడిలో వున్న వస్తువుల్ని అందరూ కొంటారా? కొందరే కొంటారు... కాబట్టి, అంగడిలో అన్ని వస్తువులు వుండకూడదు – అంటామా?' అని వాదించారు. అంటే, 'అక్షర మాల'నీ, 'అంగడి'నీ సమానం చేశారు! అంతేగాక, ఈ అక్షరాల్ని తీసి వెయ్యడం, 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం' అన్నారు. ఈ అక్షరాల్ని పిచ్చుకల్ని చేసి, వాటి మీద వ్యతిరేకతని బ్రహ్మాస్త్రం చేశారు! అంటే, వాటిని వుంచాలని! దీన్ని గురించి చెప్పేదేముంది?

☆ 'అక్షరమాల' నించి ఏ అక్షరాల్నీ తీసివెయ్యకూడదని వాదిస్తూనే, 'ఌ ౡ' ల్ని "వాడకంలో నించి జారిపోయాయి" అన్నారు. అంటే, ఆ అక్షరాలు అనవసరం – అని తేలినట్టే కదా? అయినా అవి వుండాలనే అన్నారు.

☆ 'శబ్దం' అని నేను అన్నదాన్ని అలా అనడం తప్పు అనీ, అది 'ధ్వని' అనీ, అన్నారు. 'శబ్దం' అన్నా, 'ధ్వని' అన్నా, ఒకటే కాదా?

☆ ఇంగ్లీషు భాషని, "కంగాళీ భాష" అని ఒక చోటా, "అవక తవక భాష" అని ఇంకో చోటా, అన్నారు. అయినా మళ్ళీ, ఆ భాషలో మాటలనే కొన్నిటిని చూపించి, 'తెలుగులో కూడా అలాగే వుండవచ్చు' అన్నట్టు వాదించారు.

☆"ఋ, ౠ" ల్ని ఎంత సమర్థించారంటే, వాటిని 'రు' లుగా పలక కూడదన్నారు. ఎలా పలకాలో కూడా చెప్పారు. అంగిలీ, గొంతులో భాగాలూ, వేటి వేటికో నాలిక తగలాలని చెప్పారు. ఒకటో తరగతి పిల్లలకి అలా నేర్పాలన్నమాట!

☆ 'ఌ ౡ' ల్ని 'సంప్రదాయం' అని సమర్థిస్తూనే, 'వాడకపోతే సరిపోతుంది' అన్నారు. కానీ, 'వాటిని వాడాలి' అన్నదే అర్థం. ఇది 'చర్చ' కాబట్టి, ఎవరికి తోచింది వాళ్ళు చెప్పవలిసిందే. కాకపోతే, అది సరైన తర్కంగా వుండాలి.

☆ ఏ అక్షరాల్నీ వదలరాదనీ, 'సాహిత్యంతో అవసరమైన వాళ్ళకి' అవి అవసరం అన్నారు. ఇక్కడ చర్చ అంతా ఒకటో క్లాసు పిల్లల సంగతి! అది పట్టించుకోలేదు ఈయన.

☆ 'అక్షరం అంటే, అచ్చో, హల్లో, అవుతుంది' అని నేను అన్నదాన్ని "దీనికి అర్థం వుందా?" అన్నారు. ఇదే అర్థం లేని ప్రశ్న!

☆ ఙ, ఞ' ల్లో ఎక్కువ శబ్దాలు లేవనీ, వాటిని పలకడంలో తప్పు చేస్తున్నారనీ, అన్నారు. ఊపిరితిత్తుల్ని ఏదో చేసి, నాలికని పైకి ఎక్కడో చేర్చి, నాసికా రంధ్రాల్ని ఏదో చేసి పలకాలన్నారు. 'తారువు, తాలువు' అనే మాటలేవో అన్నారు. ఆ అక్షరాల్ని అలా పలకాలని!

**పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం – రెండూ తప్పే**

★ 'ఇన్యా, ఇణీ' ల్ని అలా పలికితే, అవి ఏక వర్ణాలేనట!

★ 'క్ష' ని, 'సంయుక్తాక్షరం' కాబట్టి, దాన్ని హల్లుల్లో పెట్టడం ఏమిటని నేను అంటే, ఆయన నన్ను ఒక ప్రశ్న అడిగారు. నేను నా వ్యాసంలో, 'అక్షరాలు' అని రాసినప్పుడల్లా 'క్ష' ని వాడారు కదా? 'ఆ 'క్ష' ని మీరెలా వాడారు? అన్నారు. 'క్ష' ని, హల్లుల్లో చేర్చకూడదు అన్నాను గానీ, అసలే వాడవద్దు – అన్నానా? నా మాటల్ని పట్టించుకోలేదు!

★ 'ఱ' ని 'ర్ర' అన్నట్టు పలకాలట! ఆ తేడా వుంది కాబట్టి, దాన్ని వుంచాలట! 'ఏఱు' అంటే, 'నది' అని అర్థం అట! 'ఏరు' అంటే, ఆ అర్థం రాదట! కాబట్టి, 'ఱ' ని వుంచాలన్నారు. పిల్లలకి, ముంత పొగలూ, కోదండాలూ, గోడ కుర్చీలూ, కాళ్ళ నిండా కర్ర దెబ్బలూ – ఇవన్నీ జరిపితే, 'ఱ' తేడా ఏమిటో తప్పకుండా తెలుసుకుంటారని పెద్దలందరం అనుకోవాలి. 'ర' ని, 'తాడితం' అనీ, 'ఱ' ని, 'కంపితం' అనీ, అనాలట! గిన్నె మీద, సుత్తితో కొడితే, ఎలాంటి ధ్వని వస్తుందో – అంటూ, వాటి ధ్వనుల్లో తేడాల్ని చెప్పారు. పిల్లల్ని సుత్తితో మోదితే 'ర' వస్తుందో, 'ఱ' వస్తుందో, ఇప్పుడు కొత్తగా కనిపెట్టొచ్చు. పండితులందరూ ఈ తాడితాల్నీ, కంపితాల్నీ, ఒప్పుకుంటారు గానీ, ఒకటో తరగతి పిల్లలు, సుత్తి దెబ్బలైనా తింటారు గానీ, ఈ చదువు చదవరు – అనిపిస్తోంది నాకు. ఇతర పండితులు ఏమంటారో గానీ!

★ 'మీ' ని, 'మి' అని రాయడం ఏమిటి – అని నేను అన్నదాన్ని 'ఇది ధర్మ సందేహం!' అన్నారు. 50 సంవత్సరాల క్రితం, 'తొ' అనేది, 'తెు' గా వుండేదట! 'కొ' అనేది, 'కెు' గా వుండేదట! మరి, అవి ఇప్పుడు మారాయి కదా? ఇప్పటికీ, పొరపాటుగా వున్న వాటిని ఇప్పుడు మార్చుకోకూడదా? ఒక్క మార్పుని కూడా ఒప్పుకోలేదు!

★ 'కొన్ని అక్షరాల్ని వదిలెయ్యాలి' అని నేను అన్నదానికి, "వెనకటి కాలపు సాహిత్యాన్ని ఏం చేద్దాం?" అన్నారు. పిల్లలకి, 'పాత అక్షర మాల' ని కూడా చూపించి, అందులో వున్న అక్షరాల గురించి చెప్పాలనే అన్నాను.

★ 'కాఫీ' అనే మాటని తెలుగులో రాసేటప్పుడు 'కాఫ్హీ' అని రాస్తే, ఇంగ్లీషు 'ఎఫ్' కి వచ్చే శబ్దమే వస్తుంది – అన్నట్టు ఈయన ఒక కొత్త సూచన చెప్పారు. అయితే, 'కాఫీ' అనే మాట నేను ఇచ్చిన ఉదాహరణే! ఇంతకుముందు, 'బా'ంకు' అని కొటేషన్‌తో రాస్తే, 'యా' శబ్దం వస్తుందని ఒకాయన చెప్పారు కదా? అలాగే, ఈయన 'ఫ' రావలిసిన చోట 'ఫ్హ' రాయాలని! కానీ, ఈ మార్పు కన్నా, 'ఫ' నే ఎలా పలకాలో అలా పలకలేమా? ఇది అలోచించాలి.

★ చివరికి, విశ్వనాథం గారు తేల్చింది: 'అక్షరమాల' లో జరగాలని కొన్ని మార్పుల గురించి చెప్పుకున్నాం కదా? "ఇటువంటి మార్పులకు ఎవ్వరూ ముందుకురారు" అన్నారు ఈయన. ఇది వింతగా వుంది! ఇంతకు ముందు, కొందరు పండితులు, మార్పుల్ని సమర్థించారు కదా? ●

స్పందన

## తెలుగులిపి సంస్కరణల పై చర్చ

ఆచార్య కస్తూరి విశ్వనాధంగారు మే 2018, అమ్మనుడి సంచికలో లిపి సంస్కరణపై చర్చలో పాల్గొంటూ ఒక పెద్ద వ్యాసం అంశముల వారీగా వివరణ ఇచ్చినారు. అట్టి వివరణలపై చర్చలో పాల్గొనాలని **ఒక సగటు తెలుగు చదువరిగా,** రాస్తున్నాను.

**చర్చలో (2)వ అంశం –**

ఋ, ౠ ఌ ౡ లు, అసలు అచ్చులేకావు 'ఋ'తో ఋగ్వేదం, ఋషి, ఋతువు, ఋషభం, ఋణం – అను ఐదు పదాలు వాడ్తాము – కాని ఇవి తెలుగు పదాలు కానేకావు – మనం వాడే తెలుగు భాషలో చాలా పదాలు ఉర్దూ, హిందీ, ఆంగ్ల పదాలు గూడా వాడ్తున్నాము – సంస్కృతంలో 'ఋ'ను 'రి'గా పలుకుతూరు. అనగా రిగ్వేదం, రిషి, రిషబ్, రితు, రిణ్ అని పలుకుతారు. ప్రకృతిని ప్రక్రితి, కృష్ణను క్రిష్ణ, సంస్కృతిని సంస్క్రితి, అని పలుకుతారు. పలకాలె గూడా – ఋ అను అక్షరం పదముకు ముందు మాత్రమే ఉంటుంది. పదం మధ్యలో వాడరు. కేవలం అయిదు పదాల కొరకు 'ఋ'ను అట్టిపెట్టుకోవడం అవసరమా – 'రి' – అక్షరం ఋ కు మారుగా ఉన్నదిగదా.

ఇక 'ౠ' అనే అక్షరంను ఎక్కడా వాడరు – ఌ ౡ లకు బదులు – హల్లులలో లు, లూ లు ఉన్నవి గదా. కాబట్టి, అచ్చులలో నుండి ఋ ౠ, ఌ ౡ లను నిక్షేపంగా తొలగించవచ్చు. ( ృ ) ఋత్వంను వొత్తుల పట్టికలో కొనసాగిస్తూ అవసరమున్నచోట వాడుకోవచ్చు.

5. సున్న, అరసున్న, విసర్గ (ః) లు స్వతంత్ర అక్షరాలు కావు. ఉప అక్షరాలు. ఇప్పుడు అరసున్నా వాడకం తగ్గిపోయింది. విసర్గ (ః) కూడా అచ్చం సంస్కృత జనితం. విసర్గను దుఃఖం, ప్రాంతఃకాలం, అను పదాలకు మాత్రమే వాడుతాము. హిందీలో సుఖ్, దుఖ్ అని రాస్తారు – మనం దుఃఖం అని రాస్తున్నాము– ఎందుకు – ప్రాతఃకాలమును ప్రాతఖ్కాలము అని రాయొచ్చుగదా – దీని వల్ల విసర్గలను విసర్జించవచ్చుగదా.

6.ఋ, ఌ – లు అచ్చుల్లో భాగంకావు – అచ్చులు, – అకార, ఇకార, ఉకార, ఎకార, ఒకార అక్షరాలు మాత్రమే. కాబట్టి ఋ, ౠ, ఌ ౡ లను అచ్చుల నుండి తొలగించవచ్చు.

7. ఙ, ఞ లు స్వతంత్ర అక్షరాలు కావు. కాబట్టి వీటిని హల్లుల పట్టికలో నుండి తొలగించి వొత్తుల పట్టికలో చేర్చాలి ( ృ ) ను చేర్చినట్టు.

8. 'క్ష' సంయుక్తాక్షరమే. స్వతంత్ర అక్షరం కాదు – కావున హల్లుల నుండి తీసి పక్కన పెట్టవచ్చు.

9. 'ఱ' అనునది అనవసరం – హల్లులలో 'ర' ఉన్నదిగదా – ఱ, ర, ల ఉచ్చారణ లో తేడా లేదుగదా ఎందుకు 'ఱ' ను భరించడం – న కు ణ, లకు ళ, స కు శ లు ఉన్నవి. వాటి ఉచ్చారణ వేరుగా వుంటుంది.

12. బ భ – లకు వలె చ, ఛ లు ఉన్నవి. అందుకొరకు బ, భలను చ ఛ ల వలె రాయొచ్చు – ఒ కు బ కు గుర్తింపులో కొంచెం ఇబ్బంది అవుతుంది. అందుకొరకు బ (బ) ను తలకట్టుతో రాస్తే సులువుగా ఉంటుంది.

చివరగా అచ్చుల గురించి ఒకమాట

అచ్చులు : అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ,ఎ, ఏ, ఒ, ఓ, ఔ = 12

ఈ 12 అచ్చు అక్షరాలను కేవలం ఒకే ఒక అక్షరం 'అ' తో సరిపుచ్చొచ్చు. మనకు తలకట్టు, దీర్ఘం మొదలగు ఉపకరణాలు ఉన్నవి. క, కా, కి....రాసినట్టు అ తా, తి, తీ, అని రాయొచ్చు – ఇ, కి ఈ కి

# "గీటురాళ్ళు...రాత-రోత"



కీ.శే. తాపీ ధర్మారావు

**చ**దివిన విన్నా జనులకందరికి
చక్కగ తెలిసితె రాతా,
మెదడు చించుకొని నిఘంటులన్నీ
వెదికించిందే రోతా.

**వా**దుకమాటల వల్లనె భావాల్
ప్రకటించిందే రాతా,
పాడుముష్టితో పెద్ద సమాసాల్
వాడిందైతే రోతా.

**చి**న్న మాటలనె గొప్ప భావములు
చెప్పగలిగితే రాతా,
మిన్ను విరిగినట్లు ధ్వనించి భావం
సున్న చుట్టితే రోతా.

**అ**ష్టకష్టములు అనుభవించు కవి
ఆవేదనయే రాతా,
ఇష్టభోగముల ఊగాడుచు ప
ళ్ళికిలించిందే రోతా.

**హృ**దయంలోపల ఎడము చాలకే
ఎగురుచు వస్తే రాతా,
ఇదియని అదియని రానిదానినీ
ఈడ్చుకవస్తే రోతా.

**ప్ర**జల భావముల ప్రతిధ్వనిస్తూ
బాగుపరిస్తే రాతా,
గజిబిజి వ్రాతల కళ్ళుమూసుకొను
గాలి మూటయే రోతా.

**ప్ర**జలజీవనము పిడికిట పట్టుక
ప్రకటించిందే రాతా.
రజితాచలముల పట్టీల్ కొట్టుచు
రాసిందంతా రోతా.

**జీ**వనమందలి పెద్ద సమస్యల
చిక్కువిప్పుతే రాతా,
ఏవో పుక్కిటి పురాణములతో
బావురుమంటే రోతా.

**క**తలో సంగతి జీవకళలతో
కనబడితేనే రాతా,
మృతదేహంవలె ముస్తీబులతో
మిటకరించితే రోతా.

**ఊ**రూ దేశం ఉద్రేకంతో
ఊపగలిగితే రాతా,
కూపస్థంవలె గ్రుడ్డిపాఠములు
కూటికి రాస్తే రోతా.

**సా**రంలేని చప్పిడి మోటర్,
కారుకూతలే రోతా,
ఈ ప్రపంచమున జ్ఞానం ఎంతో
ఎరుగుచు రాస్తే రాతా.

**మం**చీచెడ్డల జంకులేక ప్రే
మించి చెప్పుతే రాతా,
కొంచపుబుద్ధిని సంచినింపుకొన
కూసిందైతే రోతా.

**చి**త్రంలోవలె ఆయారోజుల
జీవం చూపుతె రాతా,
సూత్రాల్ చూచుక తెలిసీతెలియని
సొదెలు రాస్తే రోతా.

**అ**వునవునన్నటు హృదయం పట్టుక
ఆడించిందే రాతా,
చెవులకు మాత్రం తగిలేటట్టులు
చెప్పిందైతే రోతా.

**స**లసలమరిగే కష్టావళిలో
ములిగి రాసితే రాతా,
తెలియని దానిని వల్లెవేసుకొని
తెల్పేదైతే రోతా.

**గ**తమును బాగా విమర్శచేస్తూ
గతిచూపిస్తే రాతా,
మతిసుతి లేనీ ఊహాశూన్యుల
మాటలగారడి రోతా.

– తాపీ ధర్మారావుగారి **'కొత్తపాళీ'** నుండి...ప్రచురణ కర్తలకు ధన్యవాదాలతో..

పోలికే లేదు. ఇ, వలె ఈ (ఇ) రాస్తే ఇకి ఈ (ఇ)కి పోలిక ఉంటుంది. మరొక విషయం అచ్చు అక్షరాలతో, పదాలు మొదలౌతాయి కాని పదముల మధ్యలో అచ్చు అక్షరాలు రావు. రెండో విషయం, అచ్చు అక్షరాలైన, అ, ఆ లతో మొదలయ్యే పదాలను అకార, ఆకార ధ్వనులతో పలుకుతాము. ఇ నుండి ఔ వరకు ఉన్న అచ్చు అక్షరాలతో మొదలయ్యే పదాలను ఇకార ఔ కారాలతో పలుకరు – రాస్తారు గాని పలకరు – ఇ, కారాన్ని యి కారంగా, ఔ కారాన్ని అవు కారంగా పలుకుతారు. యిల్లు, యీగ, వుడత, వూయల, యెలుక, యేనుగు, అయిరావతం, వొంటె, వోడ, అవుటు – అని పలుకుతారు ఇల్లును యిల్లు అనే రాస్తున్నారు – రాయడం ఇకార, ఉకారాలు రాస్తున్నా పలుకుడు మాత్రం యికార, వుకారాలతో పలుకుతున్నారు. అనగా అచ్చుల్లో అ, ఆ లను మాత్రమే రాసినట్టుగానే పలుకుతున్నారు. కాని మిగతా అచ్చు అక్షరాలు పదాలల్లో రాసినా పలుకడం మాత్రం య కార, వు కారాలతో పలుకుతున్నారు. అనగా అచ్చుల్లో అ, ఆ లను మాత్రమే రాసినట్టుగానే పలుకుతున్నారు – కాని మిగతా అచ్చు అక్షరాలు పదాలల్లో రాసినా పలుకడం మాత్రం యకార, వుకారాలుగానే పలుకుతున్నారు. దీని భావమేమి.

– కంచర్ల సత్యపాల్‌రెడ్డి
86864 86859

వీవెన్
9963029061

తెలుగు భాషకు ఆధునిక హోదా-5

# ఆధునిక హోదా అంటే ఏమిటి?

**మూడు** నెలల క్రితం ఇదే శీర్షికలో "జీవం - భాష" పేరిట వ్రాసిన వ్యాసంలో జీవం సుదీర్ఘకాలం మనుగడ సాగించడానికి తోడ్పడుతూన్న లక్షణాలను భాషకు అన్వయిస్తూ తెలుగు భాష కూడా ఆ లక్షణాలను అలవరచుకుంటే ఎలా చిరకాలం మనగలదో చర్చించాను. జీవం ఎప్పుడూ తననుతాను నిత్యనూతంగా ఎలా మలుచుకుంటుందో, భాషను కూడా నిత్యనూతనంగా ఉంచుకోవడమే ఆధునిక హోదా అన్నదానికి ఒక సైద్ధాంతిక ప్రాతిపదిక. ఈ వ్యాసంలో కార్యాచరణ రూపంలో ఆధునిక హోదా ఎలా ఉంటుంది, దాని ఫలితాలు ప్రభావాలు చూద్దాం.

సమాజంలోని వివిధ భాగాల, వ్యవస్థల మీద లేదా వివిధ రంగాల్లో ఏయే మార్పులు చోటుచేసుకుంటే భాషకు ఆధునిక హోదా అవుతుందో అనే వివరణ ఇది. మరో రకంగా చూస్తే తెలుగు భాషోద్యమకారులు, భాషాభిమానుల ఆకాంక్షలకు కోరికలకు సంగ్రహ ప్రతిరూపమే, వాటన్నిటినీ ఒక గొడుకు క్రిందికి తీసుకువచ్చే ప్రయత్నమే!

**ప్రజలు :**

"దేశమంటే మట్టికాదోయ్ మనుషులోయ్!" మనుషులు లేకుంటే సమాజమే లేదు. సమాజ గతినీ స్థితినీ మార్చేదీ మార్చగలిగేదీ ప్రజలే, వారి సంయుక్త, సామూహిక ఆకాంక్షే. ఆధునిక హోదా ప్రభావం, ఫలితం ప్రజలపై ఇలా ఉంటుంది అనే కంటే, తెలుగు వారందరికీ ఇవి సిద్ధించినప్పుడు తెలుగు భాషకు ఆధునిక హోదా వచ్చినట్టే.

ప్రజల దైనందిన వ్యవహారాలూ, సంభాషణలూ, రాతకోతలూ, అన్నీ తెలుగులో జరుగుతూంటాయి.

ప్రజానీకానికీ (కనీసం 99 శాతం మందికి) కావలసిన వినోదం, విజ్ఞానం, వికాసం అంతా తెలుగు భాషలో సమకూరుతుంది.

తెలుగు మాత్రమే వచ్చినవారు కూడా తాము కోరుకున్నంత సౌఖ్యంగా, సౌకర్యవంతంగా బతకడానికి తగ్గ సంపాదన అవకాశాలు అందుబాటులో ఉంటాయి.

సమాజంలోని ఇతర భాగాలూ, వ్యవస్థలూ అన్నీ ప్రజల కోసం, వారి అవసరాలు తీర్చడం కోసమే ఏర్పడినవి కాబట్టి, ఈ ఆధునిక హోదా ప్రభావం, ఫలితం వాటి మీదా ఉంటుంది.

**ప్రభుత్వం - శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు :**

ప్రజల తర్వాత వారిపై అత్యంత ప్రభావాన్ని చూపించే వ్యవస్థలు ఇవి. ఈ వ్యవస్థలు తెలుగు భాషలో నడుస్తూ, వాటి విధానాలు తెలుగు భాషకు అనుగుణంగా ఉన్నప్పుడు తెలుగు భాషకు ఆధునిక హోదా వచ్చినట్టే.

చట్ట సభల్లో చర్చలూ, చట్టాల రూపకల్పన తెలుగులో జరుగుతాయి.

ప్రభుత్వ ఉత్తర్వులు, నియమ నిబంధనలు, విధాన ప్రకటనలు, సంక్షేమ పథకాలు, తాఖీదులు, రశీదులు, ఇతరత్రా సమాచారం అంతా ప్రధానంగా తెలుగులో ఉంటుంది.

పరిపాలన, ప్రభుత్వ అంతర్గత వ్యవహారాలు, పద్దులు, రికార్డులు అన్నీ తెలుగులో జరుగుతూంటాయి.

న్యాయ స్థానాల్లో వాద ప్రతివాదనలు తెలుగులో జరుగుతాయి. తీర్పులు తెలుగులో వెలువడతాయి.

ప్రభుత్వం, దాని విభాగాలు ప్రజలకు అందించే సమాచారం, ప్రజాసంబంధాల నిమిత్తం నిర్వహించే అన్ని రకాల కార్యకపాలాలు (రేడియో టీవీ ప్రోగ్రాములు, వార్తాలేఖలు, సామాజిక మాధ్యమాలలో ప్రచారం గట్రా) అన్నీ తెలుగులో ఉంటాయి.

**వ్యాపార సంస్థలు**

నేటి మార్కెట్ - ఆధారిత పెట్టుబడిదారీ వ్యవస్థలో వ్యాపార సంస్థల పాత్ర కూడా అంచనాలకు మించిన ప్రాధాన్యం కలది. వాటినుండి భాషకు తగ్గ తోడ్పాటు లభించినప్పుడే ఆధునికహోదా లభించినట్టు.

తెలుగు రాష్ట్రాల్లో అమ్ముడయ్యే వస్తూత్పత్తులన్నీ (పేర్లూ, వాడుకునే సూచనలు, ఇతరత్రా వివరాలతో సహా) తెలుగులో లభిస్తాయి. ఇక్కడ అందించబడే సేవలు కూడా తెలుగులో/తెలుగు సమాచారంతో అందించబడతాయి. వారి వ్యాపారప్రకటనలూ అన్నీ తెలుగులో ఉంటాయి.

వ్యాపార సంస్థలు ప్రభుత్వాలకు, ప్రభుత్వ విభాగాలకు దాఖలు చేసే నివేదికలు, వాటి పెట్టుబడిదార్లకు, వాటాదార్లకు, ప్రజల సమాచార నిమిత్తం ప్రచురించే నివేదికలు, పత్రాలు తెలుగులో ఉంటాయి.

తెలుగువారి వ్యాపార సంస్థల్లో అంతర్గత కార్యకపాలాలు, పద్దులు, ఖాతా పుస్తకాలు వంటివీ తెలుగులో నిర్వహించబడుతూంటాయి.

**మాధ్యమాలు :**

ప్రజల మధ్య, సమాజంలోని తతిమా వ్యవస్థల మధ్య అంతరాల్ని పూడ్చి సంభాషణా వారధులుగా వ్యవహరించేవే మాధ్యమాలు. వీటికి ఉన్న ప్రాధాన్యత లేదా అవి పోషించే పాత్ర మూలంగా వీటిని ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరించారు. తెలుగు భాషకు ఆధునికహోదాలో కూడా వీటిదే కీలక పాత్ర. మాధ్యమాలని ప్రసార, ముద్రణ, ఎలక్ట్రానిక్ వంటి రకాలుగా విభజించవచ్చు. కానీ ఇక్కడ అవి తీర్చే ప్రజల సమాచార అవసరాల రూపంలో చూస్తే:

**వినోదం :**

సినిమాలు, టీవీ కార్యక్రమాలు, నాటకాలు, స్వతంత్ర మాధ్యమాలలో తక్కువ నిడివి సినిమాలు, కథలు, కవితలు, కార్టూనులు వంటివి అన్నీ తెలుగులో ఉంటాయి. ఇప్పటికే ఇవన్నీ తెలుగు లోనే ఉన్నా వీటి సృష్టి ఇతర భాషలతో పోలిస్తే తెలుగులో చాలా తక్కువ.

తెలుగు వారి "తలసరి సాంస్కృతిక దిగుబడి" చాలా పెరగాల్సి ఉంది. (తలసరి సాంస్కృతిక దిగుబడిపై వారణాసి కిరణ్ వ్రాసిన వ్యాసం అంతర్జాలంలో వెతికిపట్టుకోవచ్చు.)

**విజ్ఞానం:**

అకడమిక్ రూపంలో చూస్తే అన్ని స్థాయిల్లోనూ చదువులు (వృత్తి విద్యలు, దూర విద్యలతో సహా) పూర్తిగా తెలుగులో చదువుకునే అవకాశం ఉంటుంది. పరిశోధనలు, పత్ర సమర్పణలు, శాస్త్ర విజ్ఞాన రంగాల్లో పురోగతీ, దానిపై చర్చలూ, సదస్సులూ కూడా తెలుగులో జరుగుతాయి. అకడమికేతర రూపాల్లో వివిధ నైపుణ్యాలపై శిక్షణలు, సరికొత్త సాంకేతికతలపై సదస్సులు, చర్చలూ, అనేక అంశాలపై సెమినార్లూ గట్రా తెలుగులో జరుగుతాయి.

**సమాచారం:**

స్థానిక, ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వార్తలూ విశేషాలూ అన్నీ తెలుగులోనూ లభిస్తాయి. కేవలం దిన పత్రికలు, జాల పత్రికలే కాకుండా, స్వతంత్ర మాధ్యమాలుగా బ్లాగులు, ట్విట్టర్, యూట్యూబ్ ఛానెళ్లు, పోడ్‌కాస్టులు తెలుగులో విరాజిల్లుతాయి.

**వికాసం:**

ఆధ్యాత్మికత, తత్వ చింతన, నైతిక ధర్మ చింతనలు, భవిష్యత్తు–సాంకేతికతలపై ఆలోచనలు, మానవాళి మనుగడ, ప్రస్థానం ఇలాంటివాటిపై ఆలోచనలు, చర్చలు, ప్రచురణలు తెలుగులో జరుగుతాయి. మార్పుకై పోరాటం, అన్ని రకాల ఉద్యమాలు వాటి సాహిత్యం అంతా తెలుగులో లభిస్తుంది.

ఇలా సర్వతోముఖాభివృద్ధిలా అన్ని రంగాల్లో తెలుగు వెలుగుతుంటేనే ఆధునిక హోదా సిద్ధించినట్టు. దీనికి ఏ ఒక్కరో, ప్రభుత్వమో, మరేదైనా ప్రత్యేక వ్యవస్థో పూనుకుంటే సరిపోదు. దీనికి అందరూ, అన్ని వ్యవస్థలూ బాధ్యత తీసుకుంటేనే ఇది జరుగుతుంది. ఇదే శీర్షికలో విడి అంశాల గురించి ప్రత్యేక వ్యాసాలు వ్రాసాను, వ్రాస్తున్నాను. ఏదో ఒక అంశానికి, వాదానికి పరిమితమై పోకుండా, ఏ మార్గం పద్ధతి సరి అన్న వాదాలతో కాలహరణం కాకుండా విహంగ వీక్షణం వంటి ఈ సంయుక్త స్వప్నం దిక్సూచిలా తోడ్పడుతుందని నమ్ముతున్నాను. దీన్ని సాకారం చేసుకోడానికి అందర్లోనూ, అంతటా కదలిక వస్తుందని ఆశిస్తున్నాను.

## 'అమ్మనుడి తెలుగును కాపాడుకుందాం' – విశాఖపట్నంలో మే 17న సమైక్య భారతి ప్రచారసభ





## 'తెలుగులో పాలనను అందించలేని ప్రభుత్వాలు మనకొద్దు'

విశాఖపట్టణంలోని ప్రముఖ సాంస్కృతిక చైతన్య సంస్థ 'సమైక్యభారతి' చేపట్టిన – 'మన అమ్మనుడి తెలుగును కాపాడుకొందాం' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా – మొదటి సభను ఏప్రిల్ 14న చెన్నయ్‌లో జరిపిన సంగతి పాఠకులకు తెలిసిందే. రెండవ సభను మే 17న విశాఖపట్టణంలోని పౌర గ్రంథాలయంలో జరిపారు. సమైక్యభారతి అధ్యక్షులు గట్టెం మాణిక్యాలరావు అధ్యక్షత వహించగా సి.ఎస్.రావు ప్రారంభ ప్రసంగం చేశారు. ముఖ్య అతిథి డా॥ సామల రమేష్‌బాబు ప్రసంగిస్తూ – తెలుగులో పాలనను అందించలేని ప్రభుత్వాలు మనకొద్దు అని స్పష్టం చెయ్యాలని, ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున సభలు, ప్రచార కార్యక్రమాలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా సవివరమైన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జవ్వాది వి. లక్ష్మి, కోరుకొండ రంగారావు, వేముల భాస్కరాచారి, జయప్రభ శర్మ, టి. లక్ష్మీ ప్రసాద్ మున్నగువారు పాల్గొన్నారు. కేంద్ర కార్యదర్శి పి. కన్నయ్య ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కీ.శే. గిడుగు వెంకట సీతాపతి

# నిఘంటు రచనా పరిణామము




**భా**రతదేశ నిఘంటు చరిత్రలో వాస్తవముగా విశిష్టరూపమును పొందినవి రెండే దశలు: 1. పద్యరూపకోశముల దశ; 2. పాశ్చాత్య వైజ్ఞానిక సంసర్గము కలిగిన తర్వాత అకారాది క్రమమున నేర్పడిన నిఘంటువుల దశ. పద్య రూపమున నున్న యెడల కంఠస్థము చేయటా నికి అనుకూలముగా ఉండగలదనే ఉద్దేశముతో సంస్కృతభాషలో అమరము మొదలయిన కోశ ములు 192 పుట్టినవి. కానీ, అందులో 30 మాత్రమే గ్రంథరూపమును పొందినవి. మిగిలి నవి నామమాత్రావశిష్టము లయినవి. వ్యాఖ్యా తలు తమ రచనలలో కొన్నిటిని పేర్కొన్నారే కానీ నేటి కవి కనబడ లేదు. కొన్ని చోట్ల ఆ కోశముల నుండి వ్యాఖ్యాతలెత్తి చూపిన శ్లోక చరణ భాగా లను బట్టి ఆ కోశముల స్వరూప మూహించు కొన వచ్చును. శబ్ద సముదాయమును పద్య రూపములో నిమిడ్చి రచించే పద్ధతి సంస్కృత భాషకు, దాని ననుసరించుటచేత తెలుగుభాషకు ఉన్నట్లు ప్రపంచములో మరి యేదేశమందు, మరి యే భాషకు లేదు.

సంస్కృత భాషలో వెల్వడిన నిఘంటువులందు మొట్టమొదట పేర్కొనవలసినది వైదిక నిఘంటువు. దీనికి యాస్కుడు నిరుక్తమను పేర ఒక వ్యాఖ్యానము రచించెను. ఇది కేవలము వైదిక భాషకే సంబంధించినది. పిమ్మట సంస్కృతభాషకుగల చాలా కోశములలో సమానార్థక ములైన పదములు స్వర్గ, భూమి, పాతాళాది వర్గముల క్రిందను, అనే కార్థములుగల పదములు ప్రత్యేకముగా మరియొక ప్రకరణము నందును కనబడుతున్నవి. ఇందులో ఏ పదమెక్కడనున్నదో సులువుగా తెలిసి కొనుటకు ఏదైనా ఒక అకారాది వర్ణ క్రమమును బట్టి పదముల నేర్పరచవలెనన్న ఆశయము పాశ్చాత్య వైజ్ఞానిక సంసర్గము కలుగక మునుపే మన దేశములో పుట్టినట్లు మన సంస్కృతాంధ్ర నిఘంటువులే విశదపరచగలవు. సంస్కృతములో 'అమరకోశము' ప్రఖ్యాతమైన ప్రాచీన కోశము. దానిలోగల లోపములను పూర్తిచేసే ఉద్దేశముతో 13వ శతాబ్దములో పురుషోత్తమదేవు అనే కళింగదేశ రాజు 'త్రికాండశేషః' అనే పేరనొక కోశమును పద్యరూపముననే రచించినాడు. ఈ రెండింటిలోను మొదటి రెండు కాండలందును విషయానుక్రమణము, తృతీయ కాండలో అకారాదిశబ్ద నిరూపణము కలవు. అమరసింహుడు విడిచిన పదములను ఎత్తుకొని పురుషోత్తమదేవు అర్క మొదలుకొని స్నేహ శబ్దము వరకున్ను గల శబ్దములకు నానార్థములను వివరించినాడు. 14వ శతాబ్దములో 'దేశినామమాలా', 'రత్నావళీ' అనే పేళ్లతో ప్రాకృత నిఘంటువును రచించిన హేమచంద్రుడు "అథ అకారాదయోహ్యక్షరాః శబ్దాః సంగృహ్యంతే" అని అజ్జ (= అద్యః) అనే శబ్దము మొదలుకొని హేరంబ శబ్దమువరకును గల ప్రాకృత శబ్దములను పేర్కొన్నాడు. ఈ హేమచంద్రుడే 'అనేకార్థ సంగ్రహమ'నే సంస్కృత శబ్దకోశములో మూడు విధములయిన క్రమములను పాటించినాడు :

1. అక్షరసంఖ్యను బట్టి ఏకస్వర శబ్దాః ద్విస్వర శబ్దాః,... ఈ విధముగా ఒకటి మొదలు ఆరు అక్షరములవరకు గల శబ్దములను ఆరు తరగతులుగా ఏర్పరచినాడు.

2. ఏకాక్షర శబ్దములలో అకారాది క్రమము పాటించి, రెండు, మూడు, నాలుగైదారు వర్ణములుగల పదములను అంతమందుగల అక్షరములను బట్టి ద్విస్వర కాంతాం...అని ఈ విధముగా కాంతముల నుండి హంతముల వరకున్ను క్రమము పాటించి శబ్దములను పేర్కొన్నాడు.

3. ఇక ఒక్కొక్క వర్గములో – అనగా ద్విస్వరమాంతములు, పంచస్వరమాంతములు, షట్స్వరమాంతములు – ఈవిధముగా ఏర్పడిన వర్గములలో అకారాదిగా శబ్దములను పేర్కొన్నాడు.

'మేదినీ' అనే కోశము కూడా చాలా ప్రసిద్ధి పొందినది. అందులో కూడా పైని వివరించిన మూడు విధములయిన క్రమములు పాటించడమయినది. అయితే, అందులో చిన్న భేదము లేకపోలేదు. హేమచంద్రుడు మొట్ట మొదట అక్షరసంఖ్యనుబట్టి వర్గము లేర్పరచి అందులో తక్కిన రెండు లక్షణములున్ను పాటించి విభాగము లేర్పరచినాడు. 12వ శతాబ్దములో కులోత్తుంగ చోడదేవుని కుమారుడైన రాజరాజచోళదేవుని ఆదరమున కేశవస్వామి రచించిన 'నానార్థార్ణవ సంక్షేప'మనే నిఘంటువులో మొట్టమొదట ఒకటి మొదలు ఆరువరకు నున్న అక్షర సంఖ్యనుబట్టి ఆరు కాండముల క్రింద శబ్దములను వివరించి, ప్రతి కాండములోనుగల శబ్దములను స్త్రీ, పుం, నపుంసక, వాచ్యలింగ, నానా లింగముల క్రిందను అంతర్భాగముల నేర్పరచి ప్రతి భాగములోను గల శబ్దములను అకారాదిగా వివరించడమయినది.

పైని వివరించిన కోశములన్నిటను తుదకు ప్రతి చిన్న వర్గ మందున్ను గల పదములను అకారాదిగా పేర్కొనవలెనన్న ఆశయముండెననుట స్పష్టము.

మన తెలుగు కోశములలో 1619 – 37 నడుమ వెలసిన 'చౌడప్ప సీసపద్యముల కోశము' మొదలుకొని ఈ 20వ శతాబ్దిలో అమలాపురపు సన్యాసి కవి రచించిన 'సర్వాంధ్ర సారసంగ్రహము' వరకు అనేక కోశములు పద్యరూపముననే వెల్వడినవి. అందులో గణపరపు వేంకటకవి రచించిన 'వేంకటేశాంధ్రము'', పైడిపాటి లక్ష్మణకవి ప్రణీతమైన 'ఆంధ్ర నామసంగ్రహము', ఆంధ్రరత్నాకరము, అడిదము సూరకవి రచితమైన 'ఆంధ్రనామశేషము', కస్తూరి రంగకవి రచించిన 'సాంబ నిఘంటువు', నుదురుపాటి వేంకటకవి రచించిన 'ఆంధ్ర భాషార్ణవము' ముఖ్యమైనవి. సంస్కృత కోశములవలెనే అన్నీ పద్యరూపమున నున్నవేకానీ, సంస్కృతకోశములు పాటించిన అక్షర క్రమ

నియమము ఎక్కడా కనబడదు. ఆంధ్ర భాషార్ణవములో అవ్యయ వర్గమందును, క్రియావర్గమందును అకారాది క్రమము ననుసరించే ప్రయత్నము జరిగినది; కానీ, సమానార్థకములైన పదములు చేర్చవలం వచ్చుటచేత ఆ క్రమము నిలువలేదు.

ఇవికాక కొన్ని లక్షణ గ్రంథాలలో శకట రేఫ, సాధురేఫ వివేకార్థము కనబరచిన శబ్దముల పట్టికలు పద్యరూపముననే ఉన్నవి. అందులో అకారాది వర్ణక్రమము పాటింపబడినది. అప్పకవీయములో "అచ్చులమీదను హల్లుల మీదను గలుగు రేఫ అకారములు వచింతు" నని రెండు పెద్ద సీసమాలికలు రచితములయినవి. అకారాది క్రమములో శబ్దముల మొదటి వర్ణమును బట్టి చేయలేదు. ఉద్దిష్ట రేఫ వర్ణమునకు ముందున్న హల్వర్ణమును బట్టి చేయడమయినది. గిరగిర, వేగిరపడు, జేగురుకొండ, గురుపాండు మొదలయిన శబ్దములలో రేఫాక్షరమునకు ముందుగల గి, గు మొదలయిన వర్ణములనుబట్టి అకారాది వర్ణక్రమము కలదని గ్రహించవలెను. కూచిమంచి తిమ్మకవి రచించిన "సర్వ లక్షణ సారసంగ్రహము'లో తృతీయాశ్వాసమున రేఫద్వయ నిర్ణయమును తెలియజేసే పద్యము లనేకముగా గలవు. అందులో "అరియప్పన మరి సింజని" మొదలుగా "సారెలును పెళ్లిసారె వేసారుటయును!/ సారెలును, సూరులును సేరు సైరణయును / సరవి సోరణగండ్లును సొరుకాఁగ / బరగునివి యెల్ల రేఫ లంబర శిరోజ" అని రేఫలుగల పదములు అకారాది శబ్దక్రమమున కనబడుతున్నవి.

అకారాది క్రమమును మన దేశమందలి కోశకర్తలు గ్రహించక పోలేదు. కాని, పద్యరూపమునగాక నేటి నిఘంటువులలో ఉన్నట్లు పట్టికల రూపమున నుడిదండలను ప్రదర్శించవలెనన్న ఆశయము మాత్రము పాశ్చాత్య వైజ్ఞానిక సంసర్గమువలననే కలిగినదని చెప్పక తప్పదు.

పాశ్చాత్య దేశాలలోనైనా నిఘంటు నిర్మాణ ప్రయత్నము 15వ శతాబ్దమునకు పూర్వము జరుగలేదు. మన దేశములో మొన్న మొన్నటివరకున్న తెలుగు మొదలయిన దేశభాషలయెడల పండితులకు ఆదరము తక్కువయి సంస్కృత భాషయెడల ఆదరము ఎక్కువగా నుండినట్లే ఇంగ్లండులో 16వ శతాబ్దము వరకు ఆంగ్లభాష యెడల ఆదరము తక్కువగాను లాటిన్ భాషయెడల ఆదర మెక్కువగాను ఉండేది. అందుచేత లాటిన్ పదములను అకారాదిగా పేర్కొని, ఆ పదములను ఇంగ్లీష్ పదములతో అర్థవివరణము చేస్తూ రచించిన నిఘంటువులే ముందుగా వెల్వడినవి. 1440 –1499 నడుమ ఆంగ్లభాషా పదములకు లాటిన్ భాషా పదములను తెలియజేసే ఉద్దేశముతో "ఆంగ్ల – లాటిన్ నిఘంటు' ప్రయత్నము జరిగినది. 1658లో జాన్ మిల్టన్ మేనల్లుడైన ఎడ్వర్డ్ ఫిలిప్స్ "NEW WORLD OF ENGLISH WORDS" అనే పేరను అన్యదేశ్యములై వచ్చిన ఆంగ్ల భాషాపదముల నిఘంటువును రచించినాడు. 1730 నాటికిగాని నేటి రూపమున కనబడు నిఘంటు నిర్మాణము సాగలేదు. ఫ్రాన్స్ దేశములో 'ఫ్రెంచి నిఘంటువు' అంతకు కొద్దిగా ముందుగానే రచితమయినది. 1672 – 1740 నడుమను ఎడిసన్, స్విఫ్ట్ మొదలయిన ఆంగ్లభాషా పండితులు, మన దేశమందలి పండితులవలెనే, భాషా పారిశుద్ధ్యము వ్యాకరణమువల్లను, కోశము వల్లను భద్రముగా నుండునన్న ఉద్దేశముతో నిఘంటు ప్రయత్నము తలపెట్టినారు. తత్ఫలితముగా ప్రఖ్యాత పండితుడయిన జాన్సన్ శబ్దశుద్ధి పాటిస్తూ 'ఆంగ్లభాషా నిఘంటువు'ను 18వ శతాబ్దములో రచించినాడు. సమగ్రమైన ఆంగ్లభాషా నిఘంటువులలో ఇదే మొదటిది. ఇది మరల మరల సవరింపవలసిన అగత్యము లేకుండ కలకాలము నిలిచియుండ గల ప్రామాణిక నిఘంటువు అనే అభిప్రాయము జాన్సన్కే కాక ఆనాటి ఇతర పండితులకూ ఉండేది.

ఐతే దేశభాషలు జీవముగలవి. ఆ భాషలను మాటలాడే జనుల విజ్ఞానముతోను, సంస్కృతితోను అవికూడా మారుతూ ఉండడము సహజము అనే వివేకము కలిగిన తర్వాత ముప్పది నలుబది సంవత్సరముల కొకసారి వ్యాకరణము, నిఘంటువు క్రొత్తగా వచ్చిన శబ్దములను, మారిపోయిన శబ్దార్థ రూపములను పాటించి సవరణ పొందవలసి ఉంటుందన్న విషయము విజ్ఞులు గ్రహించినారు.

ఇంగ్లండునుండి మన దేశమునకు వచ్చిన వారిలో మన దేశభాషలయెడలను, వ్యాకరణముల యెడలను ఆదరముగలవారు కొందరుండిరి. మన తెలుగు భాషయెడల ఆదరముగల వారిలో విలియమ్ బ్రౌన్, ఏ.డి. కాంబెల్, సీ.పీ.బ్రౌన్, ఆర్డెన్, ఏ.గెలెటి మొదలయినవారు ముఖ్యులు.

VOCABULARY OF GENTOO AND ENGLISH పేరిట ఒక తెనఁగు – ఇంగీష్ నిఘంటువును విలియమ్ బ్రౌన్ 1807లో ప్రకటించెను. ఇతని నిఘంటువు వెల్వడిన తర్వాతనే కాంబెల్ 1810 ప్రాంతమున మరియొక తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువును ప్రకటించెను. పిమ్మట 1852–54 నడుమ ఈ ఇద్దరికంటెను ఎక్కువ విద్యాధికుడును, ఎక్కువగా తెలుగుభాషలో కృషిచేసిన పెద్ద పండితుడును అయిన సీ.పీ. బ్రౌన్ పెక్కుమంది పండితుల సాహాయ్యముతో పెద్ద నిఘంటువులు రెండు 'ఇంగ్లీష్ – తెలుగు', 'తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువులు ప్రకటించాడు.

విలియమ్ బ్రౌన్ ప్రకటించిన తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు సీ.పీ. బ్రౌన్ నిఘంటువుకంటే చాలా చిన్నదే అయినను, అకారాది వర్ణక్రమమున వెల్వడిన తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువులలో ఇదే మొదటిది గనుకను, కాంబెల్, సీ.పీ.బ్రౌన్ నిఘంటువులకు మార్గదర్శకముగా నుండెను. ఇందులో ఉపయోగసరణి ఎక్కువ స్పష్టముగా తెలియ జేయటమయినది.

ఈ నిఘంటువున్ను కాంబెల్ నిఘంటువున్ను ప్రకటితములయిన తర్వాత సీ.పీ. బ్రౌన్ నిఘంటువు ప్రకటితముకాక పూర్వము, 1848లో మామిడి వెంకయ్య రచించిన 'ఆంధ్రదీపిక' ముద్రితమయినది. 1848లో ముద్రితమైనా ఇది 1816లోనే రచితమైనట్లు తెలియవచ్చినది. ఏదైనా విలియమ్ బ్రౌన్ ప్రకటించిన నిఘంటువు తర్వాతనే 'ఆంధ్రదీపిక'6 రచితమైనది. ఇతను మునుపటి కోశములవలె పద్యరూపమునగాక అకారాదిగా ప్రాచీన ప్రబంధములనుండి పదములను చేర్చి తెలుగు భాషలోనే అర్థ వివరణములను గావించి నూతన ఫక్కిని నిఘంటువును రచించెను. సీ.పీ.బ్రౌన్ ప్రకటించిన 'తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువునకు విలియమ్ బ్రౌన్ రచించిన నిఘంటువు మార్గదర్శకమైనట్లే, శబ్ద రత్నాకరాది తెలుగు – తెలుగు నిఘంటువులకు 'ఆంధ్రదీపిక' మార్గ దర్శకమైనది. ఈ నిఘంటువు ఆంధ్రేతరులకు, తెలుగువారికి, విద్యార్థులకు, ఆంధ్రభాషాపరిణామము తెలుసుకోగోరిన భాషాపరిశోధకులకు ఎక్కువగా ఉపయుక్తమైన గ్రంథము.

–ఆంధ్రదీపిక – మామిడి వెంకయ్య – బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ఫౌండేషన్ ప్రచురణ నుండి – ధన్యవాదాలతో.

చదువ వలసిన
పుస్తకం

# కలోనియలిజం, ఓరియెంటలిజం అండ్ ది ద్రవిడియన్ లాంగ్వేజస్
## (వలసవాదం, ప్రాచ్యవాదం – ద్రావిడభాషలు)
### Colonialism, Orientalism and the Dravidian Languages

రచయిత : ఆచార్య కె. వెంకటేశ్వర్లు.
2012 ప్రచురణ : రూట్‌లెడ్జ్ (టేలర్ అండ్ ఫ్రాన్సిస్ గ్రూప్) కొత్త ఢిల్లీ,
పుటలు : 267. వెల 695 రూపాయలు




*"ద్రవిడ భాషా శాస్త్రాలు, వలసవాద చరిత్ర నా అధ్యయనంలోని అంశాలు కావు. కానీ, వెంకటేశ్వర్లు గ్రంథాన్ని ఒకసారి అలవోకగా చూసిన వారందరూ ఆయన సంపాదించి, విమర్శనాత్మక దృష్టితో ఉపయోగించిన ఆధార గ్రంథాల సముచ్ఛయానికి నిశ్చేష్టులౌతారు".* – ట్రాట్‌మన్

***

ద్రవిడ భాషా కుటుంబం అనే భావనకు తెలుగు భాషే ప్రధాన పాత్ర పోషించిందని రచయిత ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుత గ్రంథంలో ఇదే ప్రధాన ప్రతిపాదన.

***

గ్రంథ రచయిత తెలుగుభాష తమిళ భాష నుండి ఆవిర్భవించలేదని లేదా దాని నుండి విడివడిన భాష కూడా కాదనే విషయాన్ని తెలియజేస్తారు.

***

"తెలుగు భాషాభివృద్ధి వివిధ తెగలు మాట్లాడే వివిధ భాషల సమాహార నేపథ్యంలో రూపం సంతరించుకొంది"

**19**47 లో బ్రిటీష్ వారు భారతదేశ తీరాలను వదలి వెళ్ళినప్పటి నుంచీ, దేశంలో 200 సంవత్సరాల పాటు వారి పాత్ర, చేసిన పనుల గురించి ఇప్పటికీ విద్యారంగ నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 1978లో సైద్ (said) ప్రచురించిన 'ఓరియెంటలిజం' అనే గ్రంథం ద్వారా ఈ చర్చ మరింత పదునెక్కి, ఆధునికానంతర (post - modernism) గొంతులను సంతరించుకొంది. యు.పి.ఎ.2 ప్రభుత్వంలో మన్మోహన్‌సింగ్ మంత్రిమండలి సభ్యుడు శశిధరూర్ 2015 లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ సమావేశంలో బ్రిటిష్ పాలనలోని ఆర్థిక విధ్వంసాన్ని తూర్పారబడుతూ మాట్లాడటమే కాక, అందుకు పశ్చాత్తాపంగా బ్రిటిష్ ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలనేంత వరకూ వెళ్ళాడు. శశిధరూర్ ఉపన్యాసాన్ని భారత ప్రధాని దేశ పార్లమెంటు సమావేశంలో ప్రస్తావించారు కూడా. తన భావాలను శశిధరూర్ ఇపుడు An Era of Darkness: The British Empire in India (2016) అనే గ్రంథంలో విశదీకరించాడు.

వలసవాద ప్రభుత్వ ప్రభావంపై చర్చించిన అనేక ఇతర గ్రంథాలు కూడా ఉన్నాయి. ఈ గ్రంథాలు ఆవేశకావేశాలకు బాహ్యంగా కొంత పరిణతిని, సమదృష్టిని కలిగి ఉన్నాయి. శశిధరూర్ ఘాటైన ఉపన్యాసానికి ఒక దశాబ్దం ముందు, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మన్మోహన్ సింగ్‌కు గౌరవ డాక్టరేట్‌ను సమర్పించింది. ఆ సమయంలో తనకు జరిగిన సన్మానానికి స్పందిస్తూ మన్మోహన్ సింగ్ చేసిన ప్రసంగం ఒక సాత్వికమైన ప్రకటన. ఆయన ఏమన్నారంటే: "తమ దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలో ప్రపంచం ముందు భారత్, బ్రిటిష్ దేశాల సంబంధాలను ఒక ఉదాహరణగా నిలిపాయి. ఈ రెండు దేశాలు పరస్పరం ఎంతో నేర్చుకొనటమేకాక, మిగిలిన ప్రపంచానికి బోధించేందుకు కావాల్సిన విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉన్నాయి. బహుశా ఈ అంశం భారత్ – బ్రిటీష్ సంబంధాల్లోని అజరామరమైన అంశం". ఆచార్య వెంకటేశ్వర్లు ప్రస్తుత సమీక్ష గ్రంథాన్ని ఈ వాక్యాలతోనే ముగిస్తారు.

ఆచార్య వెంకటేశ్వర్లు రచించిన ప్రస్తుత గ్రంథం పరిమాణంలో చాలా చిన్నదే! కానీ, 'మద్రాస్ స్కూల్ ఆఫ్ ఓరియెంటలిజం' MSOO, పై మెల్లిమెల్లిగా వెలువడుతున్న సాహిత్యానికి ఈ గ్రంథం అత్యంత విలువైన కూర్పు, అదనపు విలువ. ఎంతో సమంజసమూ, సారవంతమూ ఐన MSOO అనే భావనను 1999లో ఆచార్య థామస్ ట్రాట్‌మన్ (Thomas Trautman) ప్రతిపాదించి, ఆ భావాలను తన సంపాదకత్వంలో The Madras school of orientalism: Producing Knowledge in colonial south India (2009) అను గ్రంథరూపంలో వెలువరించారు. (ఈ గ్రంథంపై 'పురాతత్వ' 40వ సంపుటం 2010లో సమీక్షా వ్యాసాన్ని ప్రచురించాను)'

1812 సంవత్సరంలో స్థాపితమైన ఫోర్ట్ సెయింట్ జార్జ్ (Foth st. George ) మద్రాసు సాహిత్య సంఘం (Madras Literary Society) కేంద్రంగా కల్నల్ మెకంజీ, ఆనాటి మద్రాసు పరిపాలనాధికారి ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ నాయకత్వంలో MSOO ప్రాచ్య పాండిత్యానికి (Oriental Scholorship) ఉపలబ్ధిని చేకూర్చారు. (కావలి సోదరుల సహకారంతో మెకంజీ చేపట్టిన కార్యం ఒక దీర్ఘకాలిక సేవ. ఆయన కృషివల్లనే జనించిన మెకంజీ ప్రాచ్య లిఖిత భాండాగారం (Archives) మూలంగా ద్రవిడ భాషలు ప్రత్యేకతను కల్గి ఉన్నాయని, జైనమతం ఒక ప్రత్యేక శాఖగా గుర్తింపు కలిగినదని బాహ్య ప్రపంచానికి తెలిశాయి. ప్రాచ్య భారతంపై చేపట్టిన అధ్యయనాంశాలకు మెకంజీ కృషి

ఎంతో బలాన్నిచ్చింది. MSOO కు మరొక ప్రత్యేకత ఉంది. కలకత్తా (ప్రెసిడెన్సీ) లో జరిగిన ఇటువంటి కృషిలో భారత పండితులను కేవలం 'సమాచార – చేరవేత గాళ్ళు' అనే భావంలోనే చూశారే తప్ప, బ్రిటిష్ ప్రభుత్వం వారిని మొదట్లో ఏషియాటిక్ సంఘం (Royal Asiatic) సభ్యులుగా చేరేందుకు అవకాశాలు కల్పించలేదు. కానీ, మద్రాసు (ప్రెసిడెన్సీ)లో మాత్రం ప్రభుత్వం స్థానిక పండితులను సమానులుగానే పరిగణించి, గుర్తింపునిచ్చింది.

ట్రాట్‌మన్ రాసి, ప్రచురించిన మరొక గ్రంథం 'Languages and Nations'.... (2006) మూడు ఖండాల్లో చేపట్టి, నిర్వహించిన అద్భుతమైన పరిశోధన గ్రంథం. ద్రవిడ భాషా కుటుంబ భాషలు ఎలా, ఎక్కడ, ఏ విధంగా పురుడుపోసుకున్నాయో ఈ గ్రంథం సవివరంగా పేర్కొంది. ఆచార్య వెంకటేశ్వర్లు ప్రచురించిన ప్రస్తుత గ్రంథం ఈ కోవలో రెండవపుస్తకం. తాను చేసిన పని ఒక 'ఉడుతా ప్రయత్నం'గానే ఆయన వినయంగా పేర్కొన్నప్పటికీ (పుట 19) వాస్తవం మరొక విధంగా వుంది. 250 పుటల్లో విస్తరించిన ఆయన గ్రంథం ద్రవిడ భాషా కుటుంబం స్వతంత్ర ప్రతిపత్తిని సాధించడానికి అవసరమైన ఎన్నెన్నో విషయాలను బహిర్గతం చేసింది. ఈ గ్రంథాన్ని ట్రాట్‌మన్ సైతం ప్రశంసించాడు. ఆయన తన ముందుమాటలో ఈ పుస్తకం సాధించిన విజయాలను అభినందించాడు. ఈ గ్రంథం తెలుగు భాషా సాహిత్య అభిమానులకు ప్రత్యేక అంశమని, భారత్ – యూరోప్ బౌద్ధిక సాంప్రదాయాల సృజనాత్మక కలయికను గూర్చిన మన అవగాహనా సామర్థ్యాన్ని మరింతగా విస్తరిస్తుందని పేర్కొన్నాడు (పుట x-xi) ట్రాట్‌మన్ మాటల్లోనే చెప్పాలంటే : "ద్రవిడ భాషా శాస్త్రాలు, వలసవాద చరిత్ర నా అధ్యయనంలోని అంశాలు కావు. కానీ, వెంకటేశ్వర్లు గ్రంథాన్ని ఒకసారి అలవోకగా చూసిన వారందరూ ఆయన సంపాదించి, విమర్శనాత్మక దృష్టితో ఉపయోగించిన ఆధార గ్రంథాల సముచ్ఛ యానికి నిశ్చేష్టులౌతారు. నేను నిపుణుడిని కాకపోయినా, వెంకటేశ్వర్లు ప్రచురించిన గ్రంథంలోని అంశాలను పాఠకుల ముందుంచటానికి అభిలషిస్తున్నాను".

రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రాలు వెంకటేశ్వర్లుగారి ప్రత్యేక అధ్యయనాంశాలు. వీటిలో ఆయన చాలా అనుభవంగల వ్యక్తి. ఈ గ్రంథంలోని మొదటి అధ్యాయంలో తనకు భాషా శాస్త్రాలపై లభ్యమయ్యే రచనలపై ఎలా అనురక్తి కలిగిందో వివరిస్తారు. ఆనాటి యువ బ్రిటిష్ అధికారులకు Civil services బోధించిన దక్షిణ భారత భాషలు, వివిధ ప్రాంతాల్లోని పరీక్షల పద్ధతులను పరిశీలించే క్రమంలో ఆయనకు ఈ అధ్యయనంపై ఆసక్తి జనించింది, తెలుగు వ్యాకరణాంశాలపై ఎల్లిస్, కాంప్‌బెల్, సమకాలీన తెలుగు పండితులు 200 సంవత్సరాల క్రితమే ప్రచురించిన గ్రంథాలు వెంకటేశ్వర్లులోని అభిలాషను మరింత ప్రేరేపించాయి. తదనంతరం ఆయన జరిపిన నిరంతర అధ్యయనం ఆయనకో విషయాన్ని తేటతెల్లం చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్. వెంకటరావుకు తప్ప, ఈ విషయంపై రాసి ప్రచురించిన వారికి ఎల్లిస్ ప్రతిపాదించిన ద్రవిడ భాషా కుటుంబంలోని తెలుగు వ్యాకరణ సాంప్రదాయాల గురించి పండితులకు ఉన్న జ్ఞాన విశేషాలు ఎలాంటి క్లిష్టమైన పాత్ర పోషించాయో తెలియని పరిస్థితి. లేదా ఈ పాత్రపై వారు సాధారణ అభిప్రాయాలను మాత్రమే వ్యక్తం చేశారు.

'చారిత్రక సందర్భం – సంస్థాగత మాత్రిక' (Historical Context and Institutional Matrix) అనే రెండవ అధ్యాయం: 18వ శతాబ్ది చివర, 19వ శతాబ్ది ఆరంభ దశాబ్దాలలోని కలకత్తా ప్రెసిడెన్సీలో భారతదేశ సంస్కృతి, భాషాధ్యయనాలపై కొత్త కెరటంగా జనించిన ఆసక్తుల గూర్చి (దీనినే ట్రాట్‌మన్ నయా ప్రాచ్యవాదం – New Orientalism అని పేర్కొన్నాడు) రచయిత మన దృష్టిని ఆకర్షిస్తాడు. ఈ నయా ప్రాచ్యవాదం అనేక (చారిత్రక) కారణాల సముచ్ఛయం : పాలనావసారాలకు అవసరమైన స్థానిక సంప్రదాయాలు, న్యాయసూత్రాలు మొదలగు వాటిపై వలస పాలనా యంత్రాంగానికి అవగాహన ; స్థానిక భాషల వ్యాకరణాలు, నిఘంటువులు, ఇతరత్రా ఉపయోగపడే రచనలను ఆంగ్లంలోనికి తర్జుమా చేయాలనే అవసరం. వీటన్నింటికీ మించి– విదేశీ ప్రాంతాలు, ప్రజల గురించి తెలుసుకోవాలనే కొద్దిమంది వలసప్రాంతాలు, ప్రజల గురించి తెలుసుకోవాలనే కొద్దిమంది వలస పాలనాధి కారుల్లో నిబిడీకృతమై ఉన్నటువంటి నిఖార్స యిన బౌద్ధిక ఉత్సుకత (Intellectual curiosity). అధ్యాయంలోని రెండవభాగం (పుటలు 34 – 55) ఆనాటి మద్రాసు ప్రెసిడెన్సీ ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలో బౌద్ధిక మాంద్యం (Intellectual fermant) ఎలా ప్రవేశించిందో తెలియచేస్తుంది. పాఠకులు (అసంకల్పితంగా) పాఠ్యాంశంలో విలీనమయ్యే రీతిలో రచయిత వివరించారు. ఈ మాంద్యానికి కారణం ఆనాడు బ్రిటీష్ అధికారులతో భుజాలు రాసుకొని తిరిగిన తెలుగు, మలయాళ, తమిళ, కన్నడ భాషా పండితులు, వలస ప్రభుత్వోద్యోగులు. ఈ మాత్రిక నుండీ, ఈ బౌద్ధిక మాంద్య సంచయం నుండీ ద్రవిడ భాషా కుటుంబ భావన ఉద్భవించింది.

వెంకటేశ్వర్లు గ్రంథంలోని 3వ అధ్యాయం ప్రతీకాత్మక దృష్టితో చూసినా, పరిమాణాత్మక దృక్కోణంలో గమనించినా ప్రస్తుత అధ్యయనంలో వెన్నెముకలా నిలుస్తుంది. కలకత్తా ఫోర్ట్ విలియం కళాశాలయందు రూపం సంతరించుకొంటున్న బౌద్ధిక సంభాషణా రీతులు చిట్టచివరకు ఒక నూతన (భారత) భాషా కుటుంబ ప్రకటనవైపు ఎలా దారితీశాయో ఈ అధ్యాయం విస్తారిత విపులీకరణ చేస్తుంది. యూరోపియన్ భాషాధ్యయన తులనాత్మక విశ్లేషణా పద్ధతులను, తెలుగు భాషాభివృద్ధి క్రమాన్ని అధ్యయనం చేయుటలో తెలుగు పండితులు అవలంబించిన చారిత్రక పద్ధతిని మేళవించి చూడటమే దీనిలోని కేంద్రీకాంశం. రచయిత ఆనాటి అనేక గ్రంథాలను గురించి వివరంగా తెలియచేస్తారు (ఉదాహరణకు) మామిడి వెంకయ్య రచించిన 'ఆంధ్రదీపిక' ; వేదం పట్టాభిరామశాస్త్రి రచించిన 'ఆంధ్ర ధాతుమాల'. ఇతర ప్రామాణిక ఆంగ్ల రచనలు కూడా ఉన్నాయి. విలియం బ్రౌన్ ప్రచురించిన A Grammar of the Gentoo Language (1817), కాంప్‌బెల్ విరచిత A Grammar of Teloogoo Language (1986), ఎల్లిస్ ప్రచురించిన ప్రఖ్యాత గ్రంథం A Dissertation (దీనినే ఆయన Note to the Intraduction కాంప్‌బెల్ గ్రంథం A Grammar of Teloogoo Language ప్రచురించాడు) విలియం కేరీ వంటి కలకత్తా బౌద్ధిక సముదాయ పండితులు ప్రతిపాదించిన సంస్కృత భాషే ఇతర భాషలన్నింటికీ మాతృక అనే అంశాన్ని (పైన పేర్కొన్న) గ్రంథాలు స్పష్టమైన రీతిలో పూర్వపక్షం చేస్తాయి. ఆనాటికే

లభ్యమవుతున్న దక్షిణ భారత భాషల ధాతు పాఠాలను ఉపయోగించి, ఎల్లిస్ పండితుడు సంస్కృతభాష ఆధారంగా ఉద్భవించిన దేశ్య / దేశి పదాలకు తమిళ, తెలుగు, కన్నడ భాషా సమానార్థక పదాల పట్టికలను తయారు చేశాడు. ఈ భాషల పాత్ర స్వభావాన్ని లేదా వాటి సజాతీయ / గమనార్హమైన (Cognate) రూపాలను స్పష్టంగా తెలియచెప్పడమే ఆయన ఉద్దేశ్యం. ఈ అధ్యయనమే ఆయనలో దక్షిణ భారత భాషల మధ్య ప్రగాఢ సంబంధాలున్నాయనే భావాన్ని మరింతగా ప్రోది చేసింది. ఈ రెట్టించిన ఉత్సాహంతోనే ఆయన భాషాధ్యయన చారిత్రక గతిని మార్చే విశ్వాస ప్రకటన చేశాడు: ''తెలుగు కాని, తమిళం కాని, లేదా సజాతీయమైన ఏ రూపాలుగాని సంస్కృతం నుండి ఆవిర్భవించలేదు....అవి ఒక ప్రత్యేక భాషా కుటుంబాన్ని రూపొందిస్తాయి. వీటితో సంస్కృత భాషకు ఎలాంటి తీవ్ర సంబంధం లేదు". ఇది జరిగింది 1816 సంవత్స రంలో. వెంకటేశ్వర్లు ఉద్దేశ్యంలో (ఎల్లిస్ పండితుని) అంతిమ అభిప్రాయాలే దక్షిణభారత ప్రాంతాలను ప్రత్యేక భాషా సాంస్కృతిక మండలిగా గుర్తించడానికి ఉపయోగ పడేటటు వంటి (చారిత్రక) సత్యాలు. నాల్గు దశాబ్దాల అనంతరం బిషప్ కాల్డ్‌వెల్ ప్రచురించిన 'A Comparative Grammar of Dravidian or South Indian Family of Languages' గ్రంథం ఎల్లిస్ పండితుని వాదనలను బలోపేతం చేస్తూ, ప్రామాణిక ముద్రవేసింది. దక్షిణభారత శాస్త్రాధ్యయనంలో ఈ సంఘటనకు రెండు శతాబ్దాల వయస్సు. ఈ చారిత్రక మైలురాయి ద్విశతాబ్దిని చాలా మంది మరిచి పోవడం లేదా ఉత్సవంగా జరుపుకోక పోవడం చాలా దురదృష్టకరం. (హైదరాబాద్ యూనివర్సిటీలో ఈ సందర్భంగా రెండు రోజుల సదస్సు జరిగింది. – సం.)

ఎల్లిస్ పండితుడు వెలిబుచ్చిన మూడు అభిప్రాయాలతో గ్రంథ రచయిత వెంకటేశ్వర్లు ఏకీభవిస్తారు : 1. దక్షిణ భారతదేశ భాషలందు తమిళానికి మిగతా అన్ని భాషలకంటే ఎక్కువ ప్రాచీనత ఉంది. 2. తమిళభాష మీద సంస్కృతం ప్రభావం చాలా తక్కువ. 3. ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలోని భాషాధ్యయనం తమిళం కేంద్రకంగా కొనసాగింది. ఐతే, ద్రవిడ భాషా కుటుంబం అనే భావనకు తెలుగు భాషే ప్రధాన పాత్ర పోషించిందని రచయిత ప్రగాఢ విశ్వాసం. ప్రస్తుత గ్రంథంలో ఇదే ప్రధాన ప్రతిపాదన. ఈ ప్రతిపాదన మీద ఆధారపడే తరువాయి అధ్యాయాల్లో (4,5 అధ్యాయాలు) ప్రధాన చర్చ 60 పుటలకు పైగా కొనసాగింది. తెలుగు సాహిత్యం, భాషా శాస్త్రాలను అధ్యయనం చేసే విద్యార్థులు, పరిశోధకులకు ఈ రెండు అధ్యాయాలు చాలా కీలకమైనవి. 4వ అధ్యాయం తెలుగు (తెలింగ) భాష పుందాతనాన్ని, త్రిలింగదేశంలో లేదా గోదావరి, కృష్ణా పరివాహక భౌగోళిక మధ్యప్రాంతాల్లో తెలుగు భాష ఆవిర్భావాన్ని గూర్చి వివరించి, అనేక శతాబ్దాలుగా తెలుగు, సంస్కృత భాషల్లో వెలువడ్డ తెలుగు వ్యాకరణ గ్రంథాలను గురించి విశదీకరిస్తుంది. ఐదవ అధ్యాయంలో గ్రంథ రచయిత తెలుగుభాష తమిళ భాష నుండి ఆవిర్భవించలేదని లేదా దాని నుండి విడివడిన భాష కూడా కాదనే విషయాన్ని తెలియజేస్తారు. అలా ప్రతిపాదిస్తూనే, ఫోర్ట్ సెయింట్ జార్జ్ కళాశాలలో తెలుగు ప్రధాన భూమిక కలిగి వుండి ద్రవిడ భాషా కుటుంబం అనే భావనకు ఏర్పాటు నేపథ్యాన్ని ప్రోది చేసిందని దీర్ఘంగా అభిప్రాయ పడతారు. ఆయన వాదనంతా కొనసాగిన తెలుగు వ్యాకరణ సంప్రదాయం, సజాతీయ భాషలను అది నిర్మాణాత్మకంగా రూపొందించిన తీరు తెన్నులపై ఆధారపడింది. ద్రవిడ భాషా కుటుంబ ప్రతిపాదనను ఆవిష్కరించే క్రమంలో ఎల్లిస్ పండితుడు విస్తృతంగా ఉపయోగించుకొన్న మామిడి వెంకయ్య గ్రంథం *(ఆంధ్రదీపిక)*, వేదము పట్టాభిరామశాస్త్రి రచన *(ఆంధ్ర ధాతుమాల)* లు వెంకటేశ్వర్లు ప్రతిపాదించిన సిద్ధాంతానికి ప్రధాన భూమిక. ముగింపు అధ్యాయంలో ప్రాచ్యవాద స్వభావం ప్రభావంపై మనకు ఉపయోగపడే కొన్ని సాధారణ విషయాలున్నాయి.

MSOO మీద జరిగిన చరిత్ర రచనల విభాగంలో వెంకటేశ్వర్లు గ్రంథం ఆహ్వానింపదగిన కూడిక, పరిణామం. చరిత్రకారులకు, పురాతత్వ శాస్త్రవేత్తలకు, సామాజిక / శాస్త్రాధ్యయన వేత్తలకు, భాషావేత్తలకు, భౌగోళిక – సాంస్కృతిక అంశాల విద్యార్థులకు, భాషావేత్తలకు, భౌగోళిక – సాంస్కృతిక అంశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకారి. ఈ గ్రంథ ప్రాధాన్యత మూడు అంశాల్లో స్పష్టంగా గోచరమవుతుంది. మొదటగా : ఆధునికానంతర భావచట్రంలో ప్రాచ్యవాద జ్ఞానాన్ని విమర్శనాత్మకంగా చూసేటపుడు బహు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది. పురిటి స్నానంలోనే బిడ్డను విసరివేసే పద్ధతిలో కాకుండా, వలసవాద ప్రభావాన్ని పరివిధాలుగా (మంచి, చెడులను సమన్వయించుకొంటూ) విశ్లేషించుకోవాలి. రెండు : తెలుగుభాష ఆవిర్భవించిన తీరుపై గ్రంథ రచయిత అభిప్రాయాలు తెలుగును పురాతత్వ – భాషా శాస్త్ర కోణంలో అభ్యసనం చేయడానికి విద్యార్థులను ప్రోత్సాహపరుస్తాయి. రచయిత వ్యక్తం చేసిన ఒక ప్రత్యేక అభిప్రాయం నన్నెంతో ఆకర్షించింది. వెంకటేశ్వర్లు అభిప్రాయం ప్రకారం "తెలుగు భాషాభివృద్ధి వివిధ తెగలు మాట్లాడే వివిధ భాషల సమాహార నేపథ్యంలో రూపం సంతరించుకొంది" (పుట 122). ఈ సందర్భంలో నాకు రెండు ముఖ్య రచనలు గుర్తుకొస్తున్నాయి. గోదావరి నది మధ్య ప్రవాహ ప్రాంతాల్లోని తెగల పలుకుబడులపై బి.రామకృష్ణారెడ్డి చేపట్టి నిర్వహించిన పరిశోధన; దాదాపుగా అదే గోదావరి – కృష్ణా నదుల మధ్య ప్రవాహ ప్రాంతాల్లో 5000 సంవత్స రాలకు పూర్వం వెల్లివిరిసిన దాక్షిణాత్య కొత్తరాతి యుగం సంస్కృతికి ద్రవిడ భాషలకు ఉన్న సంబంధాలపై...సౌత్ వర్త్ చేసిన పరిశోధన. మూడు : భారతదేశం లోపల, బయట అసూర్యంపశ్యలా పడి ఉన్న ప్రాచ్య లిఖిత ఆధార పత్రాల నిధి గురించి ఈ పుస్తకం ఒక మేలు కొలుపు. అలాగే ప్రాచ్యవాదంపై చారిత్రక రచనా నిర్మాణానికి ఉన్న గొప్ప విస్తృతిని గురించి ఒక మేలు పిలుపు.

సుప్రసిద్ధ అచార్యులు
కె. పద్దయ్య, (డెక్కన్ కాలేజి,
పుణె). ఆంగ్లంలో రాసిన సమీక్షా
వ్యాసానికి ఇది తెలుగు అనువాదం.
అనువాదకుడు
డా॥ సుందర్ కొంపల్లి
–99893 58883

**తెలుగుకు సాధికారతతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి**

శ్రద్ధాంజలి

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

# తెలుగు కథానికకు మారుపేరే....

# పెద్దిభొట్ల సుబ్బరామయ్య



**తె**లుగు కథానిక ఎంతో వైవిధ్యంతో విరాజిల్లుతోంది. మధురాంతకం రాజారామ్ అన్నట్టు "తెలుగు కథానిక స్పర్శించని ప్రాంతం తెలుగుదేశంలో లేదు, పలకరించని మనిషీ లేదు" అంతటి వైవిధ్య రచయితలు తెలుగుదేశంలో పుట్టారు, తెలుగు కథానిక లను పరిపుష్టం చేసారు. అటువంటివారిలో పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు ఒకరు.

స్వాతంత్రానికి ముందు, రచయితలు అందరూ స్వాతంత్ర్యేచ్ఛే వస్తువుగా ఎన్నుకొని కథానికలు వ్రాశారు. ఆ తరువాత క్రమంగా రకరకాల విషయాలు కథానికకి వస్తువులో చోటుచేసుకొనసాగాయి. కొందరు, స్వాతంత్రం వచ్చిన తరవాత ప్రజల జీవితాలు ఇంకా ఎంతగా క్రుంగిపోయాయో వ్రాశారు. అందుకని అభ్యుదయ రచయితకి, అతను ఏ కాలంలో జన్మించాడు, వ్రాసాడు అన్నది కూడా ముఖ్యం. పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు 1938 డిసెంబర్ 15న గుంటూరులో జన్మించారు. విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజి ఇంగ్లీషు విభాగంలో 40 సంవత్సరాలు పని చేసి 1996లో పదవీ విరమణ చేసారు. 200 కథానికల పైగా వ్రాసిన సుబ్బరామయ్యగారి మొదటి కథానిక 'చక్రనేని'. కృష్ణా, గుంటూరు ప్రాంతంలోనే ఆయన జీవించటంతో అధిక భాగం కథానికల వాతావరణం అక్కడిదే కనిపిస్తుంది. ఐనా, ఆయన పీడిత జన పక్షపాతి. సమాజాన్ని చాలా లోతుగా పరిశీలించి, విషయాన్ని ఎన్నుకోవటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య.

ఒక్కో రచయిత, ఎన్ని ప్రక్రియల్లో రచనలు సాగించినా ఒక ప్రక్రియలోనే మంచి పేరు వస్తుంది. ఆయన నవలలు వ్రాసారు, అయినా కథానికా రచయితగానే పేరు పొందారు. అందుకే, రావిశాస్త్రి స్మారక పురస్కారం, అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళ ఫౌండేషన్ అవార్డు, కథానికకు కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు పొందారు. ఈ అవార్డులకు అతీతంగా, 40 సంవత్సరాలపాటు 200లకు పైగా కథానికలు తనదైన శైలిలో వ్రాసినా **'నీళ్ళు'** అనే కథానికే ఆయన పేరు చెప్పగానే మొదటగా గుర్తుకు వస్తుంది.

జోగినాథం నీటిచుక్క దొరకని ఊళ్ళో పుట్టి పెరిగాడు. మరో ఊరికి ఉద్యోగరీత్యా వచ్చేసరికి నీళ్ళు యధేచ్ఛగా దొరకడం, కోతికి కొబ్బరికాయ దొరకినట్టు అయింది. మంచినీళ్లు విపరీతంగా త్రాగుతున్నాడు, గంటలు తరబడి స్నానం చేస్తున్నాడు.

ఆ రోజు, ఆఫీసులోను మిత్రుల ఇంట్లోను జరిగిన సంభాషణలు జోగినాథాన్ని బాధ పెడతాయి. అందుకు జోగినాథం, ఎవరూ నిద్ర లేవకుండానే, తన స్నానపానాలు ముగించాలి అని తెల్లవారక ముందే నదికి బయలుదేరుతాడు. అతనికి తల్లి గుర్తుకు వస్తుంది. ఎక్కడెక్కడో తిరిగి, ఈ పాటికి కొన్ని నీళ్లను ఎంతో బలవంతాన సేకరించి వుంటుంది. నాగార్జున సాగర్ వస్తే కొంతవరకు తమ కరువు తీరవచ్చు.

నదిని చూడగానే, ఇక్కడ పుష్కలంగా దొరుకుతున్న నీళ్లు కంటి ముందున మెరిసాయి. అతని కళ్ళ ముందు, తమ ఊళ్ళో నీటి కరువు కదలాడింది! నదిలోకి ఒక్కొక్క మెట్టు దిగసాగారు జోగినాథం. ఇక్కడ పుష్కలంగా నీళ్ళు, అక్కడి నీటి కరువు, చుక్క నీటి దొరకని కరువు. మరో రెండు మెట్లు దిగాడు, నీరు అతన్ని చుట్టు కమ్మేసింది. అతను అరుస్తున్న అరుపులు ఎవరికీ వినిపించట్లేదు. నోట్లో నీళ్ళు మటుకు వెళ్తున్నాయి. తెల్ల తెలవారుతున్న వాతావరణంలో, జోగినాథం నీటిలో కలసి పోయాడు! ఎంతగొప్ప కథానిక. నీరుకోసం తపించే మనుషులు, నీటికి బలైపోయారు. ఇది చాలా గొప్ప కథానిక.

**పేరయ్య** బావి నీళ్ల కావడి మోసే పేరయ్య, వితరణ ఉండటంతో తన దగ్గర ఉన్న పైసలతో ఊరి చివర ఒక బావిని తవ్విస్తాడు. అది అందరికీ ఇతను ఉన్నా లేకపోయినా తోడ్పడుతుంది.

**(తరువాయి 31వ పుటలో...)**

డా.వాసా ప్రభావతి
9849178196

# అంతటి మహిళా అభ్యుదయ వాదులు అరుదు



**అ**మెరికాలో కుమార్తె ఇంటికి వెళ్ళిన ప్రముఖ రచయిత్రి యద్దనపూడి సులోచనా రాణిగారు హఠాత్తుగా శనివారం రాత్రి(19-05-2018)మరణించారన్న వార్త 20 వ తేదీ తెల్లవారేసరికల్లా దావానలంలా తెలుగునేల అంతటా విస్తరించింది. విస్తుపోయిన వాళ్ళున్నారు. అవాక్కయిన వాళ్ళూ కళ్ల నీళ్ళు పెట్టుకున్నవాళ్ళూ ఉన్నారు.

ఇంతకుముందు తన రచనలతో పాఠకులను కన్నీళ్ళు పెట్టించిన ఈ రచయిత్రి, తన అకాలమరణంతో తెలుగు వారంతా కళ్ళు చెమర్చేట్టు చేసారు.

1970నుంచి ఆవిడ వరుసబెట్టి రాసిన నవలలు తెలుగు నేల మీద పెద్ద సంచలనాన్ని రేపాయి. పత్రికలలో నవలలుగా పూర్తి కాకముందే చలనచిత్రాలుగా చక్కిలిగింతలు పెట్టసాగాయి. రోజురోజుకి ఆవిడ అభిమానుల సంఖ్య పెరగసాగింది. పాఠకుల సంఖ్య పెరగసాగింది. అంతేకాదు. కొత్తకొత్త రచయితలు, రచయిత్రులూ పుట్టుకురాసాగారు. అందరిలోనూ ఆమె పట్ల ఆరాధన, అనుకరణ! అన్ని పత్రికలలోనూ రచయిత్రుల నవలలే!

ఇవన్నీ సర్వలోక విదితమే!

ఆవిడకి హైద్రాబాదులో అతి సన్నిహితురాల్ని నేను! రోజు విడిచి రోజు ఆవిడ నాకు ఫోన్ చేయడమో, నేను ఆవిడకు ఫోన్ చేయడమో జరుగుతుండేది. ఆవిడ మా ఇంటికి వస్తుండేవారు. నేను వాళ్ళింటికి వెళ్ళడం జరుగుతుండేది. ఇది మా బంధం.

ఈసారి అమెరికా వెళ్ళడం ఆవిడకి అంతగా ఇష్టంలేదు. క్రితంసారి వెళ్ళినప్పుడు బాగా అనారోగ్యం పాలయ్యానన్నారు. అయినా అమ్మాయి బలవంతం మీద వెళ్ళారు. ఇలా జరుగుతుందని ఎవ్వరం అనుకోలేదు. 24న వస్తామన్నారు. వెంటనే మాఇంటికి వచ్చి 'హంస' అవార్డ్ వచ్చినందుకు నన్ను అభినందించి, మా ఇంటి దగ్గర ఒకావిడ పచ్చళ్ళు బాగా పెడుతుంది – ఆవిణ్ణి అప్పటికి పచ్చళ్ళు రెడీ చేయమన్నారు.

ఇంకా చెప్పాలంటే ఆవిడ ఎంత సున్నితంగా కనిపిస్తారో మనసు అంతకన్నా సున్నితం! ఎప్పుడూ గట్టిగా మాట్లాడినట్లుగా నేనే కాదు, ఎవ్వరం చూడలేదు. మా లేఖినీ సంస్థ ప్రారంభకులలో ఆవిడ ఒకరు! ఆవిడంత మహిళా అభ్యుదయవాదులు అరుదు.

ఆరుగురు అక్కలు,ముగ్గురు అన్నల తరువాత చివరిలో, కృష్ణాజిల్లా కాజ గ్రామంలో నెమలికంటి వెంకట చలపతిరావు మహాలక్ష్మి దంపతులకు 1940 న జన్మించారు. తరువాత ప్రాథమిక ఉన్నత విద్య అంతా అక్కడే జరిగింది. కృష్ణాజిల్లా కంచికచర్ల మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన యద్దనపూడి నరసింహారావుగారిని వివాహం చేసుకున్న అనంతరం హైదరాబాద్ వచ్చేసారు. ఆమెకు ఏకైక సంతానము శైలజ–ఇప్పుడు అమెరికాలో ఉంటున్నారు.

యద్దనపూడిగారి రచనా విషయానికి వస్తే, ఆవిడ మొట్టమొదట ఒక పెద్ద కథానికను వ్రాసారు. అది ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితము అయ్యింది. ఆ తరువాత, ఆవిడ కథానికలు దాదాపు వ్రాయలేదనే చెప్పాలి. ఆవిడ వ్రాసినవన్నీ నవలలే. నవల రాణిగా పాఠకుల హృదయాలలో గొప్పస్థానాన్ని సంపాదించారు. 'చదువుకున్న అమ్మాయిలు' తో చలనచిత్ర రంగ ప్రవేశం చేశారు.అక్కడ ఆవిడకి తిరుగు లేదు. చిత్ర నిర్మాణానికి ముందు నుంచే ఆ నవలలో ఎవరెవరు నటిస్తే బాగుంటుందో, పాఠకుల అంచనాలు మొదలయ్యేవి ఆవిడ నవలలతో వచ్చిన చిత్రాలు ఏవీ ఆర్థికంగా నష్టపోలేదు.

మనుషులు మమతలు, మీనా, సెక్రెటరీ, జీవన తరంగాలు, రాధాకృష్ణ, అగ్నిపూలు, ప్రేమ లేఖలు, బంగారు కలలు, జై జవాన్, ఆత్మ గౌరవం, గిరిజా కళ్యాణం, ఆత్మీయులు, కాంచన గంగ, ప్రేమ దీపిక, విజేత అనే ఆమె నవలలు చిత్రాలుగా వచ్చి ప్రజాదరణ పొందాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రచురణ రంగాన్ని కాదు, చలన చిత్ర రంగాన్నికూడా తమ నవలలతో ఒక ఊపు ఊపారు. ఎంత పేరు వచ్చినా ఆమెలోని సౌమ్యత ఏమాత్రం తగ్గలేదు. అందరితోనూ అంత సౌమ్యంగానే మాట్లాడతారు.

ఆవిడ రచనలన్నిటిలోను స్త్రీలు ఆత్మాభిమానంతో ఒకస్థాయి ప్రవర్తన తో మనకి కనిపిస్తారు. రచయిత్రుల సంఖ్య పెరగాలని, వాళ్ళలోనూ ఇటువంటి ఆలోచనధోరణిని ఆశించారు. కేవలం 'లేఖిని' సంస్థ ప్రారంభకులే కాకుండా అంతకుముందు, సాధారణంగా బయటకిరాని ఆవిడ, మా ఆహ్వానాన్ని మన్నించి ఎన్నో సార్లు ఎంతోమందికి స్ఫూర్తిని ఇచ్చారు. ఆమె వెళ్ళిపోవటం సాహితీ లోకానికి అశని పాతం వంటిది. ఆవిడ ఆత్మకి మా అందరి హృదయపూర్వక నివాళులు.

భాషోద్యమ కథానిక

# మాతృభాష

చెన్నూరి సుదర్శన్
9440558748



మన మాతృ భాషకు మనమే సంకెళ్ళు వేస్తున్నాము. ఇంతకంటే ఘోరమైన తప్పిదం మరొకటి లేదు. ఇలా పరాయి భాషలో సన్మానం నాకిష్టం లేదు. మరో సారి మన మాతృభాషలో సన్మానానికి ఆహ్వానిస్తే వస్తాను. ఈ సారికి నన్ను క్షమించండి" అంటూ వేదిక దిగి చక చకా వెళ్ళ సాగింది.

ఆ రోజు శనివారం.

నా కూతురు కుసుమ తన ఫోన్లో వాట్సాప్ తెరచి ఒక ఆహ్వాన పత్రిక చూపించింది.

అది అమెరికాలోని తెలుగు సంఘం...కుమారి కిరణ్మయి తోటకూర... కూచిపూడి రంగప్రవేశానికి సంబంధించిన ఆహ్వాన పత్రిక ఆంగ్లంలో ఉంది. నాకు విస్మయం కలిగింది.

"ఇదేంటిరా కుసుమా...మనం తెలుగువాళ్ళం. కార్యక్రమం కూచిపూడి నృత్యం తెలుగు వారికి సంబంధించింది. నృత్యం చేసేది తెలుగు అమ్మాయి. ఆహ్వాన పత్రిక పంపినవారు తెలుగువారు...అయితే పత్రిక ఆంగ్లంలో ఉండడం...నాకు నచ్చలేదు" అన్నాను కుసుమతో.

కుసుమ చిన్నగా నవ్వింది.

"నిజమే నాన్నా.. ఇక్కడికి వచ్చాక అంతా మన మాతృభాష మర్చిపోతున్నారు. అది మాట్లాడాలంటేనే నామోషీగా ఫీలవుతున్నారు...

మీరు ఇండియా నుండి ఇక్కడికి వచ్చినప్పటినుండీ మిమ్మల్ని ఎటూ తీసుకు వెళ్ళడం వీలుకాలేదు. ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు ప్రోగ్రాం...మనం వెళ్దాం. స్మిత్ సెంటర్ వేదిక అచ్చం మన రవీంద్ర భారతిలా ఉంటుంది. మీకు ఒలోన్ కళాశాల వాతావరణం బాగా నచ్చుతుంది. ఫ్రీమాంటు కాస్తా తిరిగి చూసినట్టూ ఉంటుంది" అంటూ నన్ను ఉత్సాహపర్చింది కుసుమ.

మేము ఉండేది కాలిఫోర్నియా రాష్ట్రం లోని మౌంటేన్ హౌజ్ ప్రాంతంలో క్వెస్టా గ్రామం. కారులో వెళ్ళడానికి దాదాపు గంటన్నర పట్టుం దని చెప్పింది కుసుమ.

నాకూ చూడాలనే ఉబలాటం వుంది. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కూచిపూడి నర్తకి సుమేధగారు ఇండియా నుండి వస్తోంది. ఆమె ప్రముఖ కూచిపూడి నృత్య గురువైన పద్మభూషణ్ డాక్టర్ చిన వెంపటి సత్యంగారి ముఖ్య శిష్యురాలు.

సుమేధగారి శిష్యురాలు శ్రీమతి హైమావతి. ఫ్రీమాంటులోని సాల సదానందం కూచిపూడి నృత్యకళాశాల డైరక్టర్.

హైమావతి శిష్యురాలు కుమారి కిరణ్మయి. అందుకే కిరణ్మయి రంగ ప్రవేశ ఉత్సవానికి (అరంగేంట్రానికి) అంత ప్రాముఖ్యత సంతరించుకుంది.

మన భారత దేశం నుండి వచ్చే సుమేధ

గారిని చూడాలనే ఉత్సాహం నాలో ఉరకలు వేయసాగింది.

"తప్పకుండా వెళ్దాం నాన్నా..." అంది కుసుమ గోముగా. నా సమ్మతిని నాకండ్లల్లోని మెరుపు చూసి గ్రహించింది.

"మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు నడుం వాల్చుకోండి. వెన్నెల, అమ్మా, నేను రడీ అయ్యాక మిమ్మల్ని లేపుతాను. రెండు గంటలకల్లా బయలుదేరుదాం..." అంటూ తన పనిలో నిమగ్నమయ్యింది కుసుమ.

నా అలవాట్లకు భంగం వాటిల్లకుండా చూసుకుంటుంది మా అమ్మాయి. కాని ఒక్కటే నాకు నచ్చనిది. ఇంట్లో నా మనుమరాలు వెన్నెలకు తెలుగు నేర్పించడం లేదు. మా అల్లుడూ అంతే.. తెలుగు ఇక్కడ అవసరం లేదంటాడు. అదేంటి ఎప్పటికీ ఇక్కడే ఉండి పోతారా.. అప్పుడప్పుడైనా మన దేశం రారా...? పిల్లలకు తెలుగు రాకుంటే ఎలాగా? అని నేను వాదిస్తూంటాను. ఆంగ్లం మాట్లాడినా అది ముందుగా మన మాతృభాషలోకి తర్జుమా అవుతుంది. అలా అయితేనే అది మన బుర్రలోకి ఎక్కుతుంది. అని నేను ఎంతగా నచ్చ జెప్పినా.. నాదంతా చాదస్తమని కొట్టిపారేస్తూంటారు. కుసుమ సైతం మా అల్లునికే వత్తాసు పలుకు తుంది. అక్కడే నామనసు కలుక్కుమంటుంది.

నేను పదవీ విరమణ చేసాక అమెరికా వచ్చిన లక్ష్యం...నా వెన్నెలకు మన మాతృభాష తెలుగు నేర్పించాలని. ప్రతీ రోజు సాయంత్రం పార్కుకు తీసుకెళ్ళి చిన్న చిన్న పదాలు చెబు తున్నాను. తన ముద్దు ముద్దు మోముతో చిలుక పలుకుల్లా వచ్చే వెన్నెల మాటల మూటలతో నా హృదయం పులకరించి పోతూంది. ఎలాగైనా సరే...నేను తిరిగి ఇండియా వెళ్ళే లోగా వెన్నెల తెలుగులో మాట్లాడేలా చెయ్యాలని మనసులో ప్రతిజ్ఞ చేసుకున్నాను.

నా మొండి పట్టుదలతో...మా నాన్న గారిని ఎదిరించి తెలుగు పండితుడనయ్యాను. నేను తరగతి గదిలో పద్యాలు చదువుతుంటే బడి సాంతం చెవులు నిక్కపొడుచుకొని వినేది.

''మా జీవితాలు ధన్యమయ్యాయి మాస్టారూ...మా చెవుల తుప్పులు వదిలాయి.." అంటూ నా సహ అధ్యాపకులు పొగిడేవారు. ఆ మాధుర్యమే వేరు. తెలుగు షడ్రుచులతో కడుపారా భోజనం చేసినట్లుంటుంది. అదే ఆంగ్లం మాట్లాడితే అంత వినసొంపుగా అని పించదు సరి కదా...నాకు ఉప్పులేని పప్పులా ఉంటుంది.

తెలుగులో ఉన్న అష్టావధానం...శతావ ధానం...పద్య సౌలభ్యం ఆంగ్లంలో ఎక్కడివి?. ఒక ప్రక్క విదేశీయులు సైతం మన తెలుగు భాషకు ముచ్చటపడి దాని ప్రాశస్త్యాన్ని ఇనుమ డింపజేయ కృషిచేస్తుంటే...మన తెలుగు వారేమో...ముక్కిరుస్తున్నారు.

మరి మనవాళ్ళు అమెరికా వెళ్లి పంచె విడిచి...ప్యాంటు తగిలించుకున్నట్లు తెలుగు మరిచి ఆంగ్లం అతికించుకుంటున్నారు. నా బాధను ఎలా వ్యక్తపరచాలి...? అనే ఆవేదనతో ఆపూట అన్నం సహించ లేదు. ఏదో నాలుగు మెతుకులు కరిచి నడుం వాల్చుకున్నాను. కార్య క్రమానికి వెళ్తున్నామనే సంతోషంలో సరిగ్గా భోజనం చెయ్యలేదని సరిపెట్టుకుందనుకుం టాను నా సహచరి.

మా అల్లుడు ప్రాజెక్టు పనిమీద వేరే స్టేటుకు వెళ్ళడం...మేము అనుకున్న సమ యానికి తెమలడం కుదిరింది. లేకుంటే 'సంచులు సర్దే సరికి అంగడి విచ్చుల్లా' అయ్యేది. ఆడవారు అరగంటలో ముస్తాబైతే.. మా అల్లుడు గారికి ఆరు గంటలు పడ్తుంది.

మేము మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి సరిగ్గా సమయానికి చేరుకున్నాం.

కాలేజీ చిన్న కొండమీద నాగదేవతలా వంపులు తిరిగి ఉంది. సభాప్రాంగణం రమ ణీయంగా తీర్చి దిద్దబడి కలువ కొలనులా వుంది. సభలోకి ఆహ్వానిస్తూ ఇరువైపులా అందమైన అమ్మాయిలు సాలభంగిమ శిల్పాల్లా నిల్చొని ఉన్నారు. నా హృదయం ఉద్వేగంతో గంతులు వేయసాగింది.

సభలో అడుగు పెట్టేసరికి ఆశ్చర్య మేసింది. జనం...జనం. అంతా మన దేశపు వాళ్ళే...ఎక్కువగా మన తెలుగురాష్ట్ర సోదర సోదరీ మణులే...నాకు ప్రాణం లేచివచ్చిన ట్లయ్యింది.

మా కుసుమ తనకు తెలిసిన నాలుగు తెలుగు కుటుంబాలను పరిచయం చేసింది. ఆనందంతో కడుపు నిండి పోయింది.

'గణేశ' కౌత్వంతో కార్యక్రమం ఆరంభ మయ్యింది. రాగం ఆరభి.. తాళం మిస్ర చాపు.. ఆది. స్వర కర్త శ్రీ మంగళంపల్లి బాల మురళీ కృష్ణ. నృత్య సంయోజనం పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం. కుమారి కిరణ్మయి అభి నయం అమోఘం...కన్నుల పండువగా వుంది. మరో రెండు గీతాల అనంతరం స్వల్ప విరామ సమయం..

ఇడ్లీలు, వడ, సాంబారు, చట్నీల వడ్డన లతో సమయాన్ని సద్వినియోగ పరిచారు. అంతా తెలుగులో మాట్లాడుకుంటుంటే...నాకు వీనుల విందుగా ఉంది. మది ఆనంద డోలిక లలో నాట్యం చేయసాగింది.

కార్యక్రమం థిల్లాన గేయం...రాగం ధనశ్రీ...ఆది తాళం...నృత్య సంయోజనం స్వాతి తిరుణాల్ ప్రదర్శనతో ముగిసింది.

ప్రదర్శన అనంతరం సన్మాన కార్యక్రమం ఆరంభమయ్యింది. ముఖ్య అతిథి సుమేధ గారిని తదితర పెద్దలను వేదికపైకి ఆహ్వానించారు.

సల్లా హైమావతిగారిని...కార్యక్రమ నిర్వాహకులను, సహకారమందించిన వాయిద్య కళాకారులను సన్మానించారు. సభ ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మారుమ్రోగి పోతోంది. పెద్దల ప్రసంగాలన్నీ కుమారి కిరణ్మయిపై పొగడ్తల వర్షం కురిపించసాగాయి.

'ఇక చివరన సుమేధ గారి ప్రసంగం.. అనంతరం వారి సన్మాన కార్యక్రమం' అంటూ ప్రకటించాడు సభాధ్యక్షులవారు.

సుమేధ గారు ఉపన్యాసకుపక్రమణకై గొంతు సవరించుకోగానే సభ నిశ్శబ్దమయ మయ్యింది.

"ఇలాంటి సభకు నేను ముఖ్య అతిథిగా రావడం చాలా విచారకరం...' అనగానే సభలో కలకలం మొదలయ్యింది. నేనూహించాను. ఆమె ఏం చెప్పబోతోందో... నాకు తెలుసు.

వేదికపైనున్న వారు తమ వల్ల అపరాధం జరిగిందా..! అని వాపోసాగారు.

"నేను మొదటి నుండీ గమనిస్తూనే ఉన్నాను. ఇక్కడ నిర్వహిస్తున్నది తెలుగు సంప్ర దాయ కార్యక్రమం. తెలుగు జాతి గర్వించదగ్గ కూచిపూడి నృత్యం. ఒక నూతన నాట్యకారిణి రంగప్రవేశం చేస్తుంటే సాదరంగా ఆహ్వానిం

**కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!**

చాలని...హృదయ పూర్వకంగా ఆశీర్వదించాలని మీ కోరికపై మన భారత దేశం నుండి పరాయి దేశానికి వచ్చాను. అమెరికాలో కూడా మన తెలుగు సంస్కృతిని ప్రచారం చేస్తున్నారని గర్వించాను. కాని మీరు చేస్తున్నది ఏమిటి?" అని సుమేధ గారు ప్రశ్నించగానే... 'గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు' అంతా బిత్తరపోయి చూడసాగారు. నాసతీమణి కుసుమను చూడసాగింది...ఏమయ్యిందన్నట్లుగా...నేను ముసి ముసి నవ్వులు నవ్వసాగాను. నాకు తెలుసు సుమేధగారు ఏమని సభాసదులను నిలదీయబోతున్నారో...

సుమేధగారు మళ్ళీ మాట్లాడసాగారు...

"కూచిపూడి ఒక కుగ్రామం. ఇది మన తెలుగు రాష్ట్రంలోని కృష్ణా జిల్లా దివి మండలంలో వుంది. ఆగ్రామంలో పుట్టిన నాట్యానికి అదే గ్రామం పేరు రావడం...నాట్యకళాకారులకు కూచిపూడి ఇంటి పేరుగా కీర్తించడం మనకెంతో గర్వకారణం.

దాదాపు మూడు వేల సంవత్సరాల క్రితం భరతముని రచించిన నాట్యశాస్త్రమిది. పదమూడవ శతాబ్దంలో సిద్ధేంద్రయోగి అని పిలువబడే సిద్ధప్ప దానిని ఆధునీకరించాడు. ఎందరో మహానుభావులు ఈ నాట్యకౌశలతని తీర్చిదిద్దారు. నా గురువుగారైన శ్రీ వెంపటి చిన సత్యంగారితో ఈ నాట్యం మరింత శాస్త్రీయంగా బహుళ జనాదరణ పొందింది. ఇరవై ఆరు డిసెంబరు రెండువేల పది సంవత్సరంలో రెండువేల ఎనిమిది వందల నాట్యకళాకారులు.. రెండు వందలకు పైగా గురువుల నియంత్రణలో హైద్రాబాదులోని బాలయోగి స్టేడియంలో హిందోళ రాగంలో జరిగిన కూచిపూడి నృత్య కార్యక్రమం ప్రపంచ పుటల్లోకి ఎక్కింది.

అలాంటి వాసికెక్కిన మన కూచిపూడి అరంగ్రేట్రం చేస్తున్న కుమారి కిరణ్మయి ఆహ్వాన పత్రికను మన మాతృభాషలో ప్రచురించలేదు. కీర్తనలు తెలుగు...అభినయం తెలుగు.. వేదికపై ఉన్న పెద్దలు తెలుగు...సభకు విచ్చేసిన వారంతా దాదాపు తెలుగు వారే...అయినా ఎవరూ మన మాతృభాష తెలుగులో ప్రసంగించలేదు. ఎందుకు...? తెలుగు మాట్లాడ్డమంటే మీకు అగౌరవంగా తోచిందా? మీరు పరాయి భాషలో మాట్లాడుతుంటే నా కన్నతల్లిని అవహేళన చేస్తున్నట్లు ఆవేదన చెందాను.

మన మాతృ భాషకు మనమే సంకెళ్ళు వేస్తున్నాము. ఇంతకంటే ఘోరమైన తప్పిదం మరొకటి లేదు. ఇలా పరాయి భాషలో సన్మానం నాకిష్టం లేదు. మరోసారి మన మాతృభాషలో సన్మానానికి ఆహ్వానిస్తే వస్తాను. ఈ సారికి నన్ను క్షమించండి" అంటూ వేదిక దిగి చక చకా వెళ్ళ సాగింది.

ఆ దృశ్యం... అందోళన రాగం, చిరాకు తాళం, నృత్యభంగిమలో వెళ్తున్నట్లు నాకనిపించింది. సభాసదుల ముఖాలు పాలిపోయాయి. అందరు సిగ్గుతో తలలు దించుకున్నారు. నేను నా కూతురు ముఖం తదేకంగా చూడసాగాను. నాకెందుకో అలా చూడాలనిపించింది. కుసుమ తల తిప్పుకుని వెన్నెలను చూడసాగింది. వెన్నెల బేలగా నన్ను చూస్తూ ..

"తాతయ్యా...తెలుగు" అంటూ నవ్వసాగింది. కుసుమ వెన్నెల నోట తెలుగు విని విస్తుపోయింది.

నామదిలో చటుక్కున ఒక ఆలోచన మెరిసింది. వెంటనే లేచి వెన్నెలను తీసుకొని సుమేధకు ఎదురుగా పరుగు తీసాను. సుమేధ గారి కాళ్ళపై వెన్నెలను పడవేసి సాష్టాంగ నమస్కారం చేయించాను. హఠాత్పరిణామానికి సుమేధగారు నిశ్చేష్టురాలయ్యారు...ఆమె పాదాలను పట్టుకుంది వెన్నెల. నేను దీనంగా తలెత్తి సుమేధగారిని చూడసాగాను. నా వేదన అర్థం చేసుకునే వరకు వెన్నెలను కదిలించలేదు. సుమేధగారు వంగి వెన్నెలను ఎత్తుకుంది. నా భుజం తట్టింది. నేను లేచి సుమేధ గారిని సాదరంగా తిరిగి వేదిక పైకి తీసుకెళ్ళాను. నా వెనకాలే కుసుమ వచ్చి వెన్నెలను తీసుకుంది. సభ సాంతం ఆశ్చర్యంగా చూడసాగింది. కరతాళ ధ్వనులు లయబద్ధంగా మ్రోగసాగాయి.

సుమేధ గారిని ఆమెకోసం ప్రత్యేకంగా తెప్పించిన శోభాయమైన సింహాసనంలో కూర్చోబెట్టి మైకు చేతిలోకి తీసుకున్నాను.

ముందుగా నేను ఒక తెలుగు పండితుడిగా పరిచయం చేసుకున్నాను.

రాయప్రోలు సుబ్బారావుగారు రచించిన మన దేశభక్తి గీతాన్ని ఆలపించడానికై గొంతు సవరించుకున్నాను.

"ఏ దేశమేగినా ఎందు కాలెడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా,
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలపరా నీ జాతి నిండు గౌరవము"

అంటూ ఎలుగెత్తి పాడే సరికి సభలో చప్పట్లు మిన్నంటాయి.

మాతృభాషపై మాడుగుల నాగఫణి శర్మగారు రచించిన మరొక గీతాన్ని తీసుకున్నాను.

"అమ్మ నాన్న యన్న ఆప్యాయత నింపు
మమ్మీ డాడీ పిలుపు మనది కాదు
................"

అంటూ శ్రావ్యంగా పాడే సరికి సభ యావత్తు హర్ష ధ్వనులలో తేలి ఆడింది.

శర్మగారు రచించిందే..
అమ్మ పలుకులోని యమృత ధారతో...
తెలుగు భాష వెలిగి దీప్తినొందు' అంటూ

మరో పద్యం చదివాను. సభ మంచి రసపట్టులో ఉంది...

ఇదే సమయం...మించిన దొరకదని... సభకు ఒక విన్నపం చేసాను.

"ఈ రోజు ఇంతటి శుభసమయంలో మన గౌరవనీయ ముఖ్య అతిథి సుమేధ గారి సమక్షంలో మన మాతృభాషను సంరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేద్దాం..." అన్నాను. సభ యావత్తు వత్తాసు పలికింది.

సుమేధగారి ప్రతిజ్ఞ వచనాలను అంతా వల్లె వేసాము.

సుమేధ గారిని సన్మానిస్తుంటే.. ఆమెలో మన తెలుగుతల్లిని మాతృభాషను ముద్దాడుతున్నట్లుగా గోచరించింది.


**2018 సంవత్సరానికి డా. వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం**

బాల సాహిత్యంలో అద్భుతమైన కృషి చేసిన నేషనల్ బుక్ ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి, సహ సంపాదకులు **డాక్టర్ పత్తిపాక మోహన్** ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. రూ.5000 నగదు, శాలువా సత్కారం, జ్ఞాపిక ఇవ్వబడతాయి. ఈ పురస్కారాన్ని డా.వేదగిరి రాంబాబు పుట్టినరోజు అక్టోబర్ 14న రవీంద్రభారతిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేస్తాము.

సింహప్రసాద్ సాహిత్య సమితి, హైదరాబాదు. 9849061668

సన్నిధానం నరసింహశర్మ
9292055531

# వేయి ఏనుగుల బలాన్నిచ్చిన విశ్వనాథుని ప్రశంస



**ఆ**ధునిక తెలుగు సాహిత్యరంగంలో విశ్వనాథ, శ్రీశ్రీ, జాషువా, తుమ్మల, ఆరుద్ర, ఆత్రేయ, కాళోజీ, సి.నా.రె. ఇటువంటివారు తమ అనన్య సాహితీ కవితా సృజనల ద్వారా తెలుగువాడు భారతదేశంలో తలెత్తుకు నిల్చేలా చేశారు. వీరికి ముందు, వెనుక వారు, మరికొంతమంది సమకాలీనుల పాత్రకూడా తక్కువది కాదు. ఇందులో విశ్వనాథ సత్యనారాయణ వివిధ ప్రక్రియల ప్రముఖ సాహిత్య సృజనకర్త, మహాకవి.

విశ్వనాథ 10-9-1895 - 18-10-1976 మధ్యకాలానికి చెంది 81 ఏళ్ల జీవితంలో సాహిత్యభాగం ఎక్కువ కలవారు. సంప్రదాయ కవులకు, ఆ వాద కవులకు ఆయన పెద్దదిక్కు. శ్రీమద్రామాయణ కల్పవృక్షం - సంప్రదాయ పద్య కవితా మార్గంలో ఒక మేరు శిఖరం. ఆయన రచనలపై కావ్యాలపై అన్నికోణాలపై బహుముఖాల పరిశోధనలూ సాగాయి. అవన్నీ తక్కువేమీ కాదు. కానీ నాకు - మా చలసాని ప్రసాద్‌గారు రాసిన 'విశ్వనాథ ప్రస్తావన' ముందుమాటల వ్యాసం చాలా నచ్చింది. అది త్రిపురనేని మధుసూదనరావు - విశ్వనాథ తిరోగమన సాహిత్యంకి 1995లో చలసాని వారి ముందుమాటలు. అవి నాకు నచ్చడానికి కారణమేమిటంటే - ఆయన పాండిత్యస్థాయి, సృజనశీలత, రచనా వైదగ్ధ్యంవంటి వాటిని వేనినీ తగ్గించి చెప్పకుండా విశ్వనాథవారి సామాజికపు వెనుకబాటుతనం గురించి తన భావజాల భావాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం చలసానివారి ఈ వాక్యాలు చూడండి "శ్రీశ్రీ అన్నట్లు ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్ర ఆ చరిత్రకొక పరిణామం వుంటాయి. సామాజిక చారిత్రక పరిణామక్రమంలో కవియొక్క స్థానం నిర్ణీతమవుతుంది" అంటూ శ్రీశ్రీ వాక్యాలు ఉటంకిస్తూ "ఈ గీటురాయి ప్రకారం గురజాడ ఇరవైఒకటో శతాబ్దానికి చెందితే, విశ్వనాథ ఒకటో శతాబ్దానికి చెందవలసి వుంటుంది" అని బేరీజు వేయడం ఆచి, తూచి చెప్పడమే. విశ్వనాథ భావజాలాన్ని ఆయన రాసిన "తెలుగుదేశాన యువకులు త్రిదశులైరి మొట్టమొదట శాస్త్ర పురాణముల నిరసన / పైన దేవుడు లేడన్న పట్టుదలయు / సూటిగా చిట్ట చివరకు సోషలిజము" అనే పద్యంతో తెలుపుతూ యువతనీ, నవతని వేళాకోళం చేశాడు విశ్వనాథ. కొత్తని కాలదన్ని పాతని నెత్తిన పెట్టుకున్నాడు విశ్వనాథ అని ఖరాఖండీగా చెప్పారు. ఆ మాటల్లోనే 'విశ్వనాథ తన విశ్వాసాలని బాహాటంగానే వెల్లడి చేశాడు. తన నమ్మకాలని ఆయన దాచుకోలేదు. రాజీలేని భావజాలం ఆయనది. సమాజం పట్ల స్పష్టమైన తాత్విక దృక్పథం వుందాయనకు. పరిశీలనాశక్తి వుంది. గొప్ప ఊహాశాలి. సాహిత్యాన్ని ఆహార్యంగా చేసుకుని కవిత్వాన్ని కవచంగా ధరించిన, 'నిబద్ధ' సాహిత్యవేత్త విశ్వనాథ. తమ సిద్ధాంతాన్ని ఇంత బలంగా, శక్తిమంతంగా చేసిన వారరుదు. ఈ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో విశ్వనాథ వ్యక్తిత్వం, ముద్ర, ప్రభావం ప్రబలంగా ఉన్నాయి" అని రాశారు. ఇలా రాసిన వ్యాసం నాకెందుకు నచ్చిందో చలసానివారికి విశాఖలో నా హృదయాన్ని వివరించి చెబితే ఆ సాహితీ సుగంధ సహృదయమూర్తి ఎంతో పొంగి పోయారు. ఎత్తితే ఆకాశానికీ లేదా దించితే పాతాళానికీ అన్నట్లు రాసేవారు. ఇటువంటి చలసాని వ్యాసాల వంటివి చదవాలనిపిస్తుంది, నాకైతే.

కవిత్వం రాసి విశ్వనాథకి వినిపించి ఆయన మెచ్చుకోలు పొందాలనేది ఆయన కాలంలో ఎంతోమంది పెద్ద తలకాయలకే వుండేది.

ముప్ఫై ఏళ్ళ వయసున్న నాకు విజయవాడ వెళ్ళి ధైర్యం చేసి ఆయనకు కవిత్వం వినిపించాలని 1970 దశకంలో ఉండడంలో ఆశ్చర్యమేమిటి? విజయవాడ పటమటలో ఆంధ్ర గ్రంథాలయ సంఘ సి.ఎల్.ఎస్.సి శిక్షణార్థం వెళ్ళాను. ఆ సందర్భంలో విశ్వనాథవారింటికి వెళ్ళాను. రెండుమూడు సార్లు ఆయనను దర్శించుకున్నాను. ఆయనకు కవితా ఖండిక వినిపించాలనుకున్నా కాని భయం, పెద్దాయన ఏమంటారో అని. ఆయనను సమీపించడంలో నా కులగోత్రాలు సహకరించాయి. అయితే వాటితోనే ఆ కవిత్వాన్ని కవిత్వంగా అనే రకం కాదు.

మారుతీ నగర్‌లో ఆయనింట్లో పంచె, బనీనుతో ఉన్నారు. నమస్కరించి నాలుగు పద్యాల ఖండిక చదవాలనివుందండి. తప్పులుంటే చెప్పండి అన్నాను. భూమ్మీద నీళ్ళులేని పరిస్థితిపై అన్నా. 'చదువు' అన్నారు ప్రోత్సాహకర కంఠంతో. కవి రాగంతో

"ఇన్నియేండ్ల నుండి అని వచించగలమె
తిరుగుచున్నది భూమి భాస్కరుని చుట్టు
తిరిగి తిరిగి తిరిగినను దేనికిట్లు
చుట్టుచుంటివే పనియుండి చుట్టు తిరుగు
చుంటి సగమెండబడికందుచుంటి" వనుచు

ఒక్కనాడుష్ణహృదయుడొక్కమారు
నడుగనే లేదు భూమి మాటాడలేదు.
భాస్కరా లక్ష్యమనుబాధ బడసి పుడమి
నీరుగారి పోయె మనసు – వేరు కార
ణమ్ము కాదందు చేతనే అమ్మహాధ
రిత్రి మూడు భాగముల వారియు మరొక్క
భాగమే భూమియందు దౌర్భాగ్యమొదవె
స్వేద ఫలితమ్ము భూమికే చెందలేదు
కరకుటెదవాడు సూర్యుడు కరుగలేదు
తిరుగుచున్నది ఆమె భాస్కరుని చుట్టు
మూడు వంతుల నీళుల పుడమి మరియు
మరియు భ్రమియించు చుండెనేమగునొ ముందు?

అని – ప్రళయం అనే నా కవితా ఖండికను వినిపించాను.వెంటనే ఆ మహాకవి మెరిసే కళ్ళతో తల పంకిస్తూ "ఊహ బాగుంది ఊహ బాగుంది. కొంచెం సైన్సుకి వ్యతిరేకంగా ఉన్నా కొత్త ఆలోచన" అన్నారు. వేయి ఏనుగుల బలం ఒక్కసారిగా నాకు వచ్చినట్లయింది. అంతకు మునుపు రాజమండ్రిలో విఘ్నేశ్వరుని గుడి వీధిలో పుంభావ సరస్వతి మల్లంపల్లి శరభయ్య వుండేవారు. ఆయన ఇంట్లో విశ్వనాధ దిగేవారు. ఎవరు విశ్వనాధవారిని కలవాలన్నా లోపలికి వచ్చి శరభయ్యగారికి చెప్పే పని నాది. చిన్నతనం ఎంత గొప్పది! ఏదీ చిన్నతనమని అనిపించని ఆ స్వచ్ఛత ఎంత గొప్పది! భోజనానంతరం ఓ గదిలో మూలగా నేను బాసింపేట వేసి కూర్చుని వింటున్నాను. విశ్వనాధ, శరభయ్యగారు రామాయణ కల్పవృక్షం చదువుకొంటున్నారు. సీతమ్మ బాధల గురించి బాధపడ్తున్నారు. కళ్ళనీళ్లు పెట్టుకుని ఇంచుమించు ఏడ్చేస్తున్నారు. పద్యాలు చదివేసుకుంటున్నారు. మధ్యలో విశ్వనాధవారు తీక్షణంగా ఓ మూల బుద్ధిమంతుడుగా కూర్చుని వున్న నాకేసి చూసి "నువ్వెందుకు ఏడుస్తున్నావు నాయనా" అన్నారు. మీరిద్దరూ ఏదో గొప్పవి చెప్పుకుంటున్నారు. అవి అర్థంకాక ఏడుస్తున్నా అన్నాను. ఈ కుర్రాడెవరో అర్థంకాక ఏడుస్తున్నాడంటే పెద్దయ్యాక అర్థం అయి ఏడుస్తాడు. కుర్రాడు వృద్ధిలోకి వస్తాడన్నారు. ఆ విశ్వనాథ ఆశీస్సులు ఆ విధంగానైనా ముందుగా పొందడం, తరువాత ఏళ్లల్లో ఒక కవితా ఖండికకు ఆయన ఎదమెచ్చు పొందడం కదుంగడుటీపిగురుతే. ఒక సందర్భం, రాజమండ్రి శ్రీ గౌతమీ గ్రంథాలయంలో కంచుమర్తి బాబాయమ్మహాలులో – సాహిత్య సభ, చిలుకూరి లక్ష్మీపతి శాస్త్రిగారి నైషధ కావ్యశిల్ప సమీక్ష గ్రంథావిష్కరణ. ఆవిష్కర్త విశ్వనాథ. ఆయన మాట్లాడుతూ "ఈ రాజమహేంద్రవరలో నన్నయ్యగారి కాలంలో ఎటువంటి రసజ్ఞులుండేవారో ఇప్పుడూ అటువంటి రసజ్ఞులే వున్నారు" అన్నారు. అందరూ చప్పట్లు కొట్టారు. చెపితే నమ్మరు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, నేనూ మాత్రం ఒకరి మొఖం ఒకరు చూసుకుంటూ చప్పట్లు కొట్టలేదు.

విశ్వనాథవారు చనిపోయినప్పుడు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘంలో గురువుగారు పాతూరి నాగభూషణంగారి అధ్యక్షతన సంతాపసభ జరిగింది. విద్యార్థిగా నేను విశ్వనాథవారి గురించి సాహసించి మాట్లాడాను.

విశ్వనాథ మృతి మరునాడో తర్వాతో వెంటనే దీపావళి వచ్చింది. అప్పుడు ఆశువుగా ఓ పద్యం మామూలుధోరణిలో

"దీపములార వెల్గుల నదే పనిగన్ విరజిమ్ము కైతలన్
దీపములన్ వెలార్చిన సుధీమణి దీపమె ఆరిపోయె మా
పాపము పండి; పండుగన భావ్యము కాదిక విశ్వనాధునిం
జూపు తలంపుననే వెలుగుచున్ గనిపింపుడు పుణ్యముండెడిన్"

అని చెప్పాను.

తమ మార్గంలో సమాజానికి నవలలు, కావ్యాలు, ఖండకావ్యాలు, విమర్శలు, పీఠికలు, వ్యాసాలు, గేయాలు, ప్రసంగాలు విరివిగా అందించిన విశ్వనాథ సాహిత్య ధ్రువనక్షత్రంగా వెలిగారు.

---

.....**25వ పుట తరువాయి**

సుబ్బరామయ్యగారి మరో మంచికథానిక 'ముసురు' ప్రకృతిలో అప్పుడప్పుడు వాన ముసిరినట్టుగానే మనిషి జీవితంలోనూ వర్షం ముసిరి ఎలా విడిపోతుందో చెప్పే చక్కని కథానిక 'ముసురు'. నీళ్లు – వానే కాకుండా, చిన్న వైవిధ్యంతో విభిన్న మనస్తత్వాల కథానికలు వ్రాసారు.

**'మిస్ భారతి బి.ఎ'** కథానికలో పెళ్ళి కావలసిన యువతి కలలు...కల్లలు కావటం చెప్పారు. **'భయం'** కథానికలో పిల్లవాడికి పిన్ని నాన్నల భయంతోపాటు ఆదరణ, ప్రేమ ఎలా ఉండాలో చూపించారు.

స్త్రీ చైతన్యం గురించి కథానికలు వ్రాసారు. మోసం చేసిన నాగేశ్వరరావుతో 'చుక్కమ్మ' – నేను నిక్షేపంగా బ్రతకగలను నువ్వు మోసం చేసినా అంటుంది. ఇతిహాసపు చీకటి కోణంలో కనిపించని కథానికలని వ్రాసారు. స్వాతంత్ర్య సమరయోధుల భార్యల దౌర్భాగ్యాలని మన కళ్ల ముందు ఉంచారు. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో వైవిధ్య సంఘటనలు ఆయన కథానికల్లో కనిపిస్తాయి. ఆయన రచనలలో ప్రత్యేకంగా చెప్పదగ్గవి రైళ్ళ లోపలి పరిస్థితులని శుభ్రం చేస్తూ అశుభ్ర జీవితాన్ని గడుపుతున్న పిల్లల జీవితాన్ని మన కళ్ల ముందు ఉంచుతూ గొప్ప రచనలు చేసారు.

పాలగుమ్మి పద్మరాజుగారు అంటారు. "ప్రతి వ్యక్తి జీవితంలోను రెండు రోజులు అత్యంత ముఖ్యం అయినవి. విచిత్రం ఏమిటంటే, ఆ రెండు రోజుల గురించి ఆ వ్యక్తికి తెలియదు. ఒకటి – పుట్టిన రోజు. ఆ విషయం తల్లి మరి ఇతర పెద్దల ద్వారా తెలుసుకుంటూ ఉంటారు. రెండవ తేది అతను మరణించిన తేది! ఇదీ అతనికి ముందుగా తెలియదు. రెండవ తేదీ గడచిపోయిన తర్వాత, ఆ వ్యక్తి చరిత్ర అవుతాడు",. సుబ్బరామయ్యగారు కూడ చరిత్ర అయిపోయారు. ఈ చరిత్రనంతా పరిశోధించి, విశ్లేషించి, ఆయన సాహిత్యం గురించి మరిన్ని వివరాలని తెలుగు సాహితీ లోకానికి అందించాల్సిన అవసరం ఉంది. సాహితీ చరిత్రకారులు ఈ విషయాలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

**ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం**

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

# మీరూ పిడుగులు కావాలి!


గిడుగు

**“తా**తయ్య వచ్చారు” పిల్లలందరు కేరింతలు కొడుతూ ఆయన చుట్టూ చేరారు.

“ఒరేయి, నన్ను లోపలికి రానివ్వండిరా” అంటూ పిల్లల మధ్య నుంచి దారి చేసుకుంటూ, తన పడక్కుర్చీ వైపు కదిలాడు.

పిల్లలందరూ ఎవరికి దొరికిన సీట్లను వాళ్ళు, కుర్చీగావచ్చు, మోడాలు కావచ్చు లాక్కుని గబగబా తాతయ్యచుట్టూ చేరారు.

“ఒరేయి, ఎండనపడి వచ్చాను. కాస్త మంచినీళ్ళన్నా తాగనివ్వండి”

“ఇదిగో ఇస్తున్నా తాతయ్య” అని లోపలికి పరిగెత్తి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది కీర్తన.

“మీరందరూ కూడా కీర్తనలా చురుగ్గా ఉండాలి”

“ఏం తాతయ్యా, నేను కీర్తన కన్నా చురుగ్గా ఉండటంలేదా?” అలిగినట్లు అన్నాడు బుంగమూతితో అభిరామ్.

“ఎక్కడ కూర్చుంటే అక్కడ మన అభిరామ్ చేతులు కదిలి దగ్గరలో ఉన్న ఏదో ఒక వస్తువు విరగ్గొడతాయి. అది అతని చురుకుతనం” తమ్ముడు వంక చూడకుండా తాతయ్యతో అంది సుధేష్ణ.

“మీరిలా దెబ్బలాడుకుంటూంటే, నా గదిలోకెళ్ళి పడుకుంటా”వాళ్ళ గోల తగ్గించడానికి బ్రహ్మాస్త్రం వదిలాడు తాతయ్య.

“తాతయ్యా, వేసవి సెలవుల్లో ఇక్కడకొచ్చింది మీరు చెప్పే కథలు వినటానికే....”

“సరే! ఎవరూ అనవసరంగా మాట్లాడకూడదు”.

“అలాగే తాతయ్యా. మేం గోల చెయ్యం” పిల్లలందరూ ముక్తకంఠంతో అన్నారు.

“పిడుగు అంటే మీలో ఎవరికైనా తెలుసా?”

“ఆకాశంలో ఒక విద్యుత్ స్పార్క్‌లాగా వెలిగి నేలమీద కొన్ని ప్రాంతాలలో పడవచ్చు... పెద్ద శబ్దం వచ్చి అది నేలమీద పడినప్రాంతంలో మంటలు రావచ్చు”అంది సుధేష్ణ. అభిరామ్ మూతి ముడిచాడు.

“అది కాదు తాతయ్యా, మాకు పిడుగు, గొడుగుల గురించి వద్దు, కథ కావాలి” అని తన నినాదాన్ని ప్రకటించాడు అభిరామ్.

“నేను చెప్పేది కథేరా”

“వాడికేం తెలియదు. వాడి మాటలను పట్టించుకోకండి. చెప్పండి తాతయ్య” అని అంది కీర్తన.

“నేను చెప్పేది కథేరా...! అంటే... కాలక్షేపం కోసం చెప్పే కథ. ఒక మహనీయుడు గురించి చెప్పే కథ”

“అయితే చెప్పండి తాతయ్యా” అన్నారు పిల్లందరూ ముక్తకంఠంతో.

“మనుషుల్లో పిడుగు గురించి మీకు తెలుసా?”

అభిరామ్, సుధేష్ణ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

“తెలుసు. ఈ మధ్యే తెలుగుపాఠాన్ని చెప్తూ మా తెలుగు మాష్టారు ‘గిడుగు – పిడుగు’ గురించి చెప్పారు. ఆయన మన తెలుగుభాషకి పెద్ద పీటం వేసారు. అందరూ మాట్లాడుకునే భాషలో రచనలు చేయాలని కార్యకలాపాలను జరపాలని ఎంతో కృషిచేశారు” కంఠస్తం చేసి చెప్పినట్లు కీర్తన అప్పజెప్పింది.

“తెలుగుభాషకి సేవచేసినవాళ్ళు పిడుగులెలా అవుతారు తాతయ్యా”

“అదే ఇవాళ నేను మీకు చెప్పే కథ. మెట్రిక్యులేషన్ చదివేటప్పుడు తండ్రి చనిపోవటంతో కుటుంబాన్ని పోషించడం కోసం ఉద్యోగం చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అంచెలంచెలుగా పెరిగి పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో చరిత్ర అధ్యాపకుడిగా చేరారు. అంతటితోకూడా ఆయన తృప్తి పడలేదు. ఇంట్లో దీపాలకాంతి సరిపోకపోవడంతో, తను పనిచేస్తున్న పాఠశాలలో దీపం క్రింద చదివేవారు. పెళ్ళితో విద్య సాగదు అని అనుకుంటూ ఉంటారు. కాని గిడుగు రామ్మూర్తిగారు ఆంధ్రా యూనివర్శిటీ బి.ఎ.లో విశ్వవిద్యాలయస్థాయిలో ద్వితీయశ్రేణిలో పాసయ్యారు. అంతేకాదు, వాళ్ళ పాఠశాల, కళాశాల స్థాయికి ఎదిగేటప్పటికి, ఆయన అక్కడే లెక్చరర్ అయ్యారు. మీలాంటి పిల్లలందరికి మార్గదర్శకులు అయ్యారు”.

“నిజమే తాతయ్యా! అయినా అంత మాత్రాన పిడుగులవుతారా?”

“నేను చెప్పేది పూర్తిగా వినండర్రా...”

“అలాగే తాతయ్యా...చెప్పండి” అన్నాడు అభిరామ్.

“చెప్పండి తాతయ్యా”

పిల్లలు కథ వినడంలో ఆసక్తి చూపసాగారు.

నేను ఉపాధ్యాయుడిగా పనిచేసి రిటైర్ అయ్యాను. ఇప్పటికీ నన్ను ఎంతోమంది శిష్యులు వాళ్ళు ఎంత పెద్దవాళ్ళు అయినా చూడగానే నమస్కరిస్తుంటారు, చూసారుగా?

"అవును తాతయ్యా..." పిల్లలందరూ ఒక్కసారే అన్నారు.

"మరేంటి అనుకున్నారు. ఉపాధ్యాయవృత్తిలోని గొప్పదనం అదే."

గిడుగు రామ్మూర్తిగారు, ఉపాధ్యాయుడిగా పనిచేసే రోజుల్లో 7వతరగతిలో చదువుతున్న వాళ్ళ రెండో అబ్బాయి అన్ని సబ్జక్టుల్లో మంచి మార్కులు తెచ్చుకున్నాడు కాని, తమ తండ్రిగారు చెప్పే చరిత్రలో 2 మార్కులు తగ్గాయి. ప్రిన్సిపాల్‌గారు ఆ రెండుమార్కులు వేసి పాస్ చేసేయ మన్నారు కాని గిడుగువారు దానికి ఒప్పుకోలేదు. పై తరగతికి వెళ్ళే అర్హత అతనికి లేదు అనిచెప్పి, తిరిగి తన కుమారుడిని అదే తరగతిలో చదివించారు.

ఇది ఆయన నిక్కచ్చితనాన్ని చెప్పటమేకాదు. భాషాభావాల పట్ల అవగాహన పెంచుకుని ముందుకు సాగటమే విద్య! మరో విద్యార్థిని కూడా ఆయన, మనిషిని పెంచే భాషాభావాలే అన్న విషయాన్ని మనకు చెబుతుంది విద్య అని చెప్పటానికి శిక్షించారు. కానీ అతను భయంతో పారిపోయాడు.

గిడుగు చాలా బాధపడ్డారు.

ఆ తర్వాత కొన్ని రోజులకి, నలిగిపోయిన దుస్తులతో వచ్చిన శిష్యుడిని చూడగానే, ఆయన కళ్ళు చెమర్చాయి" అని అలా చేస్తే నువ్వు నాలా కష్టపడి చదువుతావని భావించాను అనడంలో భాష, విద్యల పట్ల ఆయనకున్న అభిప్రాయం మనకి అర్థం కావడం లేదూ!

ఆ తర్వాత ఆ కుర్రవాడు చక్కగా చదివి, చక్కటి విద్యావేత్త, భాషాశాస్త్రవేత్త అయ్యారు. ఆయన పేరు, చిరుకూరి నారాయణరావుగారు.

"గ్రేట్"అని గట్టిగా అరిచాడు అభిరామ్.

ఆయన దగ్గర చదివి, మన జాతికి, సాహిత్యానికి ఎనలేని సేవలందించిన తాపీ ధర్మారావుగారు కూడా ఆయన శిష్యులే.

"అవును తాతయ్యా, సినిమాలకి దర్శకత్వం వహించారు కదా?"

"నీకు తెలిసింది అదే. ఆయన ఎన్నో మాధ్యమాల ద్వారా భాషని, సాహిత్యాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్ళటానికి ఎంతో కృషి చేశారు.

"అవునా తాతయ్యా...!" కీర్తన నోరు వెళ్ళబెట్టింది. అన్నట్లు చెప్పడం మరిచాను, ఆయనా గురజాడ అప్పారావుగారూ మెట్రిక్యులేషన్ వరకు విజయనగరంలో కలిసి చదివారు. అందుకే ఆ రోజుల్లోనే వారు తెలుగుజాతి, భాషపై అభిమానాన్ని పెంచుకున్నారు. అదే ప్రాతిపదికగా పెరిగి మన తెలుగు భాషా సాహిత్యాల్ని ఆధునీకరించి మనకెంతో తోడ్పడ్డారు".

"నేను తప్పకుండా తెలుగుజాతి, భాషకి సేవలు అందిస్తాను" అన్నాడు అభిరామ్.

"అందిద్దువుగానిలే... ముందు తాతయ్యచెప్పే విశేషాలు విను..."

"సరే తాతయ్యా! ఆయన పిడుగు ఎలా అయ్యారు? అదీ చెప్పవా?"సుధేష్ణ అడిగింది.

"చెప్తున్నా విను. అప్పట్లో ఒరిస్సా వేరే రాష్ట్రంగా ఉండేది కాదు. ఆ రాష్ట్రంలో ఉన్న చాలా భాగాలు మన తెలుగురాష్ట్రంలో నుండి వేరుచేసి కలిపినవే. అందుకు ఆంగ్లేయులకు మద్దతునిచ్చారు పర్లాకిమిడి రాజావారు.

రాజావారు తమకి సన్నిహితులైనా, ఆయనకి వ్యతిరేకిస్తే,తన మనుగడకి కష్టం అని తెలిసినా తెలుగువారి భవిష్యత్తు మీద మమకారంతో ఆయన అలా రాజావారికి మొదటి పిడుగును వేసారు. అంతకుముందు, తెలుగువాళ్ళు కలసి ఉన్నా తమిళుల నుండి వేరుపడడానికి రెండవ శ్రేణి వ్యక్తులుగా వ్యతిరేకించారు. ఇప్పుడు, పర్లాకిమిడి ప్రాంతం ఒరిస్సాలో కలవడంతో మళ్ళీ తెలుగు వాళ్ళు ఒరిస్సాలో ద్వితీయశ్రేణి ప్రజలుగా జీవించాల్సి వస్తుంది. అది ఆయనకి నచ్చలేదు. అందుకే రాజావారితో వ్యతిరేకించి చాలా కష్టపడ్డారు. ఆఖరికి, పర్లాకిమిడిని ఒరియాకు కోల్పోయాంగాని, చుట్టూ ఉన్న వంద గ్రామాల్ని ఆంధ్రలోనే ఉండేటట్టు చేయగలిగారు.

ఒరియా రాష్ట్రంలో ఉండటం ఆయనకు ఇష్టంలేక, రాష్ట్రవిభజన జరగగానే, పర్లాకిమిడి పక్క ఉన్న మహేంద్రతనయ నదిలో స్నానం చేసి, తర్పణాలు విడిచి, తనంతవరకు ఉన్న ఇల్లువాకిల్లని అలాగే వదిలేసి రాజమండ్రి చేరారు. చూసారా పిల్లలు...అది ఆయనకు తన జాతిమీద, సంస్కారం మీద ఉన్న గౌరవం. మనందరం కూడా ఆంధ్రులులా బ్రతకాలి. తెలుగుభాషని గౌరవించాలి అన్నది ఆయన ఆశయం.

"నిజమే తాతయ్యా 'గిడుగు పిడుగే' ".

ఆయనని పిడుగు అని పిలవడానికి ఇదొక్కటే కారణంకాదు. ఆయన ఉంటున్న పర్లాకిమిడి దగ్గర్లో ఉన్న కొండల్లో సవరజాతి వాళ్ళు నివసిస్తుండే వాళ్ళు. వాళ్ళు అడవిలో దొరికే వాటిని తీసుకొచ్చి పర్లాకిమిడి సంతలో అమ్ముతుండేవారు. వాళ్ళని నాగరికులు మోసం చేస్తుండేవారు. అందుకు కారణం వాళ్ళు చదువుకోకపోవడమే అని గుర్తించారు. మాతృ భాషద్వారా మన గురించి తెలుసుకోవచ్చు, మిగతా భాషలతో విశ్వ మానవులు కావచ్చు అనిపించింది. అనిపించిందే తడవుగా తను సవర భాషని నేర్చుకుని, వాళ్ళకి వాళ్ళభాష నేర్చుకోవడం కోసం సవరభాషలో వాక్యనిర్మాణాల గురించి వ్యాకరణం లాంటి విశేషాలు వ్రాయటమే కాకుండా, సవర – ఇంగ్లీష్, ఇంగ్లీష్ – సవర, తెలుగు – సవర, సవర –తెలుగు నిఘంటువులని రూపొందించారు. లిపిలేని సవరభాషకి ఇలా నిఘంటువులని రూపొందించటంలో తెలుగు, ఇంగ్లీష్ లిపులలో ఎంత కష్టపడ్డారో ఆయనే చెప్పారు. అందరూమాతృభాష నేర్వాలి అన్నది ఆయన ఆశయం. ఆ తర్వాతే ఎన్ని భాషలన్నా నేర్వవచ్చు..."

"తాతయ్యా, వీడికి మాతృభాషలో అక్షరాలు కూడా తెలియదు..."

"మా పాఠశాలలో తెలుగు చెప్పరు తాతయ్యా"

"బావుందిరా, తెలుగుదేశంలో పుట్టి, తెలుగు చదవటం రాదన్న మాట. మీరు ఏ దేశం వెళ్ళినా, మీరు ఎవరని చెప్తారు?"

"తెలుగువాళ్ళం అంటారు..."

తెలుగురాని వాడు తెలుగువాడా! అలా కాకూడదు... విద్య దబ్బు

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లి భాష**

సవరణ : 2018 మే నెల సంచిక 33వ పుటలోని వ్యాసం – శీర్షిక 'వేదం వెంకటాచలయ్య' అని చదువుకోవాలి. పొరపాటున వేదం వెంకటా చలపతిరావు అని ముద్రణలో వచ్చినందుకు చింతిస్తున్నాము.– సం.

సంపాదించడానికే కాదు, జ్ఞానం సంపాదించడానికి అన్నారు ఏనాడో గురజాడ. మీ పాఠశాలలో తెలుగు చెప్పకపోయినా, ఇంటిదగ్గరే రోజూ ఒక గంట అయినా తెలుగు నేర్పమని, మీ అమ్మకి చెప్తాను" అన్నాడు తాతయ్య.

"అలాగే తాతయ్యా...తప్పకుండా నేను తెలుగునేర్చుకుంటాను. వచ్చే వేసవి సెలవులకల్లా నేను తెలుగు నేర్చుకుంటాను. మీ అందరికి తెలుగు కథ కూడా చెప్తాను."

"శభాష్..."

గిడుగువారు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు, పిల్లలు ఆయనని చికిత్సకోసం చెన్నయ్ తీసుకువెళ్ళారు. కాలేయగుల్మంతో బాధపడుతున్నా, తానుచివరిదశలో ఉన్నాను అని తెలిసే, చెన్నయ్‌లో భాష గురించి ఒక సమావేశం ఏర్పాటుచేయమని 'ప్రజాతంత్ర' సంపాదకులు గూడవల్లి రామబ్రహ్మంగారిని కోరారు. ఆ సభలో ముఖ్యంగా పాత్రికేయులను ఉద్దేశించి తుది విన్నపం చేసుకున్నారు. తానుమాట్లాడే భాషని ప్రజల్లోకి తీసుకువెళ్ళి, గ్రంథరచనలు కూడా ఆ భాషలోనే జరిగేటట్లు చూడమని గత 30 ఏళ్ళుగా నేను పలు ప్రదేశాలలో విన్న వించుకున్న విషయాలు కొంతవరకు ప్రజల్లోకి వెళ్ళాయి. నన్ను ఆంధ్రా విశ్వవిద్యాలయం సత్కరించటం నేను చేసిన పనులని గౌరవించుకునే కదా! నేను చేసిన పని వ్యావహారిక భాషోద్యమం. అంటే చెప్పకపోయినా, ప్రభుత్వం నా ఉద్యమాన్ని సమర్థించినట్టే కదా!

పత్రికలవాళ్ళు, చలనచిత్రాలకు సంబంధించిన వాళ్ళు, మాట్లాడే భాషకి ప్రాధాన్యం ఇవ్వటం వల్లే ప్రజల్లోకి వెళ్ళింది. మీరందరూ మీకెన్ని బాధ్యతలు ఉన్నా, ఈ ఉద్యమాన్ని, ముందుకు తీసుకెళ్ళగలరు. పూర్తి సాఫల్యాన్ని కలిగించగలరు. ఇదే నా తుది విన్నపం" అన్నారు.

"చూసారా పిల్లలూ, ఆయన చనిపోతూ కూడా తెలుగుభాష గురించి తపన పడ్డారు. గిడుగు పిడుగయ్యారు" చాలా గొప్ప విషయం చెప్పారు తాతయ్యా. మామూలు కథ చెప్పే కన్నా ఇలాంటి వాళ్ళ జీవితచరిత్రలోని సంఘటనలను కథలుగా చెప్తే చాలా బాగుంటుంది. ఇకముందు, ఇలాంటి కథలే చెప్పండి తాతయ్యా" మెరుస్తున్న కళ్ళతో అంది సుధేష్ణ.

"నిజమే తాతయ్యా, నిజంగా జరిగిన విషయాలు ఇన్ని ఉండగా కల్పిత కథలు ఎందుకు" అన్నాడు అభిరామ్.

"చాలా సంతోషం. మీరూ అలాంటి పిడుగులవ్వాలి" అని నవ్వుతూ "భోజనాల సమయం అయ్యింది. పదండి కాళ్ళు చేతులు కడుక్కుందాం" అన్నాడు తాతయ్య. పిల్లలందరూ కూడా బిలబిలా లేచారు.

## పుస్తక సమీక్ష



**తెలుగు వెలుగు** (వ్యాస మంజూష)
సంపాదకుడు : డా॥ అరిపిరాల నారాయణరావు
వెల: రు. 500/–
ప్రతులకు : డా॥ అరిపిరాల నారాయణరావు
ఇం.నెం. 23–16–35, లలితా నగర్,
రాజమహేంద్రవరం – 533 105,
సెల్ : 98497 12849

కొన్ని భాషాసదస్సులు మొక్కుబడిగా జరుపబడతాయి. కేవలం కొన్ని మాత్రమే మొక్కవోని దీక్షతో జరుగుతాయి. అలాంటిదే డా॥ అరిపిరాల నారాయణరావు ఒక యజ్ఞంలా, ముప్పైఏళ్ల క్రితం నరసాపురంలో(1985 డిసెంబరు) నిర్వహించిన జాతీయ సదస్సు 'తెలుగు వెలుగు'. వారి సంచాలకత్వంలో జరిగిన ఈ సదస్సు తరువాతి వారికి మార్గదర్శక మైంది. 'తెలుగు భాషా సాహిత్యాలపై ఇతర భాషల ప్రభావం' అనే అంశం పై జరిగిన ఆనాటి సదస్సులో తెలుగు భాష, సాహిత్యం సుసంపన్నమైనాయి. ఆనాటి ఆ సాహితీ యజ్ఞఫలమే ఈ 'తెలుగు వెలుగు' సంచిక – ఒక అనర్ఘ వ్యాసమంజూష.

నరసాపురం పట్టణంలోని శ్రీ యఱ్ఱమిల్లి నారాయణ మూర్తి కళాశాల తెలుగు విభాగం సారథ్యంలో 'తెలుగు – వెలుగు' పేరున 1985 డిసెంబరు6,7,8 తేదీలలో జరిగిన యు.జి.సి. సదస్సుతో ప్రారంభమైన ఆ సాహితీసౌరభాలు నిరాటకంగా అప్పటి నుండీ ఇప్పటి వరకూ గుబాళిస్తూనే ఉన్నాయి. ఆ సదస్సులలో ఎందరో ప్రముఖ సాహితీ వేత్తలు, భాషావేత్తలు, పండితులు, కవులు, ఆచార్యవర్యులు, ప్రసిద్ధ రచయితలు దేశం నలుమూలల నుంచీ వచ్చి పాల్గొన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ సదస్సులలో వారు సమర్పించిన పత్రాలు; ఉపన్యాసాలను సి.డి.ల రూపంలో నిక్షిప్తంచేసి యిప్పుడు వాటికి అక్షర రూపంయిచ్చి శ్రీ నారాయణరావుగారి సంపాదకత్వంలో గ్రంథంగా మనముందుకు తీసుకువచ్చారు. ఇందులో మూడు భాగాలుగ తెలుగు–వెలుగులు వెన్నెలలు కురిపించారు.

మొదటిభాగంలో 1985 జాతీయసదస్సులో సమర్పించినపత్రాలు, సి.డి.లలో నిక్షిప్తం చేసిన ఉపన్యాసాలు: వ్యాసాలు ఉన్నాయి. ఆ సందర్భంగా నిర్వహించిన కవన విజయం, యితర కార్యక్రమాల వివరాలను పొందు పరిచారు. రెండవ భాగంలో 1987 నుండి 2017 వరకు నిర్వహించిన కార్యక్రమాలలోని ప్రముఖుల 33 వ్యాసాలున్నాయి. ఇక, మూడవ భాగం ప్రత్యేకంగా అన్నమాచార్య సదస్సు(2006) లో సమర్పించిన వ్యాసాలు, ఉపన్యాసాలు 26 ఉన్నాయి.

భాషా సాహిత్య విద్యార్థులకు పరిశోధనాత్మక గ్రంథంగా ఎంతో అపురూపమైన, విలువైన ఉల్లేఖన గ్రంథం ఇది. ఈ వ్యాస మంజూష తెలుగు భాషాశాఖలలోను, అన్ని విద్యాలయాలలోను, గ్రంథాలయాలలోను అందుబాటులో ఉండ దగినది.

ఎమ్. వి. శాస్త్రి
94413 42999

గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

# మౌనంలోని మాటలు

8

**సంచారి రావోళ్ళు నాగప్ప ఆత్మకథ**

కన్నడ మూలం:
**డా. ఆర్. వి. బి. కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289



**బిచ్చం ఎత్తిన డబ్బుతో దేశం చుట్టిన కథ :**

**ఒ**క రోజు మేత్రిగారు నన్ను పిలిచి ఒక కుర్రవాడిని నాకు పరిచయం చేశారు. అతడి పేరు దొడ్మనె లోకరాజు అని చెప్పారు. 'ఈ కుర్రవాడు మీ కులం మీద పి. హెచ్. డి. చేస్తున్నాడు. మీ కులం గురించి అన్ని వివరాలు చెప్పు' అన్నారు. నేను అంగీకరించాను. అటు తరువాత ఆ కుర్రవాడిని మా కాలనీకి రమ్మని చెప్పాను. మా వాళ్ళందరినీ ఆ కుర్రవాడికి పరిచయం చేశాను.

ఇది జరిగిన తరువాత ఆ కుర్రవాడు, 'మీ కుల సర్వే చేయాలి' అన్నాడు.

అలాగే చెయ్యమని అన్నాను. మా వాళ్ళు ఫలాన ఫలాన ఊళ్ళో ఉన్నారు. వారికి ఒక ఊరు అంటూ లేదు. ఒక భాష లేదు. అన్నం దొరికిన చోటే వాళ్ళుంటారు. వెళ్ళు అన్నాను.

ఆ కుర్రవాడు 'నేను బీదవాణ్ణి. నా దగ్గర అంత డబ్బు లేదు" అన్నాడు.

అప్పుడు నేను, "తమ్ముడా, నీ కన్నా బీదవాళ్ళం మేము. నీకు సహాయం చేసేటంత గొప్పవాళ్ళం కాదు" అని చెప్పాను.

చివరికి ఈ విషయం మేత్రిగారికి తెలిసి ఆయన నన్ను పిలిపించారు. వెళ్ళాను.

"ఏదేమైనా మీ సముదాయం సర్వే జరగాలి. ఈ రాష్ట్రంలో మీ వాళ్ళు ఎంతమంది ఉన్నారో అదైనా తెలియాలి కదా ! ఈ కుర్రవాడితో పాటు మీరు కలిసి సర్వే చేయండి" అని అన్నారు.

"అందుకు డబ్బు కావాలి కదా సార్ ! మేము అడుక్కుని తినేవాళ్ళం సార్" అన్నాను.

"చూడూ, మీకొక కులసంఘం ఏర్పడితే మంచిది" అన్నారు.

"సరే, మేము కొన్ని దుడ్లు, ఆ పిల్లోడు కొన్ని దుడ్లు వేసుకుని సర్వే చేస్తాం" అని చెప్పాను.

మేత్రిగారు చెప్పిన విషయాన్ని మా కాలనీ జనాలకంతా చెప్పాను. మా వాళ్ళంతా బళ్ళారి జిల్లాలో సర్వే చేద్దామన్నారు. అటు తరువాత సింధనూరు, కారటగి, బళ్ళారి, తెక్కలకోట, సిరిగేరి, కంప్లి, కమలాపురలో ఉండే మా జనాలంతా కలిశారు. నువ్వు ఎలా చెబితే అలాగే చేద్దామని మా వాళ్ళు భరోసా ఇచ్చారు. చివరికి మేము ప్రతీ ఇంటి నుంచి ఇంత అని చందా అడిగి వచ్చిన రొక్కం పోగేశాం. నేను, లక్షణ, తెక్కలకోట సణ్ణ రామయ్య, సిరిగేరి రాజప్ప, సింధునూరు కివుడు మారెప్ప, మహేశ, కారటగి పూజారి జంబణ్ణ, నాగప్ప, బళ్ళారి ఈరణ్ణ మొదలైనవాళ్ళం కలిసి పెద్దఆటో చేసుకున్నాం. ఆ కుర్రవాడిని పిల్చుకుని ఆటోలో మొత్తం రాష్ట్రమంతా తిరిగి సర్వే చేశాం. ఆ కుర్రవాడు మాత్రం ఒక్క పైసా ఖర్చు పెట్టలేదు. పోనీలే ! దీని వల్ల మా వాళ్ళు ఎక్కడెక్కడ ఉన్నారో తెలిసింది కదా ! వాళ్ళతో సంపర్కం వల్ల లాభమే కలిగింది. ఆ కుర్రవాడు మా సర్వే ఉపయోగించుకుని అదేమో పి. హెచ్. డి. అంట దాన్ని చేశాడు. ఈ సర్వే నెపంగా మేమంతా ఒక్క చోట కలవటం జరిగింది. మా కులం మీద పి. హెచ్. డి. చేసిన ఆ కుర్రవాడు ఇప్పుడు కాలేజి లెక్చరర్ అయ్యాడు. ఈ సర్వే పనిలో రాయచూరుకు చెందిన మా జాతికే చెందిన రావోళ్ల సీన అనే వ్యక్తి కూడా పాల్గొన్నాడు.

**రాష్ట్ర సంఘం :**

సర్వే జరిపిన తరువాత రాష్ట్ర సంఘం ఏర్పడితే మంచిదనే 'పురుగు' నా తలలో వదిలారు. చదువు, రాత ఒక్కటీ తెలియని మనుషులం మేము. మాలో చదువుకున్నవారు దొరకరు. సంఘాన్ని ఎలా స్థాపించాలి అనే సమస్య వేధించసాగింది. మీ జాతివాళ్ళకు ప్రభుత్వం నుంచి సౌలభ్యాలు కావాలంటే ఒక సంఘం అవసరం అని శికారి రాము, మేత్రి మొదలైన వాళ్ళంతా నన్ను ప్రోత్సహించారు. వారి మాట జవదాటలేక సంఘాన్ని ఏర్పాటు చేద్దామని మా జాతి వాళ్ళతో సంప్రదించాను.

అదే విధంగా కర్ణాటక రాష్ట్ర సిందోళ్ళ సమాజ సంఘం ఏర్పాటు చేశాం. దానికి అధ్య క్షుడిగా సమాజం వాళ్ళు నన్ను ఎన్నుకున్నారు. మాలోనే ఒకరు కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, కోశాధికారి మొదలైన సభ్యులను మాధవరావ్ మరియు బుడ్గజంగమల శ్రీనివాసరావు సముఖంలో ఎన్నుకోవటం జరిగింది.

చివరికి బిచ్చం అడుక్కుని తినే మా లాంటివాళ్ళం ఒక సంఘాన్ని ఏర్పాటు చేసు కున్నాం.

సంఘం వల్ల మా వాళ్ళకు లాభం కలి గిందనే గ్రహించాను. ఒకప్పుడు అనేక చోట్ల మా వాళ్ళకు కులసర్టిఫికెట్లు ఇచ్చేవాళ్ళు కాదు. సంఘం ద్వారా కులసర్టిఫికెట్లు దొరికేలా చేశాం. ఇంకా ఎన్నో చోట్లా మా వాళ్ళకు కుల సర్టిఫికెట్లను తీసుకోవాలనే జ్ఞానమే లేదు. అలాంటివాళ్ళకంతా కులసర్టిఫికెట్లు తీసుకో వాలని చెప్పాం. దీనివల్ల బడికి వెళ్ళలేని మా పిల్లలు కొందరైనా బడికి ముఖం చూడగలిగారు. మాలో బడికి వెళ్ళే పిల్లల సంఖ్య నూటికి



పదిశాతం మాత్రమే. ఇంకా తొంభై శాతం పిల్లలు బడికి వెళ్ళాలి. ఆ కాలం ఎప్పుడు కలసి వస్తుందోనని ఎదురు చూస్తున్నాను.

**సంచారుల పొత్తం వచ్చింది :**

సుమారు 2007లో కావచ్చు. ఒక రోజు మైత్రిగారు హంపికి పిలిపించారు.

'మీ జాతికి సంబంధించిన పుస్తకం ఒకటి చేద్దాం' అన్నారు.

'అలాగే సార్' అన్నాను.

సంచార జాతుల గురించి 22 పుస్తకాలను ప్రభుత్వమే ప్రింట్ చేస్తుందని అన్నారు.

మా కులానికి సంబంధించిన పుస్తకాన్ని కొత్తగా రాయలేదు. దొడ్మనె లోకరాజ రాసిన పి. హెచ్.డి. పుస్తకాన్ని కొంచెం మార్చి ప్రకటించారు. అందులో చాలా తప్పులున్నాయని దాన్ని దిద్ది, కొద్దో గొప్పో కొత్త విషయాలు చేర్చి పుస్తకం ప్రకటించారు. ఈ పుస్తకాన్ని కన్నడ పుస్తక ప్రాధికార వాళ్ళు ప్రకటించారని తరువాత తెలిసింది. పుస్తకం ప్రకటింపబడిన తరువాత మా జాతి పేరు చాలామందికి తెలిసింది. ఈ పుస్తకం విడుదల బెంగళూరులో ఏర్పాటు చేశారు. అప్పుడు బెంగళూరుకు వెళ్ళాను. ఇదే పుస్తకాన్ని దొడ్మనె లోకరాజు ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సహాయంతో రెండవసారి ప్రకటించాడు. పుస్తకం విడుదల కార్యక్రమాన్ని మోణ కాల్మురులో పెట్టుకున్నారు. నేను అక్కడికి కూడా వెళ్ళి వచ్చాను.

**కమ్ముకున్న మాయదారి రోగం :**

ఒక రోజు నా భార్య కడుపు నొప్పి అని మంచం పట్టింది. నాకు ఏం చేయాలో తోచలేదు. మా వాళ్ళు తయారుచేసే నాటుమందులు వాడాం. అయినా కడుపు నొప్పి తగ్గనేలేదు. చివరికి నేను ఎప్పుడూ చూపించుకునే మసీదు పక్కన ఉన్న నూర్‌ఖాదర్ అనే డాక్టర్ దగ్గరికి పిల్చుకునిపోయాను. ఆయన ఏవేవో గోలీలు, మందులు ఇచ్చారు. అవి వేసుకున్నట్టల్లా ఆమెకు కడుపులో నొప్పి పెరుగుతూపోయింది. మళ్ళీ డాక్టర్ దగ్గరికి పిల్చుకునిపోయాను.

"నీ భార్యను గంగావతికి పిల్చుకునిపో" అన్నారు.

గంగావతిలో చినవాల అనే డాక్టర్‌కి ఉత్తరం ఇచ్చారు.

చినవాల డాక్టర్ భార్య కూడా డాక్టరే. ఆమె నా భార్యను చూసి స్కాను, ఎండోస్కోపు అలాంటివేవో చేయాలని చెప్పింది.

'అలాగే చెయ్యండమ్మా' అన్నాం.

ఆ డాక్టర్ అంతా చెక్ చేసి "నీ భార్య గర్భకోశం మీద చిన్న గుల్ల అయింది. ఆపరేషన్ చేయాలి" అంది.

"అలాగే డబ్బు జమాచేసుకుని వస్తాం" అని చెప్పి తిరిగొచ్చాం.

నా భార్య తాళి, చిన్నచిన్న బంగారు వస్తువులు అమ్మాం. ఇతరుల దగ్గర అప్పు చేసి ఆస్ప త్రికి పిల్చుకునిపోయాను. ఆపరేషన్ చేశారు. అది జరిగిన రెండు మూడు రోజులు గడిచిన తరువాత "నీ భార్యను కిద్వాయి ఆస్పత్రికి పిల్చుకునిపో" అన్నారు.

అదెక్కడ ఉందో తెలియదన్నాను.

"బెంగళూరులో ఉంది అక్కడికి వెళ్ళాలి" అన్నారు.

భార్యను పిల్చుకుని ఇంటికి తిరిగి వచ్చాను. నా వెంట నా కూతురు కవిత ఒక్కతే ఉంది. అదీ చిన్న బిడ్డే. ఏం చేయాలో తోచలేదు. ఊరికి తిరిగి వచ్చిన తరువాత మా మామ అంటే నా భార్య తండ్రిని పిలిపించాను. మా మేనమామ కూడా వచ్చాడు. వాళ్ళు విషయమంతా విని బెంగళూరు వెళదాం పదా అన్నారు.

నేను, నా భార్య, మామ, కూతురు కవిత, మేనమామ, కమ్మజాతి లక్ష్మి అనే ఆమె, అప్పు ఇచ్చిన ఫ్రాన్సిస్ ఇంతమంది రైల్లో బెంగళూరుకు వెళ్ళాం. ఆస్పత్రి దారి విచారిస్తూ ఆస్పత్రి చేరుకున్నాం. గంగావతి డాక్టర్ రాసిచ్చిన చీటి చూపించాం. మాకు ఆ బెంగళూరు అనే అరణ్యంలో ఉండటానికి తగిన స్థలం కనిపించలేదు. ఎక్కడ చూసినా జనమే ! నరకం అంటే ఇదేనని అనిపించింది. అప్పుచేసి అయిదువేల రూపాయలు తెచ్చాను. రోజూ ఆ టెస్ట్ ఈ టెస్ట్ అని నెల రోజులు కాలం గడిపారు. తెచ్చిన డబ్బంతా కరిగిపోయింది. భోజనానికి కూడా కష్టమైంది. ఏమి తినిపించినా నా కూతురు కడుపు నిండలేదంటుంది. ఏం చేయాలో తోచక నిస్సహాయంగా చేతులు నెత్తిమీద పెట్టుకుని కూర్చున్నాను.

సంచారుల సంఘం విషయంగా అప్పటికే బాలగురుమూర్తి సార్ పరిచయం అయ్యారు.

ఆయన అప్పుడప్పుడు ఆస్పత్రికి వచ్చి పలకరించేవారు.

చివరికి ఒక రోజు, "సార్, నా దగ్గర ఒక్క పైసాకూడా మిగలకుండా ఖర్చయిపోయింది" అని చెప్పాను.

మహానుభావుడు ! రెండువేల రూపాయలు ఇచ్చాడు.

చల్లటి పొద్దున ఆయన్ను తలుచుకోవాలి.

రెండువేలు దొరుకగానే, నా భార్య "యా ఆస్పత్రి వద్దు, యేమీ వొద్దు. ఊరికి పోదాం" అని పోరు పెట్టుకుంది.

డాక్టర్ చెప్పినట్టు వినాలని ఎంత చెప్పినా నా భార్య, "నన్ని దిక్కులేని పీనుగుని సేస్తావా? సస్తే మన ఊళ్ళో సస్తాను. ఈ నరకంలో సంపొద్దు" అని పట్టుబట్టింది.

ఆమె మొండితనం ఎక్కువైన తరువాత మామ కూడా ఊరికి పోదామన్నాడు.

మరోదారి కనిపించక ఊరికి బయలు దేరటానికి సిద్ధమయ్యాను. నా నిర్ణయం వినగానే నా భార్యకు చాలా సంతోషం కలిగింది. అప్పటి దాకా భోజనం వద్దంటున్న ఆమె ఆ రోజు సంతోషంగా భోజనం చేసింది. అదిచూసి మాకూ సంతోషం కలిగింది. ఊరికి వచ్చిన తరువాత డాక్టర్ పేరే నా భార్య ఎత్తలేదు. అప్పుడప్పుడు కడుపునొప్పి వచ్చినా నా ముందు దాచి పెట్టేది.

ఇలా అయిదారు సంవత్సరాల తరువాత ఒక రోజు మళ్ళీ కడుపు నొప్పి అంది. అదే చినవాల డాక్టర్ భార్య దగ్గరికి నా భార్యను పిల్చుకునిపోయాను. నా భార్యను గతంలో ఆమెకు చూపించటం, బెంగళూరుకు వెళ్ళి మధ్యలోనే తిరిగి వచ్చేయటం అంతా చెప్పాను. డాక్టర్ అంతా విని ఆశ్చర్యపోయింది. 'రోగం వచ్చి అయిదేళ్ళయినా బతికిందంటే నీ భార్యకు ఏమీ కాదుపో' అంది.

ఆ రోజు నుంచి ఈ రోజూ వరకూ నా భార్య గట్టిగానే ఉంది. అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తుంది. ఆ సమయంలో డాక్టర్ దగ్గర చూపించుకుని మందులు వాడి తగ్గించు కుంటాం. ఆ తల్లి వీరనాగమ్మ నా ఇంటి వెలుగును కాపాడిందని అనుకుంటున్నాను. బెంగళూరుకు వెళ్ళడానికి చేసిన అప్పును నెమ్మదిగా తీర్చాను. అయితే మళ్ళీ నా భార్యను ఆ మాయదారి రోగం ఎక్కడ పీడిస్తుందోననే భయం మాత్రం నా నుంచి దూరం కాలేదు.

**పిల్లలు లేని దుఃఖం :**

మా పెళ్ళయి 10-15 సంవత్సరాలు దాటినా మాకు సంతాన ఫలం కలగనే లేదు. నా భార్య అదే చింతతో రోజురోజుకూ కృశిస్తూ పోయింది. సంతానం కోసం మేము మొక్కని దేవుడు లేడు. కనిపించిన దేవుళ్ళందరిని వేడుకున్నాం. ముడుపులు కట్టాం. అయినా పిల్లలు కలగలేదు. ఆ బాధలో మేముండగా మాకు దగ్గరివారే నన్ను చూసి నా వెనుక నవ్వేవాళ్ళు. వాడేమైనా మగవాడా? అని నన్ను విమర్శించేవాళ్ళు. నాకు నా మగతనం గురించి మాట్లాడినపుడు చాలా కోపం వచ్చేది. అయితే కోపాన్ని బయటికి చూపించడానికి సాధ్యమయ్యేది కాదు..

అదే సమయంలో మా తమ్ముడికి ఒక ఆడపిల్ల పుట్టింది. నా భార్య ఆ బిడ్డను మనమే పెంచుకుందామని అంది. తమ్ముడు, తమ్ముడి



భార్య దగ్గర ఆ సంగతి ఎత్తాం. అతడికీ చాలా మంది పిల్లలున్నారు. మేము అడగ్గానే సరేనని ఒప్పుకున్నాడు. ఆ బిడ్డను తెచ్చి పెంచుకున్నాం. నా భార్య ఎంతో ముద్దుగా బిడ్డను సాకింది. మేము సంచారులం. బిడ్డను మాకు ఇచ్చి తమ్ముడు, తమ్ముని భార్య ఊళ్ళ మీద బిచ్చాటనకు వెళ్ళిపోయారు. అందువల్ల నా కూతురుకు తల్లిపాలు దొరికింది తక్కువే. ఆమెను పెంచుకుంటూ పెద్దదాన్ని చేసి బడికి పంపుతూ ఉన్నాను. అయితే నా వెనుక, నా చాటున నన్ను మగవాడు కాదన్నట్టు మాట్లాడుకునే వాళ్ళకు నేనేమిటో చూపించాలనే మొండితనం నాలో రోజురోజుకూ పెరుగుతూపోయింది. అందువల్ల నేను రెండవ పెండ్లి చేసుకోవాల్సి వచ్చింది. ఆ పెండ్లి కథ తరువాత చెబుతాను.

**రెండవ పెళ్ళి – కారు:**

(ఈ సంభాషణ రచయిత కుమార్ మరియు రావోళ్ల నాగప్పగార్ల మధ్య జరిగింది)

రచయిత: అన్నా, కారు కొనడం మన రాతలో లేదు చూడన్నా, నేనూ, నీవూ కారు తీసుకోవటం ఈ జన్మలో ఎన్నడైనా సాధ్యమా?

నాగప్ప: అలా అంటారేం సార్ ! కారు అంత దుబారానా? ఇప్పుడు ఒక లక్షకు కూడా కారు దొరుకుతుంది. ఈ నాటి కాలానికి అదేమైనా ఎక్కువనా?

రచయిత: మనలాంటివారికి ఒక లక్ష పెద్దదన్నా. మనకు అంత డబ్బు ఎక్కడి నుంచి వస్తుందన్నా? మనం కారు కొనుక్కున్నా దానికి పెట్రోలు, డీజిల్ పోయించడం సాధ్యమా?

నాగప్ప: అది నిజమే అనుకోండి. అయితే మనిషి మనస్సు కన్నా ఏదీ గొప్పది కాదు. నేను రెండవ పెండ్లి చేసుకున్న కథ మీకు తెలుసు కదా !

రచయిత: నువ్వు రెండవ పెళ్ళి చేసుకున్నది తెలుసు. అయితే దాని వెనుకటి కథ తెలియదన్నా”

నాగప్ప: సర్. ఆ కథను చెబుతాను, వినండి.

నా మొదటి భార్య తెక్కలకోటకు చెందింది. ఆమెను పెండ్లి చేసుకున్నప్పుడు నాకు పదిహేడు- పద్దెనిమిదేళ్ళు ఉండొచ్చు. పెండ్లయి ఇరవై ఏళ్ళు గడిచాయి. ఒక్క బిడ్డ పుట్టలేదు. ఎందుకిలా అని డాక్టర్ దగ్గరికి వెళ్ళి చూపించాం. గర్భసంచిలో సమస్య ఉంది. పైగా ఈమెకు ఎర్రబట్ట అవుతోంది. అందువల్ల పిల్లలు కలగరని డాక్టర్ చెప్పారు. దాంతో పిల్లల మీద ఆశలు వదులుకున్నాం. అయితే నాకొక వంశాకురం కావాలని నా మనసు తపిస్తోంది. దీనికొక్కటే దారి. రెండవ పెళ్ళి చేసుకోవడం. అయితే ఇందులో ఒక సమస్య ఉంది. పరాయి పిల్లను పెళ్ళి చేసుకుంటే సవతుల మధ్య పొందిక ఉండదు. నాకు మొదటి భార్య మీద ప్రేమ ఉంది. దీనికి ఉన్న ఒక్క పరిష్కారం ఏమిటంటే నా భార్య చెల్లెలినే పెళ్ళి చేసుకోవటం. అయితే ఇందులోనూ ఒక సమస్య ఉంది. ఆ అమ్మాయి చిన్నగా ఉన్నప్పుడే మరొకరితో ఆమె పెళ్ళి నిశ్చయమైంది. మా సముదాయంలో ఒకసారి మాట ఇచ్చిన తరువాత అమ్మాయిని మాట ఇచ్చిన వాళ్ళకే ఇవ్వాలి. మాట తప్పితే ఆడపిల్ల వైపు వాళ్ళకు కులపెద్దల పంచాయితీ తప్పు దండన విధిస్తుంది. పైగా 'మాట తప్పినవాళ్ళు' అనే నిందకు గురికావాలి. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలి అనే చింత వేధించసాగింది.

ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడానికి మాటలు జరిగింది మా చిన్నాన్న కొడుకుకే ! మొదట అతడినే అడిగి ఒప్పిద్దాం అని అతడిని బ్రాందీ షాపుకు పిల్చుకునిపోయాను. ఇద్దరం తాగుతూ ఉండగా నేను అతడికి నిశ్చయమైన పిల్లను చేసుకోవాలని నేను మనసు పడటం, దాని వెనుక వున్న కారణాలు మొదలైనవన్నీ వివరంగా చెప్పాను. ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోబోతున్నవాడు పెండ్లి కాని కుర్రవాడు కాదు. అతను అప్పటికే పెండ్లయి ముగ్గురు పిల్లలున్న తండ్రి. అందువల్ల అతను తనకు నిశ్చయమైన పిల్లను వదులుకోవడానికి ఏమీ సమస్య లేదు.

నా అభ్యర్థనను అర్థం చేసుకున్న అతను కూడా "కోడల్ని నువ్వే చేసుకో" అని అన్నాడు.

పెండ్లి చేసుకోవాలసిన వ్యక్తే ఒప్పుకు న్నాడని సంతోషపడుతూ అతని తండ్రి అంటే మా చిన్నాన్న దగ్గరికి వెళ్ళాను. మాకు పిల్లలు కాకపోవడం మొదలైన కారణాలు వివరించి చిన్నాన్న, చిన్నమ్మల కాళ్ళమీద పడి ఆ అమ్మాయిని వదులుకొమ్మని వేడుకున్నాను. అయితే మాట జరిగిన తరువాత అంతా అయిపోయిందని, నేనేమి ఏమీ చేసినా, ఆ అమ్మాయిని తన కొడుకుకే చేసుకుంటానని ముసలివాడు పట్టుబట్టాడు. నేను ఎంత బతి మిలాడినా వినలేదు.

చివరికి ఆ అమ్మాయి తల్లితండ్రుల దగ్గ రికి వెళ్ళి బతిమిలాడుదామని నేరుగా తెక్కల కోటకు వెళ్ళాను. అత్త, మామ, కోడలు, అల్లుళ్ళు అందరూ ఊరిమీదికి బిచ్చాటనకు వెళ్ళారు. వాళ్ళు వచ్చేవరకు ఎదురుచూశాను. వాళ్ళంతా సాయంకాలం ఇంటికి వచ్చారు. మా ఇళ్ళంటే పాత బొంతలతో చేసిన మాసిన గుడారం అన్నది మరచిపోకండి.

ఇంటికి వచ్చిన మామ నన్ను చూసి, "ఏమయ్యా ఏంటికి వచ్చిండావు?" అని అడిగాడు.

"ఏం లేదు మామా, నీ పెద్దబిడ్డకు రోగం. డాక్టర్ ఇంక పిల్లలు పుట్టరన్నారు. దానికే వేరే పెళ్ళి చూసుకోవాలని అనుకున్నాను" అని చెప్పాను.

"నీ పెద్ద పెండ్లాంకు ఈ మాట గుర్తా?" అని అడిగాడు.

'లేదు, మిమ్మల్ని అడిగినంక ఆమెకు చెప్పాలని...' అన్నాను.

'పిల్ల ఎవరు?' అని అడిగారు.

"నీ చిన్నబిడ్డ ఉంది కదా? ఆ యమ్మనే పెళ్ళి చేసుకుందామని అనుకుంటున్నాను. ఆమెను పెళ్ళి చేసుకుంటే అక్కా చెల్లెలు పొందిగ్గా ఉంటారు. వేరే పిల్ల అయితే పొందదు" అన్నాను.

ఈ మాట వింటుండగా మామ కోపంతో మండిపడుతూ లేచి నిలబడ్డాడు.

"నా బిడ్డని తొట్లో ఉండంగానే మీ చిన్నాన్న కొడుక్కిచ్చి పెళ్ళి చేసిస్తానని మాట ఇచ్చిండాను. ఇప్పుడు నీకు కూతుర్ను ఇస్తే మాట తప్పినట్టవుతది. నీకు నా బిడ్డని ఇవ్వడం కుదరదు" అని పుల్ల విరిచినట్టు అన్నాడు.

మామ మాటను అత్త, అల్లుళ్ళు సమ ర్థించారు. కాళ్ళు పట్టుకుని వేడుకున్నా ఉప యోగం లేకపోయింది.

ఊరికి తిరిగొచ్చాను.

నేను వచ్చిన మరుసటి రోజునే నా అల్లుడు ఒకడు భిక్షాటనకు మా ఊరికి వచ్చి తన అక్కకు నిన్నటి రోజున జరిగిన సంఘట నంతా చెప్పేశాడు.

నా భార్య చాలా తెలివైనది. "మీ మామ ఎట్లాగైనా ఆ పిల్లను లేవదీస్కునిపోతాడు. బద్రంగా ఉండండి" అని తమ్ముడికి జాగ్రత్తలు చెప్పి పంపింది. నాకు ఆ విషయమే తెలియదు.

ఇది జరిగిన రెండు రోజులకు తిరిగి తెక్కలకోటకు వెళ్ళాను. మామ, అత్త, అల్లుళ్ళు అందరూ ఉన్నారు. నేను వాళ్ళింటికి వెళ్ళినా లోపలికి రమ్మని పిలవలేదు. ఒక్కరూ పలకరించలేదు. ఏదో తేడా వచ్చిందనుకున్నాను. నేను వెళ్ళి వారి గుడారం ముందు కూర్చున్నాను. నువ్వు ఇక మీదట మా ఇంటికి రావద్దు. బయటికి ఇవ్వాల్సిన, ఇంటికి తెచ్చుకోవాల్సిన ఆడపిల్లలు ఉన్నారని మామ అన్నాడు. నాకు చాలా అవమానంగా అనిపించింది. మీ అంతట మీరే అమ్మాయిని ఇస్తే పెళ్ళి చేసుకుంటానని, లేకపోతే లేదని అన్నాను. ఇక తిరిగి ఊరికి వెళ్ళాలని సిద్ధమై ఊరివైపు బయలుదేరాను. సంతమార్కెట్‌లో అమ్మాయి కనిపించింది.

"నువ్వు ఒక్కదానివి ఒప్పుకో. నిన్ను పిల్చుకునిపోయి పెళ్ళి చేసుకునే బాధ్యత నాది" అని చెప్పాను.

అమ్మాయి ఒక్క మాట మాట్లాడలేదు. ఊరికే ఏడవసాగింది.

"ఎందుకమ్మా ఏడుస్తావు? ఏమిటో సరిగ్గా చెప్పు" అన్నాను.

"మావా, మా అబ్బ, అమ్మ వాళ్ళు యవరికిస్తే వాళ్ళనే పెండ్లి సేసుకుంటాను. ఊరికే పగలంతా వచ్చి మమ్మల్ని యాతన పెట్టద్దు" అని అమ్మాయి చెప్పింది.

మరోదారి కనిపించక ఊరికి మరలాను.

పడుకున్నా నిద్ర పట్టలేదు.

పెళ్ళికి వాళ్ళను ఎలా ఒప్పించాలా అనే చింత పట్టుకుంది.

ఇలా నాలుగు రోజులు గడిచాయి.

మళ్ళీ తెక్కలకోటకు వెళ్ళాను.

గుడారం దగ్గరికి వెళితే ఆ అమ్మాయి ఒక్కతే ఉంది.

మీనాన్న, అన్నలు ఎక్కడ అని అడిగితే బిచ్చాటనకు వెళ్ళారని చెప్పింది.

"మాట్లాడాలి" అంటే "సంత మార్కెటు దగ్గర ఉంటాను రా" అంది.

సంత మార్కెటుకు వెళ్ళాను. ఆ అమ్మాయి వచ్చింది.

"నాతో పెండ్లికి ఒప్పుకో. పదా, బండెక్కు. వెళ్ళిపోదాం" అన్నాను.

"వద్దు మావా, మా అబ్బ, అన్నలు నన్ను కొడతారు. వాళ్ళు ఇచ్చిన చోట పెళ్ళి సేసు కుంటాను. నీ మాట విని నీ ఎంబడి వస్తే న్యాయగాళ్ళు మా అబ్బకు తప్పు దండన ఏస్తారు. తప్పుదండన ఏస్తే మా అబ్బ యాద్నుంచి కడ్తాడు. మా దగ్గర అన్ని దుడ్లు లేవు. ఊరకే నన్ను వదిలెయ్ మావా" అంది ఆ పిల్ల.

"మీ అబ్బకు వేసే తప్పుదండన నేను కట్టుకుంటాను" అని చెప్పినా ఆ పిల్ల వినలేదు.

మరోదారి లేక నేను ఊరికి వచ్చేశాను.

ఏం చేయాలో తోచలేదు.

ఇటు చూస్తే నా భార్య గుర్రుమంటోంది.

ఇది ఎలాగో మా ఊళ్ళో తెలిసి పోయింది.

మా చిన్నాన్నలు లోలోపల పెళ్ళికి సిద్ధం చేసుకోసాగారు.

నాకు తెలిస్తే పిల్లను ఎక్కడ ఎత్తుకుని పోతానో అనే భయం వాళ్ళది.

నేను చిన్నాన్నకు చెప్పాను – "ఆ అమ్మాయి నీ కోడలు కావటం గ్యారెంటీనే. అయితే ఆమె ఎప్పటికైనా నా భార్యనే. ఆ

విషయంలో అనుమానం వద్దు" అన్నాను.

ఈ మాట వాళ్ళ తలలో ఉంది. నా భార్య కూడా వాళ్ళకే సపోర్ట్ చేసే మనిషి. నాకు మరో దారి కనిపించక మౌనంగా ఉండిపోయాను.

పెండ్లి ఎక్కడ అన్నది నాకు తెలియలేదు. నన్నొక్కడిని వదిలేసి మా ఊరి పెద్దలంతా పెండ్లికి వెళ్ళారు.

ఏం చేయాలప్పా అని మౌనంగా బండి తీసుకుని దేవులాపుర మారెమ్మ గుడికి పోయాను. అమ్మ గుమ్మంలో కూర్చున్నాను. "అమ్మ, నన్ను ఎందుకు పరీక్ష చేస్తున్నావు? నాకు ఆ అమ్మాయి కావాలి. నాకు ఆమె కడుపున ఒక మొలక నువ్వు ఇవ్వాలి" అని ప్రార్థించాను.

సంతృప్తి కలగలేదు.

ఒక క్వార్టర్ విస్కీ తాగాను.

ఇంటికి వచ్చాను. ఇంట్లో కానీ, వీధిలో కానీ నన్ను ఒక్కరూ పలకరించ లేదు.

సాయంకాలానికంతా పెళ్ళికి పోయిన వాళ్ళంతా తిరిగి వచ్చారు.

మరుసటి రోజు పెళ్ళికొడుకు, కూతురు వచ్చారు.

పెళ్ళి కొడుకు ఇల్లు నా ఇంటి ఎదుట ఉంది. అమ్మాయిని చూశాను. మాట్లాడటానికి కుదరలేదు.

అమ్మాయిని ఇంటికి తెచ్చుకున్న మరుసటి రోజున అక్కను పలకరించడానికి ఆ పిల్ల మా ఇంటికి వచ్చింది. ఆమె అక్క "ఈడికి వొచ్చినట్టు మా ఇంటికి రావద్దు. వొస్తే మీ ఇంటోళ్ళు తప్పుగా అర్థం సేసుకుంటారు" అని చెల్లెలికి బుద్ధి చెప్పి భర్త ఇంటికి వెళ్ళమని చెప్పింది. నేను బయట అరుగుమీద కూర్చున్నాను.

ఒకసారి అమ్మాయి నా వైపు చూసి, "మావా, నొచ్చుకుండావా?" అని అడిగింది. మళ్ళీ "కోప్మా?" అంది.

నేను ఏమీ మాట్లాడలేదు.

మరుసటి రోజు కుందేలు వేటకు వెళ్ళాను.

అమ్మాయి ఆడపిల్లలతో కలిసి మాట్లాడుతూ కూర్చుంది.

నేను చూసి చూడనట్టు ఇంటికి వచ్చాను.

ఇది జరిగిన మూడవ రోజున బిచ్చాటనకు వెళ్ళడానికి సిద్ధమై మా ఇంటి ముందు నుంచి బయలుదేరింది.

మా ఇంట్లో నా భార్య ఉండలేదు.

"మాట్లాడాలి రా" అని నన్ను పిలిచింది.

"ఏం మాట్లాడాలి? అంతా ముగిసి పోయింది కదా?" అన్నాను.

"లేదు మావా, నేను నీ యనక వస్తాను. నన్ని పెళ్ళి చేసికో. నా మొగాడికి పెండ్లయింది. పిల్లలు ఐయ్యినారు. అతనికి పెండ్లయిన మాట నాకు గొత్తులేదు. తప్పు సేస్తిని. వొస్తాను మావా, తిట్టకూ" అంది.

నాకూ అదే కావాలి.

"ఇలాగే దార్లో పోతూండు. బండి తెస్తాను" అని చెప్పాను.

బండి తీసుకునిపోయాను.

అమ్మాయి బండి వెనుక ఎక్కింది.

నేరుగా దేవులాపుర మారెమ్మ గుడికి వెళ్ళాం.

దేవుడికి ఇద్దరం నమస్కారం చేసుకున్నాం.

అక్కడి నుంచి నేరుగా సల్లాపురం మీదుగా హంపికి వెళ్ళాం.

హంపిలో ఒక లాడ్జిలో రూము తీసుకుని అందులో దిగాం.

ఇటు నేను లేను. అటు బిచ్చానికి పోయిన పిల్ల ఇంటికి రాలేదు. మొత్తం వీధిలో అందరికి అనుమానం. పారిపోయారనే వదంతులు మొదలయ్యాయి. మా ఇంటి కాయిన్ బాక్స్ నుంచి నా మొబైల్‌కి ఫోన్ రావటం మొదలైంది.

నా భార్య,"ఏయ్, యాడికి పోయిండావ్? ఊరికి వొస్తావా?లేదా?" అని తగులుకుంది.

ఇటువైపు నా కోడలు 'ఊరికి వెళ్ళిపోదాం లేకపోతే అక్కను వాళ్ళంతా కలిసి కొడతారు' అని ఏడుపు మొదలుపెట్టింది.

అయిందికానీ అని మరుసటి రోజు ఊరికి వచ్చేశాం. రాగానే నేరుగా పోలీస్ స్టేషన్‌కు పిలుచుకునిపోయాను. స్టేషన్‌లో పోలీసులు సుడుగాడు సిద్దుల సణ్ణహులుగప్పకు మా బాధ్యత అప్పగించాడు. ఆ రోజు హులుగప్ప తమ వీధిలో మమ్మల్ని ఉంచుకున్నాడు. మరుసటి రోజు స్టేషన్‌కు పోయాం. మా చిన్నాన్న వాళ్ళు తప్పుదండన కట్టమని అన్నారు. సరే అని ఒప్పుకున్నాను.

కులపెద్దలంతా పంచాయితీ చేరారు. పంచాయితీకి నన్ను పిలిపించారు.

"ఏమిటి? ఎందుకు ఇలా చేశావు?" అని కులపెద్దలు అడిగారు.

"నాకు ఆ పిల్ల కావాలని ముందుగ అడిగిన. వాళ్ళింటివాళ్ళూ వినలేదు. మా చిన్నబ్బ వినలేదు. వేరేదారి లేకున్నదానికి ఇట్లా చేయాల్సి వచ్చింది. మీరు నాకు దండన విధిస్తారా, ఏమన్న శిక్ష విధిస్తారా, నేను దానికి సిద్ధంగా ఉన్నాను" అని చెప్పాను.

"తొంభై వేలు ఇవ్వాలి" అన్నారు.

"వాళ్ళకు తొంభై వేలిస్తావా?" అని ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"అలాగే" అన్నాను. ఇంటికి పంపారు.

ఇంటికి వచ్చిన తరువాత కులపెద్దలు మా వీధిలో మళ్ళీ కులపంచాయితీ జరిపారు.

పోలీస్ స్టేషన్‌లో తొంభైవేలు ఇవ్వాలన్న వాళ్ళు, ఇక్కడ "అది సరిపోదు, లక్ష రూపాయలు ఇవ్వాలి" అన్నారు.

"అలాగే ఇస్తాను" అన్నాను.

అక్కడ పంచాయితిలో చేరిన మరొకరు, "లేదు లక్షన్నర ఇవ్వాలి" అన్నారు.

"అలాగే" అన్నాను.

మరొకరు "దైవానికి ఇరవై అయిదు వేలు ఇవ్వాలి, అంటే లక్ష డెబ్బయి అయిదువేలు ఇవ్వాలి" అన్నారు.

"అలాగే ఒకవారం టైం ఇవ్వండి" అన్నాను.

చివరికి ఒక లక్షాయాభైవేలు పెళ్ళి ఖర్చులు, కులదైవానికి పదిహేను వేలు దండన, పైన పంచాయితీ ఖర్చు ముప్పయి అయిదువేలు. మొత్తం రెండు లక్షల రూపాయలు చెల్లించాను. దీనికి ఒక సంవత్సరానికి ఒక లక్ష వడ్డీ కట్టాల్సి వచ్చింది. ఈ అప్పు తీర్చడానికి భార్యలతో కలిసి కూలీనాలీ, రకరకాల పనులు చేసి చివరికి అప్పు తీర్చాం. ఆ సమయంలో నాకు అండగా నిలబడ్డ వ్యక్తి అంటే అది సుడుగాడు సిద్దుల సణ్ణహులుగప్ప. అతడిని మరవలేను. ఎందుకంటే ఒక నెలరోజులూ తమ వీధిలో పెట్టుకుని నన్ను, నా కుటుంబాన్ని సాకిన మహానుభావుడతడు !

ఇదంతా మీరు కారు విషయం అడిగినందుకు చెప్పాల్సి వచ్చింది !

**తరువాయి వచ్చే సంచికలో...**

# తెలుగు తల్లి

డా॥ వాసా ప్రభావతి
9849178196

ఆ రోజు ప్రారంభోత్సవం.... విశేషం ఏమిటంటే అది తెలుగు మాధ్యమంలో ప్రారంభోత్సవం జరుపుతున్న పాఠశాల కావటం!

"అదేమిటి సూర్యారావూ! తెలుగు మాధ్యమంలో పాఠశాల ప్రారంభించి బతికి బట్ట కట్టగలవా? చుట్టూ అన్నీ ఇంగ్లీషు మీడియం బడులు. కాన్వెంటు బడులు. ఈ రోజుల్లో మోజు అటే ఉంది?" అన్నాడు తెలుగు పాఠశాలను ప్రారంభించడానికి వచ్చిన ముఖ్య అతిథి విజయ సారధి. ఆ ప్రాంతానికి ఎమ్.ఎల్.ఏ. అతను. అభిమానంతో అన్నా, మనస్ఫూర్తిగా మాత్రం పాఠశాల పేరుతో తెలుగు మాధ్యమంలో పాఠశాల ప్రారంభించినందుకు చాలా అభినదించాడు.

"ఈనాడు ఈ తెలుగు పాఠశాలలు చాలా అవసరం. ముందుతరం తెలుగు నేర్చుకోవలసిన అవసరం చాలాఉంది. దీనిని తెలుగు వారు ఆదరించాలి, గౌరవించాలి, అందుకు నా సహాయం ఎప్పుడూ ఉంటుంది" అన్నాడు.

సూర్యారావు చాలా సంతోషించాడు. పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోంది. బాగా పాఠాలు చెప్పేవారిని తెలుసుకుని వారిని పాఠశాలకు పిలుస్తున్నారు. తక్కువకాలంలోనే 'తెలుగుతల్లి' పాఠశాలకు మంచిపేరు వచ్చింది. చుట్టుపక్కల పాఠశాలల నుండి పిల్లలు ఈ పాఠశాలలో చేరారు. ఈ పాఠశాలలో ఉదయం "మా తెలుగుతల్లి" పాటతో ప్రార్థన చేయిస్తున్నారు. సాయంకాలం డ్రిల్లు, ఆటలు పెట్టారు. పైగా చదువుకునే పిల్లలకు ముఖ్యమైంది క్రమశిక్షణ. ఈ పాఠశాలలో చదువుతోపాటు క్రమశిక్షణ నేర్పడం వల్ల పిల్లలు ఇంటి దగ్గర పాటిస్తున్నారు.

ఆ సంవత్సరం పెద్ద తరగతుల వారిని విజ్ఞానయాత్రకు తీసుకువెళ్ళి విశాఖ పట్టణంలోని స్టీలుప్లాంటును చూపించారు. చిన్న తరగతులవారిని విహారయాత్రకు తీసుకుని ధవళేశ్వరం ఆనకట్టను, కాటన్ దొర గొప్పతనాన్ని చూపించి చెప్పారు. ఆ పాఠశాలలోని పిల్లలు



సూర్యారావుగారు మాట్లాడుతూ 'తెలుగుతల్లి' బడులు ఎక్కడ ఉన్నా నేను చూసి వస్తానన్నాడు. వెంటనే కమిటీ వారంతా మేము కూడా వస్తామని చేతనైన సహాయం ఆ పాఠశాలకు చేస్తామన్నారు. సూర్యారావు వెంటనే క్లాసు ఫస్టు వచ్చిన విద్యార్థులకే కాదు మొదటిరాంకు వచ్చిన విద్యార్థులందరికి బంగారుపతకాలు ఇస్తామని చెప్పాడు. చప్పట్లు మారుమ్రోగాయి.వెంటనే దాతలు ముందుకువచ్చి తరగతిలో మంచి మార్కులు వచ్చిన వారందరికి స్కాలర్‌షిప్పులు ఇచ్చి ఫీజు లేకుండా చదువుకునే అవకాశం కల్పిస్తామన్నారు.

అందరికంటే అతీతంగా చదువుతున్నారు. క్రికెట్టు మొదలైన ఆటలతో పాటు ఆడపిల్లలకు కరాటే నేర్పిస్తున్నారు. వారిని వారు రక్షించుకోడానికి ఉపయోగిస్తుందని ఆచరణలో పెట్టారు.

మాతృభాషలో నేర్చుకుంటే అవగాహన ఎక్కువగా ఉంటుందని చెప్పిన పెద్దల మాటలను ఆచరణలో చూపించారు ఈ పాఠశాలవారు. మొదట 8వ తరగతి వరకే ఉన్న పాఠశాల 10వ తరగతి వరకు పెంచారు. ఆ సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల్లో 1,2,3 ర్యాంకు విద్యార్థులు

ఈ పాఠశాల వారే. 'తెలుగుతల్లి' పాఠశాల గొప్పతనం మారు మోగింది. అది భరించలేని ఒక ఆంగ్ల పాఠశాలవారు ఆ రాత్రి 'తెలుగుతల్లి' పాఠశాల పై దాడి చేసి ఆ రాత్రి పాఠశాలలోని బెంచీలు, కుర్చీలు పాడుచేసారు. తెల్లవారిన తర్వాత, వాటిని చూసి పోలీసులకు తెలియజేశారు. ఆ సాయంకాలానికి ధ్వంసం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అదంతా చేసింది విశాఖలోని ఒక ఆంగ్ల పాఠశాల వారనీ తెలిసింది. ఎంతోమంది దాతలు ముందుకొచ్చి కొత్త బెంచీలు, కుర్చీలు కొనిచ్చారు.

'తెలుగుతల్లి' పాఠశాల కీర్తి అంతటా వ్యాపించింది. విజయనగరం, తుని, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, నెల్లూరు మొదలగుచోట్ల 'తెలుగుతల్లి' పాఠశాలలు వెలిసాయి. మాతృభాషలో వారి బోధనా పద్ధతి అందరికి ఆదర్శనీయంగా నిలిచింది.

ఆరోజు ఇంటర్ పాఠశాలల పోటీలు పెట్టారు. తెలుగుదేశంలో ఎన్నో మాండలిక భాషలున్నాయి. ఎవరి మాండలికంలో వారు మాట్లాడితే మరొకరికి అర్థం కాదు. ముందుతరంలో సంస్కృతభాష ఉండేది. ఇప్పుడు అందరికి అర్థమయ్యే భాష ఉండాలని గిడుగురామ్మూర్తి పంతులుగారు చెప్పినట్లు శిష్ట వ్యావహారిక భాష అందరిభాషగా స్వీకరించాలని ఆ భాషలో చదవడం రాయడం తెలుగుభాష మరింత అభివృద్ధి చెందుతోందని తెలుగు పండితులంతా నొక్కి వక్కాణించారు. అందరూ దానిని అంగీక రించారు.

ఆరోజు 'తెలుగుతల్లి' పాఠశాల వార్షికోత్సవం.

విశాఖపట్టణంలో సముద్రతీరానికి దగ్గరగా వెలసిన ఆ పాఠశాల విశాలమైన భవనంతో, చుట్టూ ఆటస్థలాలతో వెలిగిపోతోంది. పిల్లలందరు తెల్లని దుస్తులతో ఆరోగ్యదీపాల్లా వెలిగిపోతున్నారు. పిల్లలంతా బారులుతీరి నిలబడ్డారు. "మా తెలుగుతల్లికి మల్లెపూదండ" ప్రార్థనాగీతం చుట్టుపక్కల మారుమ్రోగుతోంది. అప్పుడే ఆ పాఠశాల ముందు కారుదిగిన ఆ పాఠశాల పూర్వ విద్యార్థి గోపాల్, అతని స్నేహితులు పాఠశాలలో అడుగుపెట్టారు. తాను చదువుకున్న రోజుల్లో కంటే పాఠశాల ఎంతో అభివృద్ధి చెందినం దుకు మురిసిపోయాడు.

గోపాల్ అతనితో వచ్చిన స్నేహితులు పాఠశాలకి కంప్యూటర్లు కొనిచ్చారు. అన్ని క్లాసులకే కాదు అన్ని సెక్షన్స్‌కి కొన్నారు. 5వ తరగతి నుంచి కంప్యూటర్ పిల్లలకు నేర్పాలనుకున్నారు. కాని 4వ తరగతినుంచే నేర్పించాలని నిర్ణయించారు. పిల్లల తల్లిదండ్రుల సంతోషానికి అంతులేదు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాదు పట్టణాల నుంచి కూడా తల్లితండ్రులు ఈ పాఠశాలలోనే చేర్పిస్తున్నారు. అది తెలుగు మీడియం పాఠశాల అయినా ఎంతో బాగా పిల్లలకు పాఠాలు నేర్పించడమే కాదు క్రమశిక్షణలో మొదటిస్థానంలో అన్నింటిలోను నిలుస్తోంది.

వార్షికోత్సవంలో ఎందరో పెద్దలు పాల్గొన్నారు. 'తెలుగుతల్లి' పాఠశాలను స్థాపించిన సూర్యారావు, వనజ దంపతులకు సత్కారం తల పెట్టారు. సత్కారానికి ఆ దంపతులు అంగీకరించలేదు.

ఆ పాఠశాల అభివృద్ధికి సూర్యారావుతో పాటు వనజ కూడా చాలా కృషి చేసింది. పాఠాలు చెప్పే అధ్యాపకులను జాగ్రత్తగా పరిశీలిం చేది. వారితో సంప్రదింపులు జరుపుతూ సలహాలు ఇస్తుంది. ఆ పాఠశాల దినదినాభివృద్ధి చెందుతుంటే ఒకరోజు దుండగులు ఆ దంపతులపై దాడి చేసి చావగొట్టారు. హాస్పిటల్లో చేర్చి వైద్యం చేసాక ఆ దంపతులు కోలు కున్నారు. తరువాత కమిటీవారి బలవంతంతో వారు కారు కొనుక్కున్నారు. డ్రైవర్‌ని పెట్టించారు. పాఠశాలలో చౌకీదార్లు ఉన్నట్లే ఇంటిదగ్గర కూడా కమిటీ వారే బలవంతంగా పెట్టించారు. పాఠశాలలోని విద్యార్థినులకు ఆమె అండగా నిలబడింది. వారి చదువు విషయంలోనే కాదు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటోంది.

ఆ సంవత్సరం దూరం నుంచి వచ్చే విద్యార్థినీ, విద్యార్థుల కోసం సౌకర్యవంతమైన వసతిగృహాన్ని కూడా స్థాపించారు. అందరి పిల్లలకు అండగా నిలిచారు ఆ దంపతులు. వారే కాదు, అక్కడి అధ్యాపకులు బాగా పాఠాలు చెప్పడమే కాదు, పిల్లల్ని ఎంతో బాగా చూసుకుంటున్నారు.

అందుకే అందరూ కూడా "చదివితే తెలుగు మాధ్యమం పాఠశాలలో చదవాలి. అందరూ రండి తెలుగుతల్లి బడికి" అంటూ ప్రచారం విపరీతంగా సాగుతోంది.

సూర్యారావు, వనజ దంపతులను వేదికపైకి పిలిచి శాలువాలు కప్పి పూలదండలతో ముంచెత్తారు. కరతాళ ధ్వనులతో ముంచెత్తారు.

సూర్యారావుగారు మాట్లాడుతూ 'తెలుగుతల్లి' బదులు ఎక్కడ ఉన్నా నేను చూసి వస్తానన్నాడు. వెంటనే కమిటీ వారంతా మేము కూడా వస్తామని చేతనైన సహాయం ఆ పాఠశాలకు చేస్తామన్నారు. సూర్యారావు వెంటనే క్లాసు ఫస్టు వచ్చిన విద్యార్థులకే కాదు మొదటిరాంకు వచ్చిన విద్యార్థులందరికి బంగారుపతకాలు ఇస్తామని చెప్పాడు. చప్పట్లు మారుమ్రోగాయి. వెంటనే దాతలు ముందుకువచ్చి తరగతిలోనుంచి మార్కులు వచ్చిన వారందరికి స్కాలర్‌షిప్పులు ఇచ్చి ఫీజు లేకుండా చదు వుకునే అవకాశం కల్పిస్తామన్నారు. తెలుగుతల్లి పాఠశాలల్లో పరీక్షా ఫలితాలు మిన్నంటాయి. ఆ పాఠశాలలు ఇంటర్ తరగతులలో జూనియర్ కాలేజీలుగా మారాయి. కొన్ని కాలేజీలలో డిగ్రీ కూడా తెలుగు మాధ్య మంలో ప్రారంభించారు.

'జై తెలుగుతల్లి' తన నోటివెంట గట్టిగా వచ్చిన పిలుపుతో నిద్రనుంచి మేల్కొన్నాడు సూర్యారావు.

'జై తెలుగుతల్లి' అని మనం నినదించాలి అంటే మీలాంటి వాళ్ళంతా త్వరగా మేలుకోవాలి. మన భాషలో సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయనే విషయం పిల్లలకి తెలియజేయాలి. పెద్దలే పిల్లలకి మార్గ దర్శకులు. చూడండి టైమ్ ఎంతయిందో. 7.30 అయ్యింది. మనం చెప్పక పోయినా మన చేతలద్వారా మనం మార్గదర్శకులవుతున్నాము. ఉదాహరణకి మనమే. చూడండి, అబ్బాయి మీ పక్కనే ఉన్నాడు, "లేవరా లే"

బద్ధకంగా కళ్ళు తెరుస్తూ 'ఇంకా నాన్నే లేవలేదుగా" అన్నాడు శశికుమార్.

'ఈ బట్టలు నేను మడతపెట్టా కాని, మీరిద్దరు త్వరగా సిద్ధంకండి'.

ఇది మనమందరము కోరుకున్న కలే కాని కల్లకాకూడదు! అంటే ఇలలో మనం మన మాటలు పువ్వులు అవ్వటానికి ఎంతో కృషి చెయ్యాలి. ఆ పువ్వులే కాయలవుతాయి. ఇదంతా శ్రమతో కూడుకున్న పని. అయినా మనం తెలుగుతల్లి చిరునవ్వు కోసం కృషి చెయ్యాలి. అందుకు వ్యతిరేకించే వారిని ఎదుర్కోవాలి. మన కళ్ళముందే తెలుగుతల్లికి సంకెళ్ళు పడుతుంటే చూస్తూ ఊరుకోకూడదు.

**తెలుగులో పరిపాలించనప్పుడు మనవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి?**

ధారావాహిక



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 14. బౌద్ధుల ఖగోళ పరిశీలనలు

ప్రపంచంలో ఖగోళ పరిజ్ఞానం బౌద్ధులతోనే మొదలు కాలేదు. ఋగ్వేద ఆర్యులతోనే ఆరంభం కాలేదు. భారతీయుల కంటే అద్భుత ఖగోళ పరిజ్ఞానం కల్గిన దేశాలున్నాయి. మెక్సికో మాయన్లు, చైనీయులు, మధ్యధరా సముద్రతీర ఛార్డియన్లు అందరికంటే ముందుంటారు.

ఆ తర్వాత స్థానంలో భారతదేశం ఉంటుంది. క్రీ.పూ 3000 నాటి సింధూ ప్రజలకు ఖగోళ విజ్ఞానం తెలుసు. ఎంత తెలుసో తెలియదు. ఆ తర్వాత రుగ్వేద, యజుర్వేదాల్లో ఖగోళ విషయాలు, ఆకాశంలో నక్షత్రాల స్థానాలూ, రాశులు మొదలైన వాటి వివరాలు ఉన్నాయి.

మనిషి కాలాన్ని కొలవడం మొదలు పెట్టిందే ఖగోళ పరిశీలనతో. కాబట్టి కాలగణన తెలిసి ప్రతివారికీ ఖగోళ పరిజ్ఞానం అంతో ఇంతో ఉన్నట్టే. బుద్ధుని కాలానికి సంవత్సరం, మాసం, తిథులు, పక్షాలు, ఆయనాలు (ఉత్తరాయణం, దక్షిణాయనం) ఋతువులు, నక్షత్ర రాశులు వీటన్నింటి పరిజ్ఞానం ఉంది.

రుగ్వేదంలో కానీ, యజుర్వేదంలో కానీ కనిపించని 'జ్యోతిష్యఫలాలు' - బుద్ధుని కాలానికి కన్పిస్తాయి. జ్యోతిష్యఫలాల్ని చెప్పుకుని బ్రతికే ముఠాలు తయారయాయి. నక్షత్ర ఫలాల్ని బుద్ధుడు వ్యతిరేకించిన విషయాలు, వీటితోపాటు ఒక నూటయాభై మూఢనమ్మకాల్ని' పాటించవద్దని బుద్ధుడు చెప్పిన విషయం దీర్ఘనికాయం, బ్రహ్మజాలసత్తంలో ఉంది. ఈ విషయాన్ని మనం గతంలో చెప్పుకున్నాం.

నక్షత్రాల్నిబట్టి జరిగే ఉత్సవాలు బౌద్ధ సాహిత్యంలో అనేక చోట్ల కనిపిస్తాయి. వీటిలో 'కృత్తిక నక్షత్రాల'కు సంబంధించిన ఉత్సవాలు ప్రత్యేకంగా జరిపే సంప్రదాయం బుద్ధునికాలానికి ఉంది. (వేదంలో మొదటి నక్షత్రం అశ్వని కాదు, కృత్తిక. కృత్తికతో నక్షత్ర గణననీ, ఋతు గణననీ ప్రారంభిస్తారు వారు. అదే సంప్రదాయం బౌద్ధకాలానికీ కొనసాగుతూ ఉంది. (ఈ విషయాన్ని గురించి వచ్చే సంచికలో చర్చిద్దాం)

దీన్నిబట్టి మనకి ఒక అవగాహన వస్తుంది. యజుర్వేద కాలానంతర (క్రీ.పూ. 800 తర్వాత) రెండు శతాబ్దాల్లో జ్యోతిష్యఫలాల నమ్మకం పెరిగిపోయి ఉండాలి. బుద్ధునికి జ్యోతిష్యఫలాల మీద నమ్మకం లేకపోయినా, బౌద్ధంలోకి వైదిక సంప్రదాయం వచ్చిపడ్డాక బుద్ధుని జననానికీ, నామకరణానికీ, జ్ఞానోదయానికీ, నిర్వాణానికీ - అన్నింటికీ నక్షత్ర బలాలు వచ్చి చేరాయి.

బుద్ధుని రాశి తుల. ఆయన జన్మతిథి వైశాఖ పున్నమి.పూర్ణ చంద్రుడు విశాఖ నక్షత్రం దగ్గర ఉన్నప్పుడు వచ్చే మాసాన్ని వైశాఖ మాసం అంటారు. కాబట్టి బుద్ధుని నక్షత్రం విశాఖ.

పూర్వం పేర్లను నక్షత్రాల్ని బట్టి, వాటి పాదాల్ని బట్టి పేట్టేవారు. ప్రతి నక్షత్రాన్ని నాలుగు భాగాలుగా కాల విభజన చేస్తారు. ఆ నాలుగు భాగాల్లో ఏ భాగంలో పుడితే దానికి సంబంధించిన అక్షరంతో పేరు పెడతారు. ఇలా పెట్టడం వల్ల - పుట్టిన సమయం కూడా తెలుస్తుంది.

అయితే, ఈ విధానం బుద్ధుని కాలానికి ఉన్నట్లు లేదు. ఉంటే, బుద్ధుని పేరు విశాఖ నక్షత్రం లోని నాలుగు పాదాలకు చెందిన "తీ - తు - తె - తో" అక్షరాలతో మొదలవ్వాలి. కానీ ఆయన పేరు 'సర్వార్థ సిద్ధుడు'. 'స' తో గాని, 'సి' తో మొదలయ్యే పేర్లు గలవారు శతభిష నక్షత్రంలో పుట్టి ఉండాలి. కాబట్టి బుద్ధుని పేరు నక్షత్రాన్ని బట్టి

పెట్టింది కాదు. అసలు ఆ విధానం అప్పుడుందో లేదో తెలియదు.

కాబట్టి బుద్ధుని జన్మకి సంబంధించి ఆ తర్వాత వచ్చిన జ్యోతిష్య తర్కం అంతా జోస్యమే!

ఆయన పుట్టుక, గృహత్యాగం, జ్ఞానోదయం, నిర్వాణం – అన్నీవైశాఖ పున్నమి నాడే!– ఇది అసలు నమ్మతగిందే కాదు!అలాగే యశోధర పుట్టుక, రాహులుని పుట్టుక కూడా వైశాఖ పున్నమినాడే!

ఇది ఎలా ఎప్పుడు బౌద్ధంలోకి ప్రవేశించిందో పరిశోధించాలి.

**కాల గణనం – చాంద్రమానం**

కాలాన్ని గణించే విధానాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా మన దేశంలో మూడు విధానాలున్నాయి. ఒకటి: సౌరమానం. రెండు: చంద్రమానం. మూడు: బార్హస్పత్య మానం. (బృహస్పతి (గురుగ్రహం) ని బట్టి కాలాన్ని నిర్ణయించే విధానం. ఈనాటికీ పుష్కరాల్ని ఈ విధానం తోనే జరుపుకుంటున్నాం. గురుడు ఒక్కొక్క రాశితో ఉన్నప్పుడు ఒక్కొక్క నదికి పుష్కరాలు వస్తాయి)

ఈ మూడింటిలో బౌద్ధులు చంద్రమానాన్ని ఎంచుకున్నారు.

వేదంలో సౌరమానం కన్పిస్తుంది. వారికి నెల అమావాస్యతో మొదలవుతుంది. కాబట్టి అనేక యజ్ఞాలు అమావాసలతో మొదలవు తాయి. సౌరమానం పాటించేవారికి అమావాస శుభదినం. ఇది ఇప్ప టికీ తమిళనాడులో, మరికొన్ని రాష్ట్రాల్లో ఉంది.

బౌద్ధులు పాటించిన చాంద్రమానం వల్ల పౌర్ణమికి ప్రాధాన్యత వచ్చింది. రానురాను పున్నమి ఘడియలు మంచివి అనే నమ్మకం బలపడింది. ఇక్కడ ప్రశ్న ఏమంటే...బౌద్ధులు చాంద్రమానం ఎందుకు ఎన్నుకున్నారు? అనేది.

ఒకటి :సౌరమానం కంటే కాలాన్ని అతి సూక్ష్మంగా చాంద్రమానంలో కొలవ వచ్చు.

రెండు : తిథులు (తేదీలు) ఘడియలు (గంటలు) విఘడియలు (నిమిషాలు) విభజన చాంద్రమానంతోనే సాధ్యం. సులభం.

మూడు : ఋతువులు, కాల నిర్ణయం సౌరమానం కంటే చాంద్రమానంలో ఖచ్చితంగా గుర్తించ గలగడం.

నాలుగు : బౌద్ధాలు సంచార భిక్షువులు, కాబట్టి వెన్నెల వీరి ప్రయాణానికి సహకారి కావడం.

ఐదు : బౌద్ధంలో అతి కీలకమైనవి ఉపోసథ దినాలు. అంటే ఉపవాస దినాలు. అంటే తిండి మానడం కాదు. ఆ రోజున వారు సమావేశం కావాలి. ఒక ప్రాంతంలో ఉన్న భిక్షువులందరూ ఆ రోజు, తప్పక ఒక చోట సమావేశం కావాలి. వారి అనుభవాలు, సాధక బాధకాలు చర్చించుకోవాలి. కొత్త విషయాలు నేర్చుకోవాలి. ఎవరైనా కొత్తవారు బౌద్ధ ధర్మంలోకి వస్తే వారికి ఈ రోజుల్లోనే దీక్ష ఇవ్వాలి. ఇలాంటి ఉపోసదలు నెలకి నాలుగు ఉంటాయి. అంటే...వారానికి ఒక్కటి.

**ఏడు రోజుల వారం ఇలా పుట్టింది:**

'వారం' అనే విభజన బుద్ధుని కాలానికి ముందు ఉన్నట్టు లేదు. ప్రపంచంలో 'వారానికి' నిర్దిష్ట కొలత కూడా లేదు. ఎందుకంటే.. వారానికీ నక్షత్రాలకీ సంబంధం లేదు. నక్షత్రాల్ని బట్టే తిథులు, రాశులు ఇతర అంశాలు వచ్చాయి. పక్షం (15 రోజులు) అనే విభాగం చంద్ర కళల్ని బట్టి వచ్చింది.

ఈ ఉపోసద దినాలు పక్షాల్ని బట్టి, ప్రతి పక్షానికి రెండు చొప్పున ఉంటాయి.

1వ ఉపోసద దినం : పున్నమినాడు

2వ ఉపోసద దినం : కృష్ణ పక్ష అష్టమినాడు

3వ ఉపోసథ దినం : కృష్ణ పక్ష చతుర్దశినాడు (అమావాస్య ముందురోజునాడు)

4వ ఉపోసద దినం : శుక్లపక్ష అష్టమినాడు.

ఇలా నెలని 4 భాగాలుగా బౌద్ధులు విభజించి ఉపోసద దినాల్ని జరుపుకుంటారు.

బౌద్ధులకు ముందున్న గ్రంథాలలో "వారం" విభజన ఎక్కడా కన్పించదు. 'వారం' విభజన చాలా దేశాల్లో చాలా రకాలుగా ఉంది.

పశ్చిమ ఆఫ్రికా వాసులు 4 రోజులవారాల్ని, మెక్సికన్లు, మంగోలులు, ఖాల్డియన్‌లు 6 రోజుల వారాల్ని, రోమన్లు 8 రోజుల వారాల్ని, ఈజిప్టువారు 10 రోజుల వారాల్ని వాడారు.

ఈనాడు ప్రపంచం అంతా ఉపయోగించే 7 రోజుల వారాన్ని తొలిగా విభాగించింది బౌద్ధులే! ఆ తర్వాత ఈ విధానం అరబ్బు, మధ్య ఆసియాలకు పాకింది. గ్రీకులూ దీన్నే తీసుకున్నారు.

ఐతే, బౌద్ధ సాహిత్యంలో వీటిని 'ఉపోసద' దినాలుగానే చెప్పారు. ఐతే, "7 రోజుల తర్వాత" '7 రోజులకు' అంటూ బౌద్ధ సాహిత్యంలో ఎన్నో సంఘటనలు కన్పిస్తాయి. 'ఏడు రోజులు' అనే ప్రస్తావన ప్రత్యేకంగా ఉందిగానీ, దీన్ని 'వారం' అని గానీ, మరో పదంతోగానీ పిలిచిన ఆనమాళ్ళు లేవు.

వారానికి 7 రోజులు అనే భాగం, కేవలం చంద్రమానం వల్లే సాధ్యం. చంద్రుడు భూమి చుట్టూ ఒకసారి తిరిగిరావడానికి సుమారు 27 1/2 రోజులు పడుతుంది. అందుకే చంద్రకళలు 27 ఉంటాయి. ఒక్కొక్క కళకి ఒక్కొక్క నక్షత్రం చొ॥న "అశ్విని, భరణి...అనే 27 నక్షత్రాలే ఉంటాయి. ఈ 27 రోజులే కాకుండా ఇంకా కొంత అవధి (సగం రోజు) ఉంటుంది కాబట్టి 28 వదైన అభిజిత్ నక్షత్రాన్నీ కలుపు తారు. ఇలా చూస్తే...నెలకి 28 రోజులు. నెల పొడుపు నుండి నెల పొడుపుకి30 లేదా 31 రోజులు. ఎందుకంటే అమావాస్య తర్వాత చంద్రుడు రెండు రోజులు కన్పించడు. అది వేరే లెక్క. నెల విభజనకి కారణం చంద్రుడే కాబట్టి చంద్రుడు రారాజే కాదు, నెలరాజు కూడా అయ్యాడు.

ఇక్కడ బౌద్ధుల ఉపోసద దినాలు చంద్రకళల్నిబట్టే – 4×7=28 రోజులు. ఇలా బౌద్ధుల నియమావళే 'వారం' రోజుల కాల గణనానికి

**వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది**

కారణం అయ్యింది.

మిగిలిన చోట్ల ఎన్ని రకాల 'వార' విభజనలు ఉన్నా చివరికి ప్రపంచం మొత్తం ఈనాడు ఈ విధానాన్నే పాటిస్తున్నది.

పున్నమి, కృష్ణ చతుర్దశి రోజుల్లో జరిగే ఉపోసద దినాల్ని 'దీక్షాదినాలు' అంటారు. భిక్షువులకు దీక్ష ఇచ్చేది ఈ రెండు దినాల్లోనే!

ఒక అవసరం ఒక ఆవిష్కరణకి దారి తీస్తుంది అన్నట్లు, ఒక నియమం ఒక కాలగణనకి దారి తీసింది!

**శుక్రగ్రహ గమనం : –**

మనకి ఆకాశంలో కన్పించే నక్షత్రాల్లో కొన్ని గ్రహాలు కూడా ఉంటాయి. మనం వాటిలో బుధుడు, శుక్రుడు, కుజుడు, గురుడు, శని గ్రహాల్ని కంటితో చూడగలం. వాటిలో గురుడు ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రాశిలో ఉంటాడు. రాశినుండి రాశికి మారడానికి సంవత్సరం పడుతుంది. కాబట్టే గురుడు (బృహస్పతి) ఆధారంగా బార్హస్పత్య సంవత్సరం వచ్చింది.

అలాగే... శుక్రగ్రహం కూడా. అన్ని గ్రహాల్లో పెద్దగా వెన్నముద్దలా కనిపించేది శుక్రగ్రహమే! అది రాత్రి ఆకాశానికే అద్భుత అందం. దీన్నే 'తార' అంటాం. ఆ అందమే 'తారా శశాంక' కథ పుట్టడానికి కారణం. ఈ శుక్రగ్రహానికి రెండు గతులుంటాడు. క్రమగతి, వక్రగతి. అంటే కొంతకాలం ముందుకి, మరల కొంతకాలం వెనక్కికదులుతూ ఉంటుంది. కొన్నాళ్ళు తెల్లవారక ముందు తూర్పు ఆకాశంలో కన్పిస్తుంది. అప్పుడు దాన్ని ఉదయతార అంటాం. మరలా కొన్నాళ్ళు సాయంత్రం వేళ పశ్చిమ ఆకాశంలో కన్పిస్తుంది' అప్పుడు దాన్ని సాయంతార అంటారు.

ఐతే...ఈ క్రమగతి గానీ, వక్రగతి గానీ ఖచ్చితంగా ఎన్నేళ్ళు చూసినా అదే మార్గంలో, అదే నక్షత్రాల దారిలో ఉంటాయి. ఈ దారి ప్రతి ఎనిమిది సంవత్సరాలకి ఒకే విధంగా ఉంటుంది. అంటే ఎనిమిదేళ్ళు ఎలా కదిలిందో, ఆ తర్వాత ఎనిమిదేళ్ళు అదే దారిలో నడుస్తుంది. ఈ శుక్రగతిని బుద్ధునికంటే ముందే గమనించారా? లేదా? అనేది మనకు తెలియదు. ఆ విషయం రుగ్, యజుర్ వేదాల్లో ఎక్కడా లేదు.

బౌద్ధ సాహిత్యంలో 'రుజు మార్గంలో మనం మన దారి తప్పకుండా నడచుకోవాలి' అని చెప్పే విషయానికి ఈ 'శుక్రగ్రహగతిని' ఉపమానంగా చెప్పే సందర్భాలు కనిపిస్తాయి. జాతక కథల్లో చాలా చోట్ల ఉంది.

ముఖ్యంగా...బౌద్ధంలోని దశ పారమితల్లో ఒకటైన సత్యపారమి తను గురించి చెప్తూ 'నిదానకథ'లో ఇలా ఉంది –

"ఎప్పుడైనా, ఏ లోకమందైనా తన బాటను తప్పకుండా గ్రహగురుడైన 'శుక్రుడు' ఎలా నడుస్తాడో, అలాగే పిడుగులొచ్చిపైన పడ్డా సత్యసంధుడు మాట తప్పక నడుచుకోవాలి" – అని.

ఈ నిదాన కథలోనే మరొకచోట మరో గొప్ప ఖగోళ అంశం ఉంది. దాన్ని చూద్దాం.

బుద్ధుడు కఠోర దీక్ష చేశాక, చిక్కి శల్యమైపోతాడు. సుజాత అనే స్త్రీ ఇచ్చిన పాయసం తీసుకుని– తేరుకుని, ఆలోచించి – "శరీరాన్ని ఎండకట్టుకునే యోగసాధన వల్ల జ్ఞానం రాదు" అని తెలుసుకుని ధ్యాన సాధన దిశగా సాగుతాడు. 'ఈ ధ్యాన సాధనలో నాకు జ్ఞానం కలిగే వరకూ ఇక్కడి నుండి లేవను" అని నిశ్చయించుకొని, గయలోని నిరంజనా నది తీరంలో బోధి వృక్షం క్రింద కూర్చొంటాడు –

ఇక్కడే...మన ఖగోళ కథ మొదలవుతుంది.

**ఆయనాలు – విషువత్తులు:**

చెట్టుకి ఏ దిక్కున కూర్చోవాలి? ముఖం ఎటుపెట్టుకు కూర్చోవాలి? – అనే మీమాంస బుద్ధునికి కలిగింది. అప్పుడు దిక్కులన్నీ పరిశీలించాడు – ఏ దిక్కుకు అభిముఖంగా కూర్చుంటే దిక్ చక్రం సమాంతరంగా ఉంటుందో చూసి, ఆ దిక్కుకు తిరిగి కూర్చుంటాడు.

మొదట దక్షిణం, తర్వాత పడమర, తర్వాత, ఉత్తరం, తర్వాత తూర్పు – ఇలా అన్ని దిశలూ తిరిగి, పరిశీలిస్తాడు బుద్ధుడు.

మనం ఇక్కడ ప్రత్యేకంగా చూడాల్సింది ఈ 'దిక్ చక్రం' అనే పదం –

మనం ఆకాశంలో ప్రతిరోజు చూస్తుండే సూర్యుడుగానీ, చంద్రుడుగానీ, నక్షత్రాలుగాని ఖచ్చితంగా ఒకే ప్రదేశంలో ఉదయించి, గీతగీసినట్లు నిటారుగా పైకి వచ్చి, మరలా అంతే నిటారుగా అస్తమించవు. ఒక అర్ధవృత్తాకార మార్గంలో కదులుతూ ఉంటాయి. ఉదయ, అస్తమయ ప్రదేశాల మధ్య అవి అర్ధవృత్తాకార మార్గంలో కదులులాయి. ఈ వృత్తాకార మార్గం భూమధ్యరేఖాప్రాంతంనుండి ధృవ ప్రాంతాలకు పోయే కొద్దీ పెరుగుతూ ఉంటుంది.




**భూమి అక్షం సూర్యుని అక్షానికి 23 1/2 $^{0}$ వంగి ఉంది**

మనం ఏ అక్షాంశం మీద ఉన్నామో, ఆ అక్షాంశం మీద ఉంటే నక్షత్రం మాత్రం వక్రగతి లేకుండా సరళ మార్గంలో పయనిస్తున్నట్లు కన్పిస్తుంది.

**తెలుగు మాధ్యమాన్ని తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు**

ఈ పరిశీలన వల్లే సూర్యుడు మనకి తూర్పు ఆకాశంలో కొన్నాళ్ళు ఉత్తరం వైపున, కొన్నాళ్ళు దక్షిణం వైపున ఉదయిస్తున్నట్లు కనిపిస్తాడు. దాన్నే మనం ఉత్తరాయనం, దక్షిణాయనాలని అంటాం.

ఇలా ఎందుకు కన్పిస్తుందంటే...భూమిఅక్షం సూర్యుని అక్షానికి లంబంగా లేకుండా 23 1/2 $^0$ వంగి ఉండడం వల్ల, అది సూర్యుని చుట్టూ తిరగడం వల్ల అలా కన్పిస్తుంది. మనం ఈ ఉత్తరాయన దక్షిణాయనాల్లోని మార్పుని ఒక సంవత్సర కాలం పరిశీలిస్తే గమనించ గలం. ప్రతి సంవత్సరం ఆ ఆయనాలు అలాగే ఉంటాయి.

ఈ కాలంలో సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తర దక్షిణాలుగా 23 1/2 $^0$ ల దగ్గర ఉన్న ఆయనరేఖల వరకే వెళ్తాడు. ఉత్తరాన ఉన్న ఆయన రేఖ కర్కటరేఖ. దక్షిణాన ఉన్న ఆయన రేఖ మకరరేఖ. అంటే మనం భూమ్మీద కర్కటరేఖ ప్రాంతంలో నిలబడితే మన నెత్తిమీద నిటారుగా కర్కాటక రాశి కదులుతూ ఉంటుంది. ఆ రాశిలోకి సూర్యుడు చివరిదాకా వొచ్చినప్పుడు అది "ఉత్తరాయన అంతం' తిరిగి వెనక్కి మళ్ళినప్పుడు అది దక్షిణాయన ప్రారంభం.

అంటే సూర్యుడు ఈ భూమ్మీద అక్షాంశాల్ని బట్టి చూస్తే భూమధ్యరేఖకు ఉత్తరాన 23 1/2 $^0$ ల దగ్గర ఉన్న కర్కాటక రేఖ వరకూ పోయి, తిరిగి వెనక్కి మళ్ళుతాడు. అలాగే, తిరిగి వస్తూ భూమధ్య రేఖను దాటి దక్షిణం వైపున ఉనన మకర రేఖ వరకూ పోయి మరలా వెనక్కి మళ్ళుతాడు. ఇలా ఈ రెండు రేఖల మధ్య చరించడాన్నే 'ఆయన చలనాలు' అంటాం.

ఉత్తరాయనం నుండి ఉత్తరాయన అంతానికి, అలాగే దక్షిణాయనం నుండి దక్షిణాయన అంతానికి - ఎప్పుడూ ఒకే సమయం పడుతుంది. కాబట్టి ఆయనకాలాలూ, ఆయనదినాలు మారవు.

మనకి ఉత్తరాయనాంతం ఇప్పుడున్న కేలండర్ ప్రకారం జూన్ 22. దక్షిణాయనాంతం డిసెంబర్ 22. అలాగే సూర్యుడు ఉత్తర దక్షిణాలుగా కదులుతున్నప్పుడు సంవత్సరానికి రెండుసార్లు భూమధ్యరేఖ మీదికి వస్తాడు. ఆ సమయాలూ, ఆ తేదీలూ కూడా ఖచ్చితమే.




అలాగే మకరరేఖ మీద ఉన్నప్పుడు నెత్తిమీద నిటారుగా మకరరాశి ఉంటుంది. ఆ రాశిలో చివరిదాకా సూర్యుడు వచ్చినప్పుడు అది "దక్షిణాయనాంతం' అక్కడి నుండి వెనక్కి మళ్ళినప్పుడు అది 'ఉత్తరాయణ ప్రారంభం'.

మనం (భారతదేశం) భూమ్మీద ఉత్తరార్ధగోళం మీద ఉన్నాం. సూర్యుడు దక్షిణాన ఉన్న మకర రేఖ దగ్గరకు వెళ్ళునప్పుడు చాలా దూరంలో ఉంటాడు కాబట్టి అది చలికాలం, లేదా హేమంత, శిశిర రుతువులు. సూర్యుడు తిరిగి వచ్చేప్పుడు భూమధ్యరేఖ మీదికి వస్తాడు.

కవిత

# మరణం లేని మరణం

డా॥ ఎన్.గోపి

ఇవాళ
చావును చంపేద్దామా!
అతడు మరణించటానికి వీల్లేదు.

మలినమంటని మానవుడతడు
మహానుభావుడు.
అతనిని కబళించి
మృత్యువుకు గర్వం ఎక్కకూడదు.

గమనిస్తున్నారా!
ఇప్పటిదాకా అతనితోపాటు
తిరిగిన భూగోళం
ఇప్పుడతని వెనుకే పరిభ్రమిస్తూ
వీడ్కోలు సన్నాహాలు చేస్తున్నది.

అతని ముందు కూర్చొని
శోకాలు పెట్టొద్దు
ఆ పక్కన
పువ్వుల్ని వాసన చూడండి
అతని శ్వాస
వెచ్చగా తగుల్తుంది.

శవం దగ్గర నిలబడి
ఫోటోలు తియ్యొద్దు
అది మనసు తొడుక్కున్న శరీరం
నీ లెన్సులో అది పడదు.

సంక్లిష్ట ప్రపంచానికి
స్పష్టత నిచ్చిన సృజనశీలి.
వృద్ధాప్యమతని క్రీడకు
చిట్టచివరి మైదానం మాత్రమే.

మంచమెక్కిన మరుక్షణం నుంచి
క్షణక్షణం జీవిస్తున్నాడు.
అతని చుట్టూ
అతని ఆచరణ దృశ్యాలు
తూనీగల్లా ఎగురుతున్నాయి.

అతడు కదలడు
కాని లోకాన్ని కదిలిస్తున్నాడు.
మనకు ఆలోచన రాకముందే
అతడు చావును చంపేశాడు.
అతనికి మరణం లేదు.

– 'వృద్ధోపనిషత్' (Old age poems)
అముద్రిత కావ్యం నుండి.

ఇక అప్పటి నుండి ఉత్తరపు గోళంలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరార్ధగోళంపై ఎండ పెరుగుతుంది. శీతలం పోతుంది. 'వసంతం' వస్తుంది. ఇలా సూర్యుడు భూమధ్య రేఖమీదికి వచ్చినప్పుడు దాన్ని 'వసంత విషవత్' అంటారు. ఆ రోజున భూమ్మీద మనం ఏ ప్రదేశంలో ఉన్నా పగలూ, రాత్రీ సమానం. మిగిలిన రోజుల్లో పగటి పొద్దో, రాత్రి పొద్దో ఎక్కువ, తక్కువలుగా ఉంటాయి. రోజుకి 24 గంటలే, అయినా పగలూ, రాత్రి సమానం కాదు. కానీ, వసంత విషువత్ రోజున ఆ రెండు సమానం. అందుకే మార్చి నుంచి మనకి (ఉత్తరార్ధగోళం వారికి) ఋతుచక్రం ప్రారంభమవుతుంది. ఈ వసంత విషువత్ రోజు మార్చి 21.

అలాగే...ఆ తర్వాత జూన్ 22కి కర్కటకరేఖ వరకూ పోయి, తిరిగి మరలా దక్షిణదిశగా వెనక్కి వస్తాడు సూర్యుడు. ఇలా

వచ్చిపోయేప్పుడు మరలా భూమధ్యరేఖ దగ్గరకు, సెప్టెంబర్ 23న వస్తాడు. ఆ రోజుకూడా ప్రపంచం మొత్తం పగలూ రాత్రి సమానం. దాన్ని శరద్ విషువత్ అంటాం. అంటే మనకి శరత్కాలం ఆరంభం. చలి ప్రారంభం. అలా సూర్యుడు డిసెంబర్ 22నాటికి దక్షిణాన ఉన్న మకరరేఖ వరకూ పోతాడు.

కాబట్టి – ఋతుగమనంలో ఈ నాలుగు ప్రదేశాలూ, నాలుగు తేదీలు చాలా ముఖ్యం. అవి –

1. వసంత విషువత్ (మార్చి 20 లేదా 21) ఈ సంవత్సరంలో మార్చి20న సాయత్రం 4:50కు జరిగింది.

2. ఉత్తరాయణాంతం (జూన్ 21 లేదా 22) ఈ సంవత్సరంలో జూన్ 21 ఉదయం 10:07 కు జరగబోతోంది.

3. శరత్ విషువత్ (సెప్టెంబర్ 22 లేదా 23) ఈ సంవత్సరంలో సెప్టెంబర్ 22న తెల్లవారు ఝామున 1:54కు జరుగబోతోంది.

4. దక్షిణాయనాంతం (డిసెంబర్ 21 లేదా 22) ఈ సంవత్సరంలో డిసెంబర్ 21న రాత్రి 10:23 కు జరుగబోతోంది.

ఐతే...ఇప్పటి వరకూ మనం చెప్పుకొన్న రోజులు, నెలలు, సంవత్సరాలు, వారాలూ, ఆయనాలు – ఈ విషయాల్ని పెద్దగా పరిశోధించవలసిన పనిలేదు. మార్పుల్ని గమనిస్తే చాలు.

చంద్రకళల్ని బట్టి తిథుల్ని లెక్కించటం అనేది ఒక పరిశీలన. ఎందుకు చంద్రకళలు కనిపిస్తాయి? అనేది తెలుసుకుంటే అది పరిశోధన. అన్వేషణ. ఆవిష్కరణ.

అలాగే....ఉత్తరాయనం, దక్షిణాయనాల్ని బట్టి రుతువుల్ని గమనించి, ఖచ్చితంగా లెక్కిస్తే అది పరిశీలన. ఎందుకు ఆయనాలు ఏర్పడుతున్నాయి? అనే కారణాల్ని కనుగొంటే అది ఆవిష్కరణ.

మనం ఇప్పటివరకు చెప్పుకున్న ఖగోళ విషయాలన్నీ పరిశీలనలే. కానీ...తొలి ఖగోళ పరిశోధన మనం పైన చెప్పుకున్న బౌద్ధ 'నిదాన కథ'లోని – 'దిక్ చక్రం' విషయంలో కన్పిస్తుంది.

( **తరువాయి వచ్చే సంచికలో...** )

## పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

చలసాని నరేంద్ర
9849569050

# ఆంధ్రరాష్ట్ర విభజనను ఇక్కడి ప్రజలు కోరుకోలేదా !



**"మనం** రాష్ట్ర విభజనను కోరుకోలేదు. అర్థాంతరంగా రాష్ట్రాన్ని విభజించి పంపివేశారు". "రాజధాని నగరం కూడా లేకుండా, నడి వీధిలో నిలబెట్టి రాష్ట్రాన్ని విభజించి పంపివేశారు". "ఏకపక్షంగా రాష్ట్రాన్ని విభజించారు". "రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని మనమంతా ఆందోళన చేస్తుంటే పట్టించుకోకుండా రాష్ట్రాన్ని విభజించారు". ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను విభజించి, రెండు తెలుగు రాష్ట్రాలు ఏర్పడి నాలుగేళ్ల గడిచినా ఇంకా చాలామంది నాయకులు ఇటువంటి మాటలతో ఆంధ్రప్రదేశ్ లోని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడున్న ప్రజలెవ్వరికీ ఇష్టం లేకుండా రాష్ట్రాన్ని విభజించారని పదే పదే పాడిందే పాటగా పాడుతున్నారు.

అయితే ఇవ్వన్నీ ప్రజలను సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించే ప్రయత్నాలేగాని వాస్తవాలు కావని గ్రహించాలి. వాస్తవానికి స్వాతంత్ర్యం రావడానికి రెండు దశాబ్దాల ముందు నుండే నాటి ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుండి విభజించి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలనీ ఉద్యమాలు జరుగుతూ వచ్చాయి. దేశంలో తొలి బాషాప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, దానిని అన్యాయంగా విభజించారని ప్రచారం జరుగుతున్నది. వాస్తవానికి ఈ దేశంలో ఏర్పడిన తొలి భాషాప్రయుక్త రాష్ట్రం ఒడిస్సా అని చెప్పాలి. అది 1934లోనే ఏర్పడింది.

యదార్థానికి ఒడిస్సా, బీహార్‌లతోపాటు అప్పుడే ఆంధ్రరాష్ట్రం ఏర్పడవలసింది. కానీ అప్పుడు రాష్ట్రాల విభజన సమస్యపై అధ్యయనం చేయడానికి వచ్చిన సైమన్ కమిషన్‌ను జాతీయ కాంగ్రెస్ నాయకత్వం పిలుపందుకొని మన నాయకులు బహిష్కరించడంతో ఆ అంశం మరుగున పడిపోయింది. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు – 1953లో – ఆంధ్ర రాష్ట్రం కార్యరూపం దాల్చలేదు.

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ జరిపింది మొన్నటి వరకు ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయడంకోసం మాత్రం కాదు. అప్పటికి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు సూత్రప్రాయంగా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. అయితే మద్రాస్ నగరంతో సహా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేయాలని ఆయన నిరసన దీక్ష చేపట్టారు. కానీ ఆయన మరణం తర్వాత కొందరు కాంగ్రెస్ నాయకులు ఉద్దేశ్యపూర్వకంగానే ఆ అంశాన్ని మరుగు పరచి మద్రాస్ లేకుండానే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేశారు.

ఆంధ్ర ప్రాంత నాయకులు ఎందరో కలసి 1912 నుంచే ప్రత్యేకంగా "ఆంధ్రమహాసభ"ను ఏర్పాటుచేసి ప్రత్యేక రాష్ట్రంకోసం ఉద్యమాన్ని కొనసాగిస్తూనే వచ్చారు. సిద్ధాంతరీత్యా భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనను సమర్థిస్తూ కూడా భారత జాతీయ కాంగ్రెస్ ఆచరణలో నీరు కార్చుతూ ఉండడంతో ఆంధ్రుల ఉద్యమం సఫలం కావడానికి చాలాకాలం పట్టింది.

**కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఆ విధంగా ప్రవర్తించడానికి ఆంధ్రప్రాంత నాయకులు పలువురు దూరదృష్టి లేకుండా, పరస్పరం అసూయ ద్వేషాలతో విభిన్నంగా వ్యవహరించడమే కారణమని చరిత్ర స్పష్టం చేస్తున్నది. చాల ముందుగానే ప్రత్యేకంగా ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసి కూడా 1945 – 46 వరకు "ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు కృషి చేస్తాము" అనే అంశాన్ని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో చేర్చనే లేదు.**

పొట్టి శ్రీరాములు బలిదానం చేసినా మద్రాసు నగరంకోసం పట్టుబట్టలేదు. రాయలసీమకు వాణిజ్య రాజధానిగా పేరొందిన బళ్ళారిని వదులుకున్నాం. అక్కడ ఉన్న అలిపూర్ జైలులో స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో సమరయోధులు ఉండేవారు. అప్పటికే కంటోన్మెంట్ ప్రాంతం కూడా ఉంది. హోసూరు, రాయచూర్‌లను కూడా కోల్పోయాము. రాయలసీమను సస్యశ్యామలం చేయగల తుంగభద్ర డ్యాం, చారిత్రాత్మకమైన హంపి, విజయనగరంలను కోల్పోవలసి వచ్చింది.

తిరుపతి పక్కనే ఉన్న తెలుగు మాట్లాడే ప్రజలు అత్యధికంగా ఉన్న తిరుత్తణిని తమిళనాడుకు ధారాదత్తం చేసారు. మరోవంక ఒరిస్సాలో తెలుగు మాట్లాడే ప్రజలు అత్యధికంగా ఉండే కోరాపుట్, గంజాం, బరంపూర్, రాయగడ, జైపూర్, గునాపూర్ వంటి ప్రాంతాలను ఆ రాష్ట్రానికి వదులుకోవలసి వచ్చింది. నాటి కాంగ్రెస్ పార్టీలో పెత్తనం చేస్తున్న పెద్దలు తమ వ్యక్తిగత రాజకీయ ప్రాబల్యానికి ఇచ్చిన ప్రాధాన్యతను ఆంధ్రులను ఒకటిగా ఉంచడానికి, కొత్తగా ఏర్పడే రాష్ట్ర భవిష్యత్తుకు బంగారుబాట ఏర్పాటు చేయడానికి ఇవ్వకుండా సంకుచితంగా వ్యవహరించడం కారణంగా ఎన్నో అనర్థాలు ఆంధ్రులకు జరిగాయి.

ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు ఎవ్వరూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడాలని కోరుకోలేదు. ఆ మేరకు ఎక్కడా ఉద్యమాలు జరగనే లేదు. అప్పటికే తెలంగాణలో కొన్ని జిల్లాల్లో సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులు – 'విశాలాంధ్ర' అనే నినాదాన్ని లేవదీసినా, ఆ నినాదానికి అటు తెలంగాణ ప్రాంతంలోగాని, ఇటు ఆంధ్ర ప్రాంతంలోగాని

చెప్పుకోదగిన మద్దతు లభించలేదు. అయితే రెండు రాష్ట్రాలలో కాంగ్రెస్ మైనారిటీలో పడిపోవడం, సొంతంగా ప్రభుత్వాలు నడిపే పరిస్థితులు భవిష్యత్తులో కూడా ఉండకపోవచ్చని భయం వారిని పట్టుకోవడంతో కేవలం రాజకీయ అవసరాల కోసమే ఆ నాడు వ్యూహాత్మకంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు.

రెండు రాష్ట్రాలు విడిగా ఉంటే రెండింటిలో కాంగ్రెస్ మైనారిటీలో పడే ప్రమాదం ఉండడంతో, ముఖ్యంగా రాయలసీమ కాంగ్రెస్ నాయకుల ఆధిపత్యం సాధ్యం కాదనే భావనతో – 'విశాలాంధ్ర' నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు తొందర పడ్డారు. **రాజకీయంగా ఒక రాష్ట్రమైనా ఏనాడూ కూడా రెండు ప్రాంతాల ప్రజలు భావాత్మకంగా ఒకటిగా కావడానికి, సాంస్కృతికంగా కలసి పోవడానికి రెండు ప్రాంతాల నాయకత్వం చెప్పుకోదగిన ప్రయత్నాలు చేయలేదు. ఈ సందర్భంగా చేసుకున్న పెద్ద మనుష్యుల ఒప్పందాన్ని మొదట్లోనే నీరు గార్చారు.**

ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంతం వారి అనుమానాలు తీర్చుతూ, వారు కోరిన హామీలు అన్నీ ఇస్తూ, వారికి నచ్చ చెప్పేందుకు ఆంధ్ర ప్రాంతంలోని కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపారు. ఇదే సమయంలో ఆంధ్ర ప్రాంతంలో ప్రజలకోసం పోరాటం సాగించే సమర్ధవంతమైన నాయకత్వం లేకుండా చేయడంలో కాంగ్రెస్ పెద్దలు విజయం సాధించారు. తమ అడుగులకు మడుగులొత్తే మహారాజులు, జమిందారులు, భూస్వాములను ప్రోత్సహించి పదవులను కట్టబెట్టారు. మధ్య తరగతి ప్రజల నుండి, గ్రామాల నుండి వచ్చిన నాయకత్వాన్ని ప్రోత్సహించకుండా అణగదొక్కే ప్రయత్నం చేశారు. దానితో ఆంధ్ర ప్రాంతంలో ప్రజల కోసం మాట్లాడి, పోరాడే నాయకత్వమే లేకుండా చేశారు.

**ఈ సందర్భంగా భవిష్యత్తులో రాగల విష పరిణామాలను ముందుగానే ఊహించి స్పష్టమైన హెచ్చరికను ఆనాడే ఆచార్య యన్.జి. రంగా చేశారు. "ఆంధ్రప్రదేశ్ అనే సెంటిమెంట్‌ను తెలంగాణ వారిపై బలవంతంగా రుద్దడం ఏమాత్రం వాంఛనీయం కాదు. అది మనకే నష్టం. తెలుగు మాట్లాడే వారికి రెండు రాష్ట్రాలు ఉంటే లాభమే గాని, నష్టం ఏమాత్రం లేదు"** అని స్పష్టం చేసారు. అయితే కాంగ్రెస్‌లోని ముఠా రాజకీయాలలో తమ ఆధిపత్యం పెంచుకోవడం కోసమే కొందరు నాయకులు రెండు ప్రాంతాల ప్రజల మధ్య ఉద్దేశ పూర్వకంగానే అంతరాలను పెంచారు. తమ పెత్తనం సాగడం కోసం ప్రజల మధ్య చీలిక తీసుకు వచ్చారు. విద్వేష పవనాలను పెంపొందింప చేశారు.

1969లో తెలంగాణ ఉద్యమం చెలరేగిన సమయంలో గౌతు లచ్చన్న వంటి నాయకులు తెలంగాణ ప్రాంతంలో పర్యటనలు జరిపి రెండు ప్రాంతాలలోని కాంగ్రెస్ నాయకులు కలసి గౌరవప్రదంగా రెండు రాష్ట్రాల ఏర్పాటుకు కృషి చేయాలని చేసిన విజ్ఞప్తులు అరణ్య రోదనగానే మిగిలాయి. **ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం 19వ శతాబ్దం తొలి రోజుల నుండే మనం పోరాటాలు చేస్తుంటే ఇప్పుడు అర్ధాంతరంగా రాష్ట్ర విభజన చేశారనే నిందలు వేస్తున్నారు.**

వాస్తవానికి రాష్ట్ర విభజన చేయమని ఒకసారి కాదు రెండు సార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు ఇచ్చిన పెద్దలు, దమ్ముంటే అసెంబ్లీలో రాష్ట్ర విభజన కోరుతూ తీర్మానం ప్రవేశ పెడితే మద్దతు ఇస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు సహితం ఆ విధంగా మాట్లాడుతూ ఉండటం ఆశ్చర్యం కలుగుతుంది. ప్రజలను రాజకీయ అవసరాల కోసం తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు 1952 నుండి జరుగుతూనే ఉన్నాయని బాధ కలుగుతుంది.

రాష్ట్ర విభజన సమయంలో విభజన సక్రమంగా జరిగేటట్లు చూడకుండా, ఈ ప్రాంతపు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే విధంగా చేసే ప్రయత్నం చేయకుండా – 'సమైక్య ఉద్యమం' అంటూ నాటి అధికార, ప్రతిపక్షాలు కలిసి ఒక నాటకం ఆడించారు. వాస్తవానికి 1969 తెలంగాణ ఉద్యమంలో మృతుల సంఖ్య 300కు లోపుగానే ఉంటూ ఉంటే 1972–73లో జరిగిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమంలో 350 మంది వరకు పోలీస్ కాల్పులలో చని పోయారు. వీరందరి త్యాగాలు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం కాదా ? అలాంటప్పుడు –'మనం విభజన కోరుకోలేదు' అని జనం ముందు ఏ విధంగా అనగలుగుతున్నారు ? ఇదంతా ప్రజలను మోసం చేయడం కాదా ?

ఆ సమయంలో రాష్ట్రపతి పాలనను విధించి క్రూరంగా ఈ ఉద్యమాన్ని అణచడం కోసం నాటి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేసింది. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు విధ్వంసాలకు, హింసకు పాల్పడినా ప్రేక్షక పాత్ర వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, శాంతియుతంగా ఉద్యమించిన ఆంధ్రులపై మాత్రం పాశవికంగా దాడి జరపారు.

రోజుల తరబడి అనేక పట్టణాలలో కర్ఫ్యూను విధించారు. పలుచోట్ల పోలీస్ కాల్పులు జరిపారు. వేలాదిమందిని అరెస్ట్ చేసారు. మూడు నెలలకు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలను ఉద్యమకారులు స్తంభింప చేసారు. స్థానిక పోలీస్‌లు ఉదాసీనంగా వ్యవహరించవచ్చని ప్రభుత్వం సి ఆర్ పి ఎఫ్ బలగాలను ప్రజలపైకి ఉసిగొల్పింది. జలియన్ వాలాబాగ్ ఉదంతాన్ని తలపించే రీతిలో పలు చోట్ల ప్రజలపై క్రూరమైన దాడులకు పాల్పడ్డారు.

విజయవాడలో నాడు పివి నరసింహారావు ప్రభుత్వం, సమైక్య వాదం వినిపిస్తున్న వామపక్షాలు కలసి ప్రదర్శన జరిపే ప్రయత్నం చేయగా వేలాదిమంది యువకులు, విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన పోలీస్ కాల్పులలో అమాయకులైన యువకులు మృతి చెందారని తెలుసుకొని నాటి మంత్రి కాకాని వెంకటరత్నం గుండె పగిలి చని పోయారు. **ఎంతో బలవంతురాలైన ఇందిరాగాంధీ ప్రభుత్వాన్నే ఉద్యమకారులు స్తంభింప చేసినా నాటి కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం ప్రదర్శించిన – 'రాజీ ధోరణి' కారణంగా ఆ ఉద్యమం ఫలించలేదు. పైగా అప్పటి నుండి ఆంధ్రప్రాంతం అభివృద్ధి స్తంభించి పోయింది.**

స్వాతంత్ర్యం అనంతరం చెప్పుకోదగిన ఒక్క కేంద్ర సంస్థగాని, భారీ పరిశ్రమగాని, మౌలిక సదుపాయం కల్పనగాని ఆంధ్ర ప్రాంతంలో జరగనే లేదు. కేవలం విశాఖపట్నంలో ఓడరేవు ఉండటం, నావికాదళం ఉండడంతో తప్పనిసరిగా కొన్ని కేంద్ర పరిశ్రమలు వచ్చాయి. ఆంధ్రులు ఉధృతంగా ఉద్యమం జరిపితే మొక్కుబడిగా ముందు అనుకున్న ఉక్కు కర్మాగారాన్ని మూడు ముక్కలుగా చేసి, ఒక ముక్కను మాత్రమే ఇక్కడ ఏర్పాటు చేసారు. ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం వీరోచిత పోరాటాలు, లెక్కకు మించి త్యాగాలు ఈ ప్రాంత ప్రజలు చేసిన చరిత్రను విస్మరించి – 'మనం ఈ విభజన కోరుకోలేదు' అని రాజకీయ నాయకులు ఏ విధంగా చెప్పగలరో అర్థం కాదు.




**జనమాలి**
ఒక ఆదర్శ ఐ.ఏ.ఎస్. అధికారి అంతరంగం
రచన : డా॥పి.వి.రంగనాయకులు
వెల: రు.100/-
ప్రతులకు : ఎన్.ఎల్.కె. శ్రీనాథ
ఇం.నెం. ఎ2, శీలమ్స్ రెసిడెన్సీ,
రోడ్ నెం.5, జవహర్ నగర్,
కవాడిగూడ,
హైదరాబాద్ - 500 020
సెల్ : 8919713955

"ప్రజాసేవ ఉత్తేజ పరిచేదీ, గర్వించదగినదీ, ఆహ్లాదాన్ని కలిగించేదీ అయినా బాధ్యతతో కూడిన పని. అది కేవలం ఒక జీవన విధానం కాదు, అది ఒక పరిపూర్ణమైన జీవనం చేయటానికి ఉపయోగపడే మార్గం" - లీ హేమిల్టన్

ఒక ప్రభుత్వ అధికారిగా సుపరిపాలనే ధ్యేయంగా, నిజాయితి, చిత్తశుద్ధి, అంకిత భావం, అవినీతి అక్రమాలను నిరోధించటం, నమ్మిన ఆదర్శాల కోసం ఎటువంటి ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లొంగక పోవటం- ఈ లక్షణాలన్నీ యింకా చాల మంది ప్రభుత్వ అధికారులలో ఉండబట్టే దేశం కొద్దిగానైనా అభివృద్ధి సాధిస్తోంది. అయితే 'పురుషులందు పుణ్య పురుషులు వేరయా' అన్నట్లుగాను, నింగిలో మెరిసే తారలలోధ్రువతార భిన్నం అయినట్లుగాను నందివెలుగు ముక్తేశ్వరరావుగారు ప్రత్యేకమైన వ్యక్తి. ప్రజాసేవే పరమావధిగా సమర్థుడు, అవిశ్రాంత సేవకుడు, మానవత్వం నిండిన మేధస్సు గల్గి, పేదల పక్షపాతిగా, రైతు బాంధవునిగా, నిజాయితీగల ఉద్యోగులను ప్రోత్సహిస్తూ, అందరినీ కలుపుకొనిపోయి పరిపాలనలో తన దైనముద్ర వేసిన ఒక ఉత్తమ ప్రభుత్వ అధికారిగా మన్ననలు పొందారు. వారి ఆదర్శప్రాయమైన, స్ఫూర్తిమంతమైన జీవితాన్ని 'జనమాలి' పేరున జీవిత చరిత్రగా మనముందు ఉంచారు డాక్టర్ పి.వి. రంగనాయకులు.

ముక్తేశ్వరరావుగారు తన ప్రభుత్వ సర్వీసులో- గ్రూపు-1 అధికారిగా, సిటిఓగా,డిప్యూటీ కలక్టరుగా, తితిదే లో ఎస్టేట్ ఆఫీసరుగా, జె.ఇ.ఓగా, ఎండోమెంట్స్ కమీషనరుగా, హాథీరాం మఠం అధికారిగా, ఆదిలాబాదు, హైదరాబాద్ జిల్లాల జాయింటు కలెక్టరుగా, నల్గొండ జిల్లా కలెక్టరుగా ఇలా పనిచేసిన ప్రతిచోట తనదైన ప్రత్యేకతను పరిపాలనద్వారా అందించి ఎంతో పేరు ప్రఖ్యాతులు పొంది జనహృదయాలను గెలుచుకుని 'జనమాలి' గా నిలిచారు. ఎన్నో కార్యక్రమాలు చేపట్టి తన ఉద్యోగ ప్రస్థానంలో ప్రజారంజకమైన పరిపాలన చేసిన శ్రీ ముక్తేశ్వర రావు గారిని విశిష్ట స్థానంలో నిలబెట్టిన ఎన్నో అంశాలను రచయిత చాల చక్కగా ఉదాహరణ పూర్వకంగా వివరించారు. అందులో ప్రధాన మైనవి- రెవెన్యూపాలన లో నూతన పద్ధతులను - ముఖ్యంగా రెవెన్యూ సదస్సులు ప్రారంభించటం, ఆపరేషన్ కొల్లేరు, అర్బన్ లాండ్ సీలింగ్ ని సమర్థవంతంగా పర్యవేక్షణచేయటం, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు మన రాష్ట్రానికి సరిపడదని, అటువంటి ఏర్పాటు సాధ్యం కాదని అప్పటి ముఖ్యమంత్రి ప్రతిపాదనలను ధైర్యంగా వ్యతిరేకించటం, చిత్తూరు జిల్లా కలెక్టరుగా అందించిన విశిష్ట సేవలు- స్త్రీలలో చైతన్యాన్ని తీసుకుని రావటానికి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగాను సభలు, సమావేశాలు సాంస్కృతిక కార్యక్రమాలు, అవగాహనా సదస్సులు నిర్వహించారు. సమకాలీన అంశాల పై కళాకారులతో ప్రదర్శనలు యిప్పించారు. ఈ క్రమంలో కళాకారులను ప్రోత్సహించి వెన్ను తట్టి సహాయ సహకారాలు అందించారు. ఆ విధంగా ప్రజలలో చైతన్యం తీసుకుని రాగలిగారు.

ఇవన్నీ ఒక ఎత్తయితే, తెలుగు భాష పరిపాలనా భాషగా అమలు చేసి తాను నల్గొండ కలెక్టరుగా ఉన్న(2011-2013) కాలంలో అన్ని విభాగాల అధికారులను సమావేశపరచి దస్త్రాలను, గస్తీ పత్రాలను, తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలను, అందుకు అవసరమైన పదకోశాలను తయారుచేసి జిల్లా పాలన తెలుగులో సాగించి, తెలుగును కార్య భాషగా, పరిపాలన తెలుగు ద్వారా సులభ సాధ్యం అని నిరూపించారు. సంస్కృతాంధ్రాంగ్ల భాషలలో పాండిత్యం కలిగిన శ్రీ ముక్తేశ్వర రావు రచయితగా వందలాది పాటలు వ్రాసారు. అన్నమాచార్య కీర్తనలు కొన్నిటికి రాగ రచన చేసారు. 'శుభప్రదం'(తితిదే వారి ప్రచురణ) నిర్వహణ, అర్చకులకు శిక్షణ, 'శ్రవణం' పేరున బధిరులకు మెరుగైన చికిత్సావిధానాలను, వినికిడి యంత్రాలను అందించారు. 2014 లో పదవీ విరమణ అనంతరం, తితిదే ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా సనాతన ధర్మపునర్నిర్మాణ మార్గదర్శిగా సేవలందిస్తున్నారు.

శ్రీ ముక్తేశ్వర రావు గారి ఉన్నత జీవితానికి దర్పణం పట్టిన ఈ జీవిత చరిత్ర 'జనమాలి' పరిమాణంలో చిన్నదే అయినా ప్రమాణంలో విశిష్టమైనదిగా అనిపిస్తుంది. ఈ పుస్తకం నేటితరం వారందరికీ స్ఫూర్తి దాయకం.

ఎమ్.వి.శాస్త్రి
94413 42999

## కరీంనగర్‌లో సురవరం ప్రతాపరెడ్డి 123వ జయంతి




సురవరం ప్రతాపరెడ్డి జయంతిని మే 28న తెలుగుజాతి వారసత్వ దినోత్సవంగా కరీంనగర్‌లో జరిపారు. ఈ కార్యక్రమాన్ని శరత్ సాహితీ కళా స్రవంతి, తెలుగు భాషోద్యమ సమితి కలిసి నిర్వహించాయి. సురవరం ప్రతాపరెడ్డి జయంతిని ప్రతి ఏటా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి అని, ఆయన పేరున ఒక ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని ప్రతి ఏటా ప్రకటించాలి అని ప్రధానోపన్యాసం చేసిన తెలుగు భాషోద్యమ సమితి కరీంనగర్ బాధ్యుడు సంకేపల్లి నాగేంద్రశర్మ, సభకు అధ్యక్షత వహించిన రచయిత సబ్బని లక్ష్మీనారాయణ కోరారు. జి. కాళీదాస్, టి. లక్ష్మీనారాయణ, శారద, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



**అనప పువ్వులు : కవితల కూర్పు ;**
పుటలు: 128, వెల: రు.100/-,
కూర్పు : డా॥ అగరం వసంత్,

**సామెతల సప్పరము :** హోసూరు కథలు ;
రచన : అగరం వసంత్ ; పుటలు: 128,
వెల: రు.100/-




ప్రచురణ : కృష్ణగిరి జిల్లా రచయితల సంఘం
ప్రతులకు: డా॥ ఎన్. వసంత్, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635 109, తమిళనాడు. సెల్ : 09488330209



**కైవారం నారాయణ తాతగారి రచనలు – చిరు పరిశీలన :** వ్యాస సంపుటి ;
రచన : అగరం వసంత్ ; పుటలు: 88,
వెల: రు.100/-, ప్రతులకు: డా॥ ఎన్. వసంత్, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635 109, తమిళనాడు.
సెల్ : 09488330209

మహారాష్ట్ర తెలుగువారి
**శతాధిక కవుల సంచిక 2018:**కవిత్వం;
సంపాదకత్వం: సంగెవేని రవీంద్ర ; పుటలు: 264, వెల: రు.250/-, ప్రచురణ: తెలుగు కళా సమితి, ప్రతులకు: తెలుగు కళా సమితి, ప్లాట్ నెం. 13, సెక్టార్-9 ఎ, వాషి, నవీ ముంబయి-400 703;
సెల్ :+91 9820840285






**కాకతీయ బలిజ కాపు రాజుల చరిత్ర :**
రచయిత :భట్టరుశెట్టి పద్మారావు రాయలు
పుటలు: 284, వెల: రు.150/-
ప్రతులకు: పుట్టా జనార్ధనరావు, ఇం.నెం. 10-33-11, అమరావతి ఫ్లాట్స్, చెంచుపేట, తెనాలి – 522 202, గుంటూరు జిల్లా.
సెల్ : 9441693295

**వకుళాభరణం లలిత** ఒక చారిత్రక జ్ఞాపకం:
వ్యాసాలు, పుటలు: 144, వెల: రు.100/-
ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, 27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ – 2
సెల్ : 0866 2577533





**నాన్నకుర్చీ :** వచన కవితలు,
పుటలు: 84, వెల: రు.100/-, ప్రతులకు: ఆంధ్రీకుటీరమ్, పల్లిపాలెం, వయా యానాం – 533 464, నెహ్రూ సాహిత్య సమితి, 1-125, వెలంపాలెం, ద్రాక్షారామ – 533 262
ఫోన్: 9704186544

**అజో-విభొ-కందాళం**
**ప్రతిభా వైజయంతి 2018 :**
సన్మానోత్సవసంచిక ;
సంపాదకులు : మోదుగుల రవికృష్ణ ; పుటలు: 242, వెల: రు.220, ప్రచురణ కర్తలు : అజో-విభొ- కందాళం ఫౌండేషన్, 3-3-24/1, ఎక్సోటేహౌస్, కాచిగూడ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ – 27, ఫోన్: 040 64512224





**కడప నారాయణదాసు సంకీర్తనలు** (కీర్తనలు)
కూర్పరి : స.వెం.రమేష్, పుటలు : 172, వెల: రు.100/-, ప్రతులకు: ఓట్ర పురుసోత్తం, ఎ 687, బి.హెచ్ ఇ.ఎల్ టౌన్‌షిప్, రాణీపేట, వేలూరు జిల్లా, తమిళనాడు – 632406.
ఫోను : +91 9626217868

**సంస్కృతి** (వ్యాస సంపుటి) :
సంపాదకత్వం :గౌరవ్
పుటలు:144, వెల: రు.100/- ప్రచురణ: ప్రత్యామ్నాయ ప్రస్థాన కేంద్రం
ప్రతులకు : గౌరవ్
సెల్ : 9032094492





**విద్యా విలాసము :** పద్యాలు.
రచన:కొల్లు మధుసూదనరావు పుటలు:40, వెల:రు40/-ప్రచురణ : స్వెస్ పబ్లికేషన్స్, ప్రతులకు : ఎస్.వి.ఎస్.ఎస్. పబ్లికేషన్స్, 1-6-141 19, విద్యానగర్, సూర్యాపేట – 508213, సెల్ : 9848420073

**ఆంధ్రుల అందాల తార కాంచనమాల :**
వ్యాసాలు ; రచన:బి.ఎల్. నారాయణ;
పుటలు: 16, వెల: రు.20/-, ప్రతులకు: తెనాలి ప్రచురణలు, 22-5-42, సరోజినినాయుడు వీధి, కొత్తపేట, తెనాలి – 522 201
సెల్ : 95509 30789



Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# తెలుగు లిపి పరిణామం




(తిరుమల రామచంద్ర : మన లిపి పుట్టుపూర్వోత్తరాలు 1957)

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
June 2018 Vol : 4, Issue 4
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20




if not deliverd, please return to : 'The publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244